# ప్రజా విముక్తి


మరణశయ్యపై మరమగ్గాలు.17
సిద్ధాంత వ్యాసం ....18
అన్నం పెట్టే రైతు చేతులకు ..24
వారసత్వ ఉద్యోగాలకై పోరు.26
అమరవీరుల చరిత్రలు ......28
పోరాట వార్తలు ....31
పత్రికా ప్రకటనలు ......32



**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక**


**సంపుటి:5 సంచిక:2 ఆగస్టు- 2017**


# అక్టోబర్ విప్లవం శతాబ్ది ప్రత్యేక సంచిక

**రష్యా విప్లవానికి 100 సం॥రాలు నిండిన సందర్భాన్ని పురస్కరించుకొని విప్లవానికి జేజేలు తెలియజేద్దాం.**

**తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ఉత్సవాలను నిర్వహిద్దాం.**

పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాద దశలోకి ప్రవేశించి పతనం వైపు పరుగులు తీస్తున్న క్రమంలో లెనిన్ నాయకత్వాన రష్యాలో విప్లవం విజయవంతమైంది. మార్క్సిజం లెనినిజంగా గుణాత్మకంగా ఎదిగింది. ప్రపంచ సోషలిస్టు విప్లవ కర్తవ్యాల పరిపూర్తికి రష్యాలో లెనిన్, స్టాలిన్‌లు సోషలిస్టు సమాజ నిర్మాణాన్ని ఆచరణలో సుసాధ్యం చేసి మార్క్సిజం అజేయమని చాటి చెప్పారు. కామ్రేడ్ మావో నాయకత్వంలో చైనా విప్లవం విజయం సాధించడంతో అది ప్రపంచంలో వలస, అర్ధ వలస దేశాలకు విప్లవ మార్గాన్ని చూపింది.



మార్క్సిజం ఒక సిద్ధాంతంగా అభివృద్ధి చెంది కార్మిక వర్గ అగ్రగామి దళంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాలు ఏర్పడి విజయాలు సాధించాయి. రష్యా విప్లవం విజయంతో ప్రపంచవ్యాప్తంగా సమ సమాజ లక్ష్యంతో కమ్యూనిస్టు పార్టీలు ఆవిర్భవించాయి. రష్యా సోషలిస్టు విప్లవ పురోగమనానికి కామ్రేడ్స్ లెనిన్, స్టాలిన్‌లు నిర్వహించిన పాత్రతో వారు శక్తివంతులయ్యారు. వారు మనకు గురువులు, మార్గదర్శకులు. ఆ మార్గంలో మనం పురోగమించేందుకు వారి నుండి నేర్చుకోవాలి. అందుకని ముందుగా వాళ్ళ చరిత్రను తెలుసుకుందాం.

## వ్లదిమీర్ ఇల్యిచ్ లెనిన్

రష్యాలోని సింబ్రిస్క్ నగరంలో వ్లదిమీర్ ఇల్విచ్ లెనిన్ 1870 ఏప్రిల్ 22న జన్మించాడు. అతని తండ్రి రైతు కుటుంబంలో పుట్టి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాడు. అన్న అలెగ్జాండర్ నరోద్నాయ వోల్యా అనే టెర్రరిస్టు సంస్థలో పని చేశాడు. 1887లో అతనిని జారు ప్రభుత్వం ఉరితీసింది. లెనిన్‌కు సెయింట్ పీటర్స్‌బర్గ్, మాస్కో విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం నిరాకరించడంలో కజాన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. అక్కడ మార్క్సిస్టు బృందంలో చేరి విప్లవకర విద్యార్థి ఉద్యమంలో పని చేశాడు. అక్కడ నుండి బహిష్కరించడం వలన సమారాకు వెళ్ళి స్వయంగా మార్క్సిస్టు బృందాన్ని ఆర్గనైజ్ చేశాడు. ప్రైవేటుగా చదివి సెయింట్ పీటర్స్‌బర్గ్ యూనివర్సిటీ నుండి న్యాయశాస్త్ర పట్టభద్రుడయ్యాడు. ఆయన ఎప్పుడూ ఆ వృత్తిని చేయలేదు. సెయింట్ పీటర్స్ బర్గ్‌లో కేంద్రీకరించి 1895 నాటికి మార్క్సిస్టు కార్మిక బృందాలన్నింటినీ శ్రామిక విమోచనా పోరాట సమితి అనే ఒక సంస్థలో ఐక్యం చేశాడు. ఈ విధంగా లెనిన్ విప్లవకర, మార్క్సిస్టు కార్మిక వర్గ పార్టీని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేశాడు.

1895 నుండి 1905 విప్లవం వరకు 10 సంవత్సరాల కాలంలో

లెనిన్ సిద్ధాంత రాజకీయ విషయాల్లో ఎంతో అభివృద్ధిని సాధించాడు. మొదట నరోడ్నిజంపై సిద్ధాంత పోరాటం నడిపి దానిని ప్రజల పట్ల విశ్వాసం లేనిదిగా నిరూపించాడు. కార్మిక వర్గ విప్లవకర మైత్రి జారు రాచరికాన్ని, భూస్వాములను, బూర్జువా వర్గాన్ని కూలదోయడానికి ప్రధాన సాధనం అని స్పష్టపరిచాడు. 1897 నుండి 3 సంవత్సరాల ప్రవాస శిక్షా కాలంలో లెనిన్ సైబీరియాలో ఉండి 'రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి' అనే గ్రంథం రాసాడు. అందులో రష్యాలో పెట్టుబడిదారీ విధానం ఒక యాదృచ్ఛిక ఘటన అన్న నరోడ్నిక్‌ల వాదనను ఖండించడంతో పాటు నరోడ్నిజాన్ని సైద్ధాంతికంగా ఓడించాడు.

1899లో బెర్న్ స్టీనిజంతో సన్నిహితంగా ముడిపడిన ఒక రకం అవకాశవాదం 'ఆర్థిక వాదం' ప్రణాళిక రూపం ముందుకొచ్చింది. అది విప్లవకర మార్క్సిజాన్ని, కార్మికవర్గపు స్వతంత్ర రాజకీయ పార్టీ అనే భావనను, రాజకీయ డిమాండ్లను వ్యతిరేకించింది. లెనిన్ ప్రవాసం నుండి రావడంతోనే ఈ ఆర్థిక వాదానికి వ్యతిరేకంగా శక్తివంతమైన పోరాటాన్ని నడిపాడు.

1900 డిసెంబర్‌లో 'ఇస్క్రా' పత్రికను అఖిల రష్యా స్థాయిలో వారపత్రికగా, తెచ్చాడు. 1901 మే లో 'ఎక్కడి నుండి ప్రారంభించాలి' అనే వ్యాసంలోను, 1902 లో వెలువడిన 'ఏం చేయాలి' అనే గొప్ప రచన ద్వారాను ఆర్థిక వాదుల అవకాశవాద తత్వశాస్త్రం పైన తీవ్రమైన దాడిని ప్రారంభించి, ఐక్య రాజకీయ పార్టీ నిర్మాణానికి రాజకీయ సన్నాహం పూర్తి చేసాడు.

1902లో ఆర్థికవాదుల సంకుచిత రాజకీయ అభిప్రాయాలపై, అవకాశవాద విధానాలపై విమర్శ చేస్తూ లెనిన్ 'ఏం చేయాలి?'లో పటిష్టమైన మార్క్సిస్టు సిద్ధాంత పునాదిపై విప్లవకారులకు ఆచరణలోనూ, సిద్ధాంతంలోనూ తర్ఫీదు ఇవ్వాలని కేంద్రీకృత, క్రమశిక్షణాయుత నిర్మాణం అవసరం అని నొక్కి చెప్పాడు. 1904లో ఆర్ఎస్‌డీఎల్‌పీ ద్వితీయ మహాసభల్లో పార్టీ సభ్యత్వాన్ని ఆమోదించడానికి పార్టీ నిర్మాణంలో ఏదో ఒక యూనిట్‌లో చేరాలన్న నిబంధనను వ్యతిరేకిస్తూ పార్టీలో మైనారిటీ వర్గం చీలికను తెచ్చింది.

పార్టీలో లెనిన్ వాదనలకు మెజారిటీ రావడంతో అప్పటి నుండి లెనిన్ నాయకత్వంలోని పార్టీ బోల్షివిక్ పార్టీగా పిలువబడుతుంది. తరువాత కాలంలో మైనారిటీ (మెన్షివిక్కులు) ఇస్క్రా పత్రిక సంపాదక వర్గంలో మెజారిటీ సంపాదించి "పార్టీ నిర్మాణం మరింత కఠినంగా ఉందని, పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండకుండా స్వేచ్ఛనివ్వాలని" అవకాశవాదంతో పార్టీ నిర్మాణ సూత్రాలపై దాడి చేసారు. "ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి"లో లెనిన్ క్రమశిక్షణాయుతమైన కేంద్రీకృత కార్మిక వర్గ పార్టీ (నూతన పార్టీ) ఆవశ్యకతను స్పష్టపరిచాడు.

1905 బూర్జువా ప్రజాస్వామిక విప్లవం ఓడిపోయింది. దానిని విశ్లేషిస్తూ కామ్రేడ్ లెనిన్ "డ్రెస్ రిహార్సల్" అంటాడు. 1905 విప్లవ ఓటమి అనుభవ గుణపాఠాలు 1917 అక్టోబరు విప్లవానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. సార్వత్రిక తిరుగుబాటుకు అగ్రగామి వర్గం మీద, ప్రజా విప్లవ వెల్లువ మీద ఆధారపడాలన్నాడు. విప్లవ చరిత్ర పురోగామి వర్గాల అభివృద్ధిలో పురోగామి శ్రేణుల కార్యకలాపాలు అత్యున్నత స్థాయిలో ఉండాలన్నాడు.



1914లో స్విట్జర్లాండులో ప్రవాస జీవితం గడుపుతున్న సమయంలో కామ్రేడ్ లెనిన్ భౌతికవాద తత్వశాస్త్రం, గతితర్కం, చారిత్రక భౌతికవాద దృక్పథం, వర్గపోరాటం, మార్క్స్ ఆర్థికసిద్ధాంతం, సోషలిజం, కార్మిక వర్గ పోరాట ఎత్తుగడలు అనే 7 మార్క్స్ బోధనాంశాలపై అవగాహన కల్పిస్తూ మార్క్సిస్టు సిద్ధాంతంలోని శాస్త్రీయ సోషలిజాన్ని సిద్ధాంత-ఆచరణల మధ్య ఐక్యతను వివరిస్తాడు. లెనిన్ మార్క్సిస్టు సూత్రాలపైననే ఆధారపడ్డాడు. నూతన చారిత్రక పరిస్థితులలో ఆ సూత్రాలను అభివృద్ధి చేసి:

1. సామ్రాజ్యవాదం, గుత్తపెట్టుబడిదారీ విధానం గురించి విశ్లేషణ; 2. కార్మిక వర్గ నియంతృత్వం; 3. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణం; 4. కార్మిక వర్గ నాయకత్వ పాత్ర; 5. జాతుల వలసల సమస్య; 6. కార్మిక వర్గ పార్టీ అనే అంశాలను పరిపుష్టం చేశాడు. అందుకే లెనినిజం "సామ్రాజ్యవాదం, కార్మిక వర్గ విప్లవ యుగానికి చెందిన మార్క్సిజం"గా చెబుతున్నాం.

మొదటి ప్రపంచ యుద్ధాన్ని (సామ్రాజ్యవాద యుద్ధాన్ని) అంతర్యుద్ధంగా మార్చాలన్న పిలుపునిస్తూ 1914 నవంబర్ 1న ఒక కార్యక్రమాన్ని ఆర్ఎస్‌డీఎల్‌పీ విడుదల చేసింది. రెండవ ఇంటర్నేషనల్ నాయకులు సృష్టించిన గందరగోళాన్ని తొలగించేందుకు సైద్ధాంతిక కృషి చేసి "సోషలిజం-యుద్ధం" 1915 సెప్టెంబర్‌లో జినోవేవ్‌తో కలిసి రచించాడు. దానిలో కాట్స్కీయిజాన్ని, మార్క్సిజానికి వాళ్లు చేసిన వక్రీకరణలను ఖండించాడు.

1917 ఫిబ్రవరి బూర్జువా ప్రజాస్వామిక విప్లవం విజయవంతమయ్యింది. సుదీర్ఘ ప్రవాసం తరువాత లెనిన్ 1917, ఏప్రిల్ 16న పెట్రోగ్రాడ్‌కు వచ్చి బోల్షివిక్‌ల సమావేశంలో సుప్రసిద్ధమైన తన 'ఏప్రిల్ థీసిస్' ను ప్రతిపాదించాడు. తాత్కాలిక ప్రభుత్వాన్ని ఓడించాలని, రాజ్యాధికారాన్ని సోవియట్లకు బదలాయించాలని ఆయన పిలుపునిచ్చాడు. శాంతి, భూమి, రొట్టెలకు హామీ లభించేటటువంటి కార్యక్రమం ప్రతిపాదించాడు.

ఎ. రాజ్యం వర్గ పాలనకు సాధనం; బి. పెట్టుబడిదారీ రాజ్య యంత్రాన్ని ధ్వంసం చేయాలి. కార్మిక వర్గ రాజ్యాన్ని ఏర్పాటు చేయాలి; సి. పార్లమెంటరీ తత్వంలేని నూతన తరహా ప్రజాస్వామ్యం, కార్మిక వర్గ ప్రజాస్వామ్యం నెలకొల్పాలి; డి. "శక్తి మేరకు పని-పనిని బట్టి ప్రతిఫలం" అన్న సూత్రంతో సోషలిస్టు ఆర్థిక పునాది గల సమాజం ఏర్పడుతుంది. కమ్యూనిజానికి పరివర్తన చెందే సమయంలో అనేక వైరుధ్యాలు పరిష్కారమవుతాయి. ఆ క్రమంలోనే రాజ్యం క్రమంగా

అంతరిస్తుంది అన్నాడు. రాజ్యాంగ యంత్రం గురించి, శ్రామిక వర్గ నియంతృత్వం గురించి, సోవియట్ల నిర్మాణం గురించి శాస్త్రీయమైన అవగాహనను అందించాడు.

విప్లవ వెల్లువ పోటెత్తుతున్న సమయంలో అక్టోబర్ 20న లెనిన్ పెట్రోగ్రాడ్ వచ్చాడు. కేంద్ర కమిటీ సమావేశం జరిపి కొద్ది రోజుల్లోనే సాయుధ తిరుగుబాటు ప్రారంభించాలని నిర్ణయించారు. 1917 నవంబర్ 7న రాజ్యాధికారం సోవియట్ల చేతుల్లోకి వచ్చింది.

రష్యా అక్టోబర్ సోషలిస్టు విప్లవ విజయం తర్వాత సోవియట్ల కాంగ్రెస్ శాంతి, భూమి, సమస్యలపై శాసనాలు చేసింది. సోవియట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దానికి కామ్రేడ్ లెనిన్‌ను ప్రథమ అధ్యక్షుడుగా ఎన్నుకున్నది.

మార్క్సిజం–లెనినిజం నాయకత్వంలో మొట్ట మొదటి విప్లవకర కార్మికవర్గ రాజ్యం ఆవిర్భవించింది.

ట్రాట్స్కీ విధానాల్ని ఓడించిన లెనిన్ నాయకత్వం జర్మనీతో శాంతి ఒప్పందం చేసుకుంది. తర్వాత విదేశీ, స్వదేశీ శక్తులు కుట్ర పూరితంగా రష్యాపై దాడికి దిగితే లెనిన్ 'యుద్ధ కాల కమ్యూనిజం' అనే విధానాన్ని ప్రవేశపెట్టి ప్రజలందరినీ సమీకరించి సామ్రాజ్యవాదుల కుట్రలను ఓడించాడు. 1919 మార్చిలో మూడవ ఇంటర్నేషనల్‌ను స్థాపించి ప్రపంచ వ్యాపిత సోషలిస్టు విప్లవాన్ని వేగవంతం చేసే కృషి చేసాడు. సోవియట్ రష్యా విప్లవ స్థావర కర్తవ్యాలను నిర్వహించింది. రష్యాలో ఆర్థిక పునరుద్దరణ కొరకు నూతన ఆర్థిక విధానానికి (ఎన్.ఇ.పీ.) విధానపరమైన మార్పు జరిగింది. సోషలిస్టు నిర్మాణంలోని తరువాతి దశ సోషలిస్టు పారిశ్రామికీకరణకు పురోగమించింది.

రష్యా అక్టోబరు సోషలిస్టు విప్లవం ప్రపంచ చరిత్రలో ఒక మూల మలుపు. సామ్రాజ్యవాద వ్యవస్థకు అది గండి కొట్టింది. ఉత్పత్తి సాధనాలు ప్రజలపరం అయ్యాయి. పాత రాజ్య వ్యవస్థ ధ్వంసం అయ్యింది. నూతన యుగానికి కార్మిక వర్గ విప్లవ యుగానికి నాంది పలికింది. పీడిత జాతులకు నిజమైన స్వేచ్ఛ, సమానత్వం లభించాయి. వలసల విముక్తికి, విప్లవాల యుగానికి నాంది పలికింది. సోషల్ డెమోక్రసీ అవకాశవాదాన్ని, సంస్కరణవాదాన్ని ఓడించి కార్మికవర్గ సిద్ధాంతమైన మార్క్సిజం విప్లవ విజయాన్ని సాధించింది.

"జాతుల స్వయం నిర్ణయాధికార హక్కు" అనే గ్రంథంలో లెనిన్

ఎ. జాతీయోద్యమం ఫ్యూడలిజంపై పెట్టుబడిదారీ వ్యవస్థ విజయంతో ముడిపడినది; బి. అన్ని రకాల జాతి పీడనలను కార్మిక వర్గం వ్యతిరేకించాలి. జాతుల స్వయం నిర్ణయాధికార హక్కులను బలపరచాలి. జాతుల సమస్యను నిర్దిష్ట పరిస్థితుల వెలుగులో పరిష్కరించాలి; సి. బూర్జువా జాతీయ వాదాన్ని వ్యతిరేకించాలి; డి. కార్మిక వర్గానికి జాతీయపరమైన డిమాండ్లు వర్గపోరాట ప్రయోజనాలకు లోబడి ఉండాలి. అత్యంత బలమైన అంతర్జాతీయ ఐక్యతను స్థాపించడానికి తోడ్పడాలి అన్నాడు.

సోవియట్ ప్రభుత్వం 'నిరంకుశ ప్రభుత్వం' అని రాసిన కాట్స్కీకి సమాధానంగా "కార్మిక వర్గ విప్లవం, ద్రోహి కాట్స్కీ" అనే గ్రంథాన్ని 1918లో లెనిన్ రాశాడు. అందులో కార్మిక వర్గ ప్రజాస్వామ్యం, బూర్జువా ప్రజాస్వామ్యాల మధ్య గల తేడాను వివరించి, వర్గాలున్నంత వరకు స్వచ్ఛమైన ప్రజాస్వామ్యం ఉండదని కార్మిక వర్గ పాలన అంటే అత్యధికుల పాలన అని, బూర్జువా వర్గాన్ని అణిచి ఉంచుతుందని వివరించాడు.

లెనిన్ ప్రామాణిక రచనల్లో 'ఏం చేయాలి?', 'సామ్రాజ్యవాదం –పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ', 'రాజ్యం –విప్లవం', 'శ్రామికవర్గ విప్లవం, స్వపక్ష పరిత్యాగి కాట్స్కీ', 'వామపక్ష కమ్యూనిజం–ఒక బాలారిష్టం', 'ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి', 'రష్యాలో విప్లవారంభం', 'ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీ యొక్క రెండు ఎత్తుగడలు', 'మాస్కో తిరుగుబాటు గుణపాఠాలు', 'జాతుల స్వయం నిర్ణయహక్కు', 'విప్లవంలో శ్రామికవర్గ కర్తవ్యాలు' ఇంకా అనేక ముఖ్యమైన అంశాలున్నాయి.

లెనిన్ ప్రతీఘాతుక శక్తుల నుండి, రివిజనిస్టుల నుండి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పరిరక్షించడమే కాకుండా స్థల కాలాల్లో వచ్చిన మార్పుల్ని గుర్తించి ఉత్పత్తి రంగంలో, విజ్ఞాన శాస్త్రాలలో సాధించిన ప్రగతికనుగుణంగా అభివృద్ధి చేశాడు. మార్క్సిస్టు అర్థశాస్త్రాన్ని అభివృద్ధి చేస్తూ సామ్రాజ్యవాదపు ఆర్థిక రాజకీయ అంతస్సారాన్ని విశ్లేషించాడు. పెట్టుబడిలోని మౌలిక సూత్రాల ప్రాతిపదికపై ఆధారపడి సామ్రాజ్యవాదాన్ని పెట్టుబడిదారీ విధానపు ఆఖరి దశగా విశ్లేషించాడు. దాని కుళ్లును, యుద్ధ పరిస్థితుల్ని, అనివార్యమైన పతనాన్ని, విప్లవాలకు అనుకూలతను విశదీకరించాడు. గుత్త సంస్థలు, ఫైనాన్స్ పెట్టుబడి, పెట్టుబడి ఎగుమతి, అంతర్జాతీయ గుత్త సంస్థలు, ప్రపంచ విభజన అని లెనిన్ చెప్పిన సామ్రాజ్యవాద 5 లక్షణాలు ఈనాడు ప్రపంచ ప్రజలకు స్పష్టంగా కనబడుతున్నాయి. సామ్రాజ్యవాదం ప్రపంచ ఆర్థిక సంక్షోభంగా, ప్రపంచ యుద్ధాలుగా బయల్పడి అధిక ధరలు, ద్రవ్యోల్బణం, మాంద్యం, నిరుద్యోగం, అభద్రత, ఆకలి, దారిద్రం, వినాశనం, పరాయికరణ రూపాల్లో కోట్లాది ప్రజల ధన, మాన, ప్రాణాలతో చెలగాటమాడుతున్న వాస్తవం రోజూ మన అనుభవంలో ఉన్నదే.

పెట్టుబడిదారీ విధానానికి, సాధారణ విక్రయ వస్తు (సరుకు) ఉత్పత్తికి మౌలిక లక్షణం 'స్వేచ్ఛాయుత పోటీ'. దీనికి విరుద్ధమైనది గుత్తాధిపత్యం. ఇది పోటీ, ఘర్షణల కేంద్రీకరణకు, తీవ్రతకు కారణమవుతుంది. గుత్తాధిపత్యం పెట్టుబడిదారీ విధానంలో వున్నత దశనే. కానీ అది మరింత పరాన్నబుక్కు. అది మరణావస్థకు చేరువవుతున్న పరిస్థితి. అది యుద్ధాలకు, వినాశనానికి దారి తీస్తుంది. అయితే కార్మికవర్గం జాగరూకతతో వ్యవహరిస్తే అదే విప్లవాలకు తొలి సంధ్య అని కూడా లెనిన్ నిర్వచించాడు. మొదటి ప్రపంచ యుద్ధం గురించి1917 అక్టోబర్ రష్యన్ విప్లవ కాలంలో లెనిన్ చేసిన ఈ విశ్లేషణ ఆనాడు రష్యన్ విప్లవ ఆచరణలో విజయం సాధించింది.

1929 నాటి మహామాంద్యం పరిస్థితిని తలపింపజేస్తూ, మారుతున్న ప్రపంచ ఆర్థిక, రాజకీయ పరిస్థితులు నేటికి కూడా ఆ విశ్లేషణ సరైనదేనని తేటతెల్లం చేస్తున్నాయి. మార్క్స్ 'పెట్టుబడి'తో పాటుగా లెనిన్ 'సామ్రాజ్యవాదం' కూడా అధ్యయనం చేయాలని నేటి పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

తాత్విక రంగంలో రివిజనిజంగా ముందుకు వచ్చిన 'విమర్శనాత్మక అనుభవవాదం'పై ఆయన చేసిన విమర్శ అత్యంత మౌలికమైనది. రక రకాలుగా తలెత్తుతున్న అనేక బూర్జువా తాత్విక ధోరణులకు సమాధానంగా కూడా ఉంటున్నది. ఆధునిక విజ్ఞానశాస్త్ర విజయాలు భౌతికశాస్త్రంలో నూతన ఆవిష్కరణలు తెచ్చాయి. అప్పుడు మాకిస్టులు 'పదార్థం అనే భావన అంతరించిందని', చేసిన విమర్శకు సమాధానంగా ''పదార్థం నశించలేదని మరింత లోతుగా స్పష్టంగా వ్యక్తీకరించబడిందని" చెప్పాడు. పదార్థం ఒక మౌలిక తాత్విక భావన అని, వస్తుగత వాస్తవికత మన అనుభూతులకు స్వతంత్రమైన అస్తిత్వాన్ని కలిగి వుంటూనే వాటి ద్వారా కాపీ చేయబడి, ఫోటో తీయబడి ప్రతిఫలించబడుతుందని శాస్త్రీయంగా నిరూపించాడు. పదార్థానికి ప్రతిఫలించే గుణం వుంటుందని, అత్యంత ఉన్నత రూపంలో మెదడులో జరిగే పదార్థ ప్రతిఫలనమే చైతన్యమని వివరించాడు. వైరుధ్యాలను అధ్యయనం చేసి విప్లవ గతితర్కాన్ని అభివృద్ధి చేశాడు. వైరుధ్యాలను 'గతితర్కపు సారం' అని గతితర్కాన్ని 'విరుద్ధాంశాల ఐక్యతా సిద్ధాంతం' అని, గతితర్కపు అంతస్సారాన్ని నిర్వచించాడు. అలాగే గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదాల మధ్యగల సజీవ సంబంధాన్ని వివరించాడు. భౌతికవాదం పదార్థం స్వతంత్రమైనదని ఎలా గుర్తిస్తుందో అలానే చారిత్రక భౌతికవాదం సామాజిక అస్తిత్వం కూడా మానవాళి సామాజిక చైతన్యానికి బయటనే ఉంటుందని గుర్తిస్తుంది. ఈ రెండు సందర్భాలలోను చైతన్యం వాటి ప్రతిఫలనంగానే వుంటుంది. మానవునికి జ్ఞానం ప్రకృతి నుండి, ఆ సమాజపు ఆర్థిక పునాది నుండి వస్తాయని, రాజకీయ సంస్థలు ఆర్థిక పునాదిపై నిలిచే సంస్థలు అని వివరించాడు.

ఇంకా "విప్లవం ప్రజానీకం నుంచి, వ్యక్తుల నుండి ఏకాగ్రతను కోరుతుంది. నరనరం పని చేయాలని కోరుతుంది. లైంగిక విషయాల్లో విశృంఖలత్వం బూర్జువా లక్షణం. అది పతనానికి చిహ్నం. పెట్టుబడిదారీ విధానంలోని నైచ్యాన్ని, కల్మషాన్ని, క్రౌర్యాన్ని విప్లవం సహించలేదు" అంటాడు. ఈ విషయాలను క్లారా జెట్కిన్ తాను రచించిన లెనిన్ స్మృతుల్లో పొందుపరిచింది.

సామ్రాజ్యవాదం తన సూపర్ లాభాలను కార్మిక వర్గంలో ఒక సెక్షన్‌కు లంచంగా ఇచ్చి లోబరుచుకుంటుంది. కార్మిక వర్గ ఉద్యమంలో అవకాశవాదానికి ఇదే పునాది అన్నాడు.

అవకాశవాదంతో పాటు పెటీ బూర్జువా అతివాదాన్ని కూడా ఓడించి బోల్సివిక్ పార్టీ రాటుదేలిందని వివరించాడు.

తనతోపాటు సైబేరియాలో 3 సంవత్సరాలు శిక్షననుభవించిన నాదెజ్దా కృపస్కయాతో లెనిన్ పెండ్లి జరిగింది. ఇద్దరూ రాజకీయ కార్యక్రమాల్లో పరస్పరం సహకరించుకుంటూ అన్యోన్యంగా వివాహ జీవితం కొనసాగించారు.

1917 విప్లవానంతరం బోల్షివిక్కుల, ప్రజల రోజువారీ జీవితాలు ఎలా ఉన్నాయో పరిశీలించడం మీద లెనిన్ అత్యంత శ్రద్ధ పెట్టాడు. 1918 అగష్టు 30న లెనిన్ ఒక ఫ్యాక్టరీని సందర్శించి తరువాత గేటు బయట కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా ఒక దుండగుడు లెనిన్ మీద కాల్పులు జరిపాడు. ఆ గాయాల వలన తీవ్ర అనారోగ్యానికి గురైన లెనిన్ 1924వ సంవత్సరంలో జనవరి 21న తుది శ్వాస విడిచాడు.

కామ్రేడ్ లెనిన్ సామాజిక చలన నియమాలకనుగుణంగా సోషలిస్టు విప్లవ సిద్ధాంతాన్ని, సోషలిస్టు, కమ్యూనిస్టు సమాజ నిర్మాణ పద్ధతులను రచించి నూతన చారిత్రక సామ్రాజ్యవాద దశలో శ్రామికవర్గ విప్లవాన్ని నడిపి, పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి పరివర్తన చెందేందుకు కృషి చేశాడు. రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేసి నూతన సమాజ పురోగమనానికి బాటలు వేశాడు. మార్క్స్, ఎంగెల్స్ రూపొందించిన కమ్యూనిస్టు సిద్ధాంతం ఆచరణసాధ్యం, అనుసరణీయం, శాస్త్రీయం అని నిరూపించాడు. రష్యన్ విప్లవ నేతగా, సోషలిస్టు సమాజ నిర్మాతగా, ప్రపంచ కమ్యూనిస్టు నాయకుడుగా ప్రసిద్ధి చెందాడు.

## జోసెఫ్ విస్సారియోనోవిచ్ జుగాష్విలి (స్టాలిన్)



స్టాలిన్ పేరు వినబడగానే రష్యా, అక్టోబర్ సోషలిస్టు విప్లవం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్‌ను తరిమికొట్టిన ఎర్రసైన్యం మన కండ్ల ముందు కదలాడుతాయి.

జోసెఫ్ విస్సారియోనోవిచ్ జుగాష్విలి (స్టాలిన్) జార్జియాలోని గోరిలో 1879 డిసెంబర్ 21న జన్మించాడు. 1953 మార్చి 1న తుదిశ్వాస విడిచాడు. 75 సం॥లు జీవించిన స్టాలిన్ విప్లవ జీవితం సుమారుగా 60 సం॥లు కొనసాగింది. లెనిన్‌కు రష్యాలో బోల్షివిక్ పార్టీ నిర్మాణంలో అనుచరుడుగా, సోషలిస్టు రాజ్య స్థాపనలో సహచరుడుగా ఎదిగిన స్టాలిన్ చెప్పులు కుట్టే పునాది వర్గాలలో పుట్టి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడయ్యాడు.

1898లో రైల్వే వర్క్‌షాపులో కార్మికుల స్టడీ సర్కిల్‌కు బాధ్యుడుగా వున్నాడు. ఆ కామ్రేడ్స్ మధ్యనే స్టాలిన్ విప్లవ దీక్షను స్వీకరించాడు. "టిప్లిస్ లోని కార్మికులే నా తొలి ఉపాధ్యాయులు" అన్నాడు. స్టాలిన్ ఉత్తమ విద్యార్థి కూడా.

యవ్వనకాలంలో ట్రాన్స్‌కకాషియా పార్టీకి నాయకుడుగా ఉన్న

కాలంలోనే కార్మిక సంఘాల కార్యకలాపాలను విచ్ఛిన్నం చేస్తున్న అరాచకవాదుల మధ్య భావాలను విమర్శిస్తూ మార్క్సిస్టు మౌలిక భావాలను సరళంగా చెప్పాడు. ఇదే "అరాచకవాదమా? సోషలిజమా" అనే ప్రసిద్ధ రచన వ్యక్తి కేంద్రంగా అరాచకవాదం ఉంటుందని; మార్క్సిజానికి మూలం ప్రజలని, ప్రజా విముక్తిలోనే వ్యక్తి విముక్తి వుందని, అంతా ప్రజలకే చెందుతుందని మార్క్సిజం చెబుతుందని వివరిస్తాడు. ఆ మాటలకు కట్టుబడే తన కార్యాచరణను తుదివరకు కొనసాగిస్తాడు.

1807-09 సం॥ల మధ్య 3 సం॥ల పాటు బకూలో చమురు పరిశ్రమ కార్మికుల్లో విప్లవ కృషి చేసాడు. "బకూలో వాత్సేక్, శరతోవెట్స్, ఫలిలోవ్‌లు చైతన్యవంతమైన కార్మికులు. వారితో నాకు ఏర్పడిన అనుబంధం కార్మికోద్యమ పాఠాలు నేర్చుకోవడానికి విప్లవోద్యమ 2వ దశలోకి ఎదగడానికి ఎంతో తోడ్పడ్డాయని" స్టాలిన్ చెప్పుకున్నాడు. స్టాలిన్ విప్లవ జీవిత క్రమాన్ని చూస్తే ఇలా ఉంటుంది.

స్టాలిన్ దృఢంగా, గట్టిగా వుండేవాడు. 6,7 సం॥ల వయస్సులో ఆటలమ్మ స్మాల్‌ఫాక్స్ వచ్చింది. స్టాలిన్ ముఖంపై ఆ మచ్చలుంటాయి. రక్తం ప్రబావితం కావడంతో చావు దరి దాపుల్లోకి వెళ్ళి బతికాడు. స్టాలిన్ ఎడమ చెయ్యి శాశ్వతంగానే అవిటిదయ్యింది. గోరి స్కూల్‌లోని 5సం॥ల కాలంలో స్టాలిన్ తెలివి తేటలతో, ప్రారంభమైన జ్ఞాపకశక్తితో గుర్తింపు పొందాడు. అదే సమయంలో హేతుబద్ధంగా ఆలోచించి మతాన్ని వ్యతిరేకించాడు. జార్జియన్ సాహిత్యం, కవిత్వంలోని జాతీయ భావాలతో ప్రేరేపించబడి కవిత్వం రాయడం ప్రారంభించాడు. ఆనాడు జార్జియా అణచివేయబడిన జాతి, ఇప్పుడది ఒక దేశం.

నిరంకుశ జారు పాలన మీద వున్న వ్యతిరేకతతో 15సం॥ల వయస్సులో రహస్య మార్క్సిస్టు బృందాలతో కలిశాడు. 20వ యేటనే వృత్తి విప్లవ కారుడుగా మారాడు. 23వ యేట అరెస్టుతో ప్రారంభమై అనేకసార్లు అరెస్టు కావడం, ప్రవాసం పంపబడడం, తప్పించుకుని రావడం ఎన్నో మార్లు జరుగుతూ తిరిగి ఆర్.ఎస్.డి.ఎల్.పి. కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. 1905లో జరిగిన బోల్షివిక్ కాంగ్రెస్‌కు ప్రతినిధిగా వచ్చి మొదటిసారి లెనిన్‌ను కలిశాడు. 1908, 10, 12 లలో అరెస్టయి సైబీరియాకు పంపబడ్డాడు. ప్రవాసంలో లేని కాలంలో ప్రావ్దా పత్రికకు సంపాదకుడుగా పనిచేశాడు. 1913 లో అరెస్టు సందర్భంగా సైబిరియాలోని అత్యంత మారుమూల ప్రాంతానికి పంపివేయడంతో 1917 ఫిబ్రవరి విప్లవం వరకు రాలేక పోయాడు.

1912 జనవరిలో జరిగిన బోల్షివిక్ పార్టీ కాంగ్రెస్‌లో ఎన్నికైన కేంద్రకమిటీ మొదటి సమావేశంలో స్టాలిన్‌ను కో ఆప్ట్ చేసుకుని మొదటి బోల్షివిక్ దినపత్రిక 'ప్రావ్దా'ను తీసుకవచ్చే కర్తవ్యాన్ని ఇచ్చారు. 1922లో స్టాలిన్ బోల్షివిక్ పార్టీకి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. స్టాలిన్ జారిస్టు రష్యాలో రహస్య నిర్మాణంలో పనిచేసి, ప్రజల ప్రాణ సంబంధమైన పార్టీ నిర్మాణాన్ని అభివృద్ధి చేసి ఉన్నత స్థానానికి ఎదిగాడు.

స్టాలిన్ మృదువుగా, సూటిగా, సుళువుగా మాట్లాడే మితభాషి. స్వచ్ఛమైన రష్యాన్ భాష జార్జియన్ యాసతో ఉండేది. తన ప్రసంగాల్లో అలంకారాలు, సామెతలు ఎక్కువ. స్టాలిన్ హాస్య ప్రియుడు. నిశ్శబ్దంగా తనలో తను నవ్వుకునే విధంగా ఉండేవాడు. కష్టపడి పనిచేయడం, జ్ఞాపకశక్తి, నిబ్బరం, నమ్రత, ఆత్మవిశ్వాసం లాంటి మంచి సుగుణాలతో పాటు, కోప స్వభావం కూడా వుండేది. ఎక్కువగా వినడం, తక్కువగా మాట్లాడడం, సమిష్టి ఆలోచనను ప్రతిబింబించడం, మెజారిటీ అభిప్రాయాన్ని అర్థం చేసుకుని పార్టీ విధానాన్ని రూపొందించడం ద్వారా కార్యసాధకుడుగా, ప్రతిభాశాలిగా రూపొందాడు. గొప్ప పాలకుడుగా ప్రజల మనిషిగా నిలిచిపోయాడు.

కా॥ లెనిన్ సిద్ధాంత పునాదులపై ఆధారపడే స్టాలిన్ ప్రపంచంలో మొదటి సోషలిస్టు సమాజాన్ని నిర్మించేందుకు నాయకత్వ పాత్రను పోషించాడు. సృజనాత్మకంగా అన్వయించి లెనినిజాన్ని పరిరక్షించి, అభివృద్ధి పరిచాడు. లెనిన్ మారణానంతరం 3 దశాబ్దాల పాటు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించాడు. ట్రాట్‌స్కీ, జినోవివ్, బుకారిన్ సిద్ధాంతాలను, ఇతర బూర్జువా అవకాశవాద సిద్ధాంతాలను ఓడించి మార్క్సిజాన్ని పరిరక్షించాడు.

"ప్రత్యేకించి లెనినిజం అంటే కార్మిక వర్గపు నియంతృత్వం ఎత్తుగడలు" అని బలంగా నమ్మిన స్టాలిన్ వాటిని దృఢచిత్తంతో అమలు చేసాడు. కార్మిక, కర్షక రాజ్యాన్ని చుట్టుముట్టిన అంతర్గత పోరాటాలు, సామ్రాజ్యవాద దేశాల కుట్రలు, ఫాసిస్టుల దాడులను కార్మికవర్గ దృక్పథంతో సరైన వ్యూహం - ఎత్తుగడలతో ఓడించిన స్టాలిన్ నాయకత్వం సోవియట్ యూనియన్ అజేయమని చాటింది.

జాతుల సమస్యపై స్టాలిన్ అవగాహనను మెచ్చుకున్న లెనిన్ గోర్కికి ఉత్తరం రాస్తూ స్టాలిన్‌ను "వండర్‌ఫుల్ జార్జియన్" దొరికాడని వర్ణించాడు. జాతుల సమస్య పరిష్కారానికి విశాల హృదయుడు, అచంచల విశ్వాసం, ఆచరణలో నిర్మాణ శక్తి సామర్థ్యాలు గల స్టాలిన్ జాతుల కమీసారియేట్ చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. స్టాలిన్ రాసిన "మార్క్సిజం, జాతుల సమస్య అనే వ్యాసం 1913లో ప్రచురించారు. స్టాలిన్ జాతి గురించి నిర్వచించిన విషయం ఒక ప్రామాణిక విషయంగా నిలిచిపోయింది.

"ఒక జాతి అనేది చారిత్రాకంగా రూపుదిద్దుకున్న భాష, ప్రదేశం, ఆర్థిక జీవనం, సమైక్య సంస్కృతిగా అవతరించిన మానసిక ప్రవృత్తి కల్గిన ఒకే పటిష్టమైన సమాజం... ఈ లక్షణాలన్ని కనిపించినప్పుడే మనం దానిని జాతి అని అంటాం"

1929లో ప్రచురించిన 'జాతుల సమస్య - లెనినిజం' అనే స్టాలిన్ గ్రంథంలో అనేక సందేహాలకు సమాధానం చెప్పడంతో పాటు తన అవగాహనలో కూడా అభివృద్ధిని కనబరుస్తూ సామ్రాజ్యవాద యుగంలో జాతుల సమస్య పరిష్కారాన్ని వివరిస్తాడు.

జాతుల సమస్య, వలసల సమస్యల పరిష్కారం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంతోను, ప్రపంచ సోషలిస్టు విప్లవంతోను ముడిపడి ఉన్నదని తెలియజేశాడు.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) 14, 15, 16, 17 మహాసభలకు స్టాలిన్ రూపొందించిన నివేదికలు ఎంతో సమగ్రమైనవి. బోల్షివిక్ పార్టీ చరిత్రలో 9, 10, 11, 12 అధ్యయాలను పరిశీలించిన సోషలిస్టు సమాజ నిర్మాణ కృషి అర్థమవుతుంది. పార్టీ చరిత్ర, నివేదికలు ప్రామాణికమైనవిగా నిలిచిపోయాయి.

రైతాంగంతో పొత్తు, మితవాదంతో ఘర్షణ, సోషలిస్టు శ్రమ, సోవియట్ రాజ్యాంగం లాంటి ఎన్నో అంశాలు అక్కడ పరిష్కారం అయ్యి అనుభవ పాఠాలుగా మారాయి.

1917 అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతం అయిన వెంటనే 14 సామ్రాజ్యవాద దేశాలు రష్యాను ప్రత్యక్షంగా, పరోక్షంగా నాశనం చేయడానికి పూనుకున్నాయి. వారి కలలు కల్లలు చేస్తూ సోషలిస్టు రాజ్యం పురోగమించింది. 1940 ప్రాంతాలలో జర్మనీని రెచ్చగొట్టడం (హిట్లర్) ద్వారా మరో ప్రయత్నం చేసాయి. స్టాలిన్ బ్రహ్మండమైన ఎత్తుగడలు, జాగ్రత్తలు సోవియట్ ప్రజల్ని దేశరక్షణకు ఒక్క మనిషిలా నిలిపాయి. సోవియట్ ప్రజల చైతన్యాన్ని, ఎర్రసైన్యపు వీరోచిత ప్రతిఘటనను ప్రపంచానికి చాటి చెప్పాయి. ఒక దేశంలోని సోషలిస్టు స్థావరప్రాంతం ప్రపంచంలో అనేక దేశాలకు విస్తరించి మూడోవంతు ప్రపంచమే సోషలిస్టు క్యాంపుగా మారింది. ఫాసిజం ఓడిపోయింది. సామ్రాజ్యవాదం బలహీనపడింది. ప్రపంచ వ్యాపితంగా జాతుల పోరాటాలు, జాతీయోద్యమాలు, విప్లవ పోరాటాలు విస్తరించి విజయాలు సాధించాయి. స్టాలిన్ సారధ్యంలో సోవియట్ రష్యా ఒక బలమైన విప్లవ స్థావరంగా చైనా విప్లవానికి, ప్రపంచ సోషలిస్టు విప్లవానికి ఎంతో దోహదం చేసింది. మూడవ ఇంటర్నేషనల్ ఏర్పడి బలపడడానికి, పశ్చిమ దేశాల్లో కార్మిక వర్గానికి; ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ దేశాల ప్రజలు విప్లవించడానికి సైద్ధాంతిక రాజకీయ మద్దతు నివ్వడంతోపాటు భౌతికంగా ఎంతో సహకారాన్ని అందించింది. స్టాలిన్ అంతర్జాతీయ దృక్పథం ఎంత గొప్పదో అర్థమవుతుంది. అలాగే బలమైన, బోల్షివిక్ స్పిరిట్, ఉక్కు క్రమశిక్షణగల కార్మికవర్గ నియంతృత్వ పార్టీ అవసరాన్ని గురించి స్టాలిన్ చెప్పిన విషయం మనకు ప్రామాణికం.

"ఒక సరైన రాజకీయ పంథా రూపొందించబడిన తర్వాత, ఆచరణలో పరీక్షించబడిన తర్వాత పార్టీ నెరిపే నాయకత్వంలో పార్టీ కేడర్లు నిర్ణయాత్మక శక్తి అవుతారు. రాజకీయ పంథాను ఆచరణలో పెట్టాలంటే మనకు కాడర్లు, పార్టీ రాజకీయ పంథాను అర్థం చేసుకున్న వాళ్ళు, ఆ పంథాను తమదిగా స్వీకరించిన వాళ్ళు, దానిని ఆచరణలో పెట్టడానికి సిద్ధమైనవాళ్ళు, దానిని నిజంగా మార్చగలిగిన వాళ్ళు, దానిని ఆచరణలో పెట్టి జవాబుదారీ వహించే వాళ్ళూ, దానిని పరిరక్షించి దానికోసం పోరాడేవాళ్ళూ, మనకు వుండి తీరాలి. దీనిలో విఫలమైతే ఒక సరైన రాజకీయపంథా శుద్ధ నామమాత్రమైనదిగా అయిపోయే ప్రమాదం వుంది".

స్టాలిన్ ఆచరణ క్రమంలో ఎదురైన సమస్యలను పరిష్కరించడంలో భాగంగా మార్క్సిస్టు అవగాహనతో భాష సమస్యను లోతుగా అధ్యయనం చేసి సోవియట్ ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమధానంగా భాషాశాస్త్రం – భాష ఆవిర్భావం, స్వభావం, అభివృద్ధి సూత్రాల గురించి వ్యాసాలు రాశాడు. "భాషా శాస్త్రంలో మార్క్సిజం గురించి" రాశాడు.

రష్యాలో లెనిన్ మరణానంతరం సభ్యత్వ క్యాంపెయిన్ చేపట్టి 2,80,000 మందిని చేర్చుకున్నాడు. వారికి విద్యాబోధన చేశాడు స్టాలిన్. లెనిన్‌కు శిష్యుడిగా లెనిన్ సిద్ధాంతాన్ని సరళభాషలో అర్థం చేయించడానికి విశేషకృషి చేశాడు. లెనినిజం పునాదులు ఒక ప్రసిద్ధ గ్రంథంగా చెప్పవచ్చు. పార్టీ నిర్మాణం, పని విధానం, శైలి ఇలా ఎన్నో విషయాల్ని ముఖ్యంగా కార్మికవర్గ నియంతృత్వ అవసరాన్ని బలంగా చెప్పడంలో లెనిన్ అవగాహన శక్తిని భవిష్యత్ తరాలకు అందించాడు. నిజమైన శిష్యుడుగా, మనకు మార్గదర్శకుడుగా నిలిచిపోయాడు. ఇవన్నీ స్టాలిన్ చేసిన ఉపన్యాసాలే. 1924లో ఇది ప్రచురించబడింది.

స్టాలిన్ రచనలు అనేకం ఉన్నాయి. అన్నింటిలోను మార్క్సిజం, లెనినిజం లను వివరించడానికి, అన్వయించడానికి, సోవియట్ యూనియన్‌ను తీర్చి దిద్దడానికి చేసిన కృషిగా అవి మనకు జ్ఞానాన్ని అందిస్తాయి. లెనినిజం అంటే సామ్రాజ్యవాద దశకు చెందిన మార్క్సిజం అని స్టాలిన్ వివరించాడు. లెనినిజం రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదంతో పోరాడడం ద్వారానే బలపడింది. ఈ పోరాటం జరగకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడడం అసాధ్యం అయ్యేది అంటాడు స్టాలిన్.

1929–33 ల నాటి మహా మాంద్యంతో సామ్రాజ్యవాదం ఫాసిజం వైపుకు ప్రయాణించింది. ప్రతీఘాతుకత పెరిగింది. సోషల్ డెమోక్రటిక్ వామపక్షం వెనుకంజ వేసింది. ఇదే 2వ ప్రపంచ యుద్ధానికి దారి తీసింది. ఇది ఫైనాన్స్ పెట్టుబడి యొక్క నగ్న బీభత్స నియంతృత్వం. విప్లవాన్ని నిరోధించడం దాని లక్ష్యం. 3వ ఇంటర్నేషనల్ యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలని నిర్ణయించింది.

డిమిట్రావ్, స్టాలిన్‌ల నాయకత్వంలో ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటనకు పిలుపునిచ్చింది. కానీ సోషల్ డెమోక్రటిక్ పార్టీలు దీనికి భిన్నంగా వ్యవహరించాయి. స్టాలిన్ నాయకత్వంలో రష్యా దీనికి కట్టుబడి విజయం సాధించింది. ప్రపంచంలో సరైన మార్క్సిస్టు – లెనినిస్టుగా నిలబడింది. చైనాకూడా సరైన విధానాన్ని చేపట్టింది.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం రష్యా విప్లవం నుండి చైనా విప్లవం వరకు (1917 – 1949) నడిచిన కాలంలో, ఈ దశ తర్వాత కూడా కామ్రేడ్ స్టాలిన్ నిర్వహించిన పాత్ర గొప్పది. ఒక దేశంలో సోషలిజం నిర్మించడం సాధ్యం కాదనే ట్రాట్స్కీ తప్పుడు సిద్ధాంతాన్ని ఆచరణలో సోవియట్ యూనియన్‌లో సోషలిజాన్ని నిర్మించడం ద్వారా ఓడించింది కమ్యూనిస్టు పార్టీ. సమిష్టి క్షేత్రాల పథకం ద్వారా వ్యవసాయంలో

సోషలిజం ఎలా ప్రవేశ పెట్టవచ్చో నిరూపించింది.

అలాగే హిట్లర్ దురాక్రమణను ఓడించడానికి సోవియట్ యూనియన్ అజేయమయిన మిలటరీ శక్తిగా రూపొందింది. ఇంకా సామ్రాజ్యవాదుల కుట్రలను భగ్నం చేసి, వారి ఐక్యతను విచ్ఛిన్నం చేసిన ఎత్తుగడలు రూపొందించింది. హిట్లర్ ను ఓడించి తరిమికొట్టి తూర్పు యూరప్‌ను విముక్తి చేసింది. ప్రపంచ కార్మికోద్యమం, వివిద దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు బ్రహ్మాండంగా అభివృద్ధి అయ్యాయి. చైనా, కొరియా, వియత్నాం విప్లవాలు విజయం పొందాయి. అలాగే ట్రాట్స్కీ, టిటోలతో సహా అవకాశవాదుల సిద్ధాంతాలను ఓడించింది. ఇవన్నీ స్టాలిన్ నాయకత్వంలో పార్టీ ప్రజలు సాధించిన విజయాలు.

1933 – 36 సం॥ల మధ్య కాలంలో పార్టీలో శుద్ధి కార్యక్రమం జరిగింది. ఇందులో కొన్ని తప్పులు కూడా జరిగాయి. స్టాలిన్‌పై నియంత, బంధుప్రీతి లాంటి అనేక రకాల ఆరోపణలున్నాయి. యివన్నీ పచ్చి అబద్దాలని కామ్రేడ్ స్టాలిన్ మహోన్నత చరిత్రను పరిశీలిస్తే అర్థమవుతుంది. స్టాలిన్ కుమారుడు యాకొవ్ ఓ సాధారణ ఎర్ర సైనికుడిగా యుద్ధంలో నాజీ సేనలకు చిక్కాడు. నాజీలు తీవ్ర చిత్రహింసలు పెట్టారు. స్టాలిన్‌కీ, కమ్యూనిజానికీ వ్యతిరేకంగా ఓ ప్రకటన యిప్పించుటకై యాకొవ్‌ని అప్రూవర్‌గా మార్చుకునేందుకు నాజీల శైలిలో చిత్రహింసలు పెట్టారు. అయినా లొంగలేదు. అదే కాలంలో పౌలస్ అను ఓ ముఖ్య నాజీ సేనాని ఎర్ర సైన్యానికి చిక్కాడు. తమ సేనాని పౌలస్‌ని విడిచిపెడితే, అందుకు బదులుగా యాకొవ్‌ను విడుదల చేస్తామని హిట్లర్ ప్రభుత్వం స్విట్జర్లాండు రాయబారి ద్వారా కబురు పంపింది. సహచర ప్రభుత్వాధినేతలు చాలా మంది యాకొవ్‌ను విడిపించుదామని కోరారు. కానీ స్టాలిన్ అంగీకరించలేదు. తన కొడుకు వంటి యువకులు దేశం కోసం లక్షల మంది బలయ్యారనీ, అందులో యాకొవ్ ఒకడనీ అన్నారు. నాజీ మిలిటరీ వ్యూహరచయితను విడుదల చేయడం దేశానికి ప్రమాదకరమన్నాడు. తన కొడుకు క్షేమం ఓ నాజీ మెదడును వదిలివేస్తే, మరికొన్ని లక్షల మంది మరణాలకి అది కారణమవుతుందంటూ తిరస్కరించాడు. ఫలితంగా యాకొవ్ నాజీల చేతుల్లో హత్యకు గురయ్యాడు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మాస్కోలో జరిగిన విజయోత్సవసభలో వందన స్వీకారం అందుకునే నిజమైన అర్హత స్టాలిన్‌కే వుంది. కానీ ఝుకోవ్ ఆ గౌరవాన్ని స్వీకరించేలా చేశాడు స్టాలిన్. గొప్ప మార్క్సిస్టు – లెనినిస్టు అయిన కామ్రేడ్ స్టాలిన్‌పై పలు నిందలతో కూడిన దాడిని ఖండిస్తూ కామ్రేడ్ మావో 'చరిత్రలో స్టాలిన్ స్థానం' అనే వ్యాసంలో ఈ కింది అంచనా యిచ్చాడు.

"లెనిన్ మరణించిన తర్వాత పార్టీ మరియు ప్రభుత్వాల ప్రధాన నాయకుడిగా వుండిన స్టాలిన్ మార్క్సిజం– లెనినిజాన్ని సృజనాత్మకంగా అన్వయిస్తూ, దాన్ని అభివృద్ధి చేశారు. లెనినిజం వారసత్వాన్ని దాన్ని శత్రువుల బారి నుండి ట్రాట్స్కీ వాదులు, జినోవైవ్‌వాదులు, తదితర బూర్జువా ఏజెంట్లు సంరక్షించే పోరాటంలో స్టాలిన్ ప్రజల అభిష్టానికీ, కోరికలకూ అద్దం పట్టాడు. తానో మార్క్సిస్టు – లెనినిస్టు మహాయోధుడనని నిరూపించుకున్నారు. స్టాలిన్ సోవియట్ ప్రజల మద్దతును చూరగొన్నారు. చరిత్రలో ఒక ప్రముఖ పాత్రను పోషించారు. అందుకు ప్రధాన కారణం ఎదంటే, ఆయన సోవియట్ కమ్యూనిస్టు పార్టీలో యితర నాయకులతో కలిసి సోవియట్ యూనియన్‌లో సోషలిజానికి అఖండ విజయాన్ని సాధించి పెట్టారు. హిట్లర్ వ్యతిరేక యుద్ధంలో సోవియట్ యూనియన్ విజయానికి పరిస్థితులను సృష్టించారు. సోవియట్ ప్రజల ఈ విజయాలు, ప్రపంచ కార్మికవర్గ ప్రయోజనాలకూ, సమస్త ప్రగతిశీల మానవాళి ప్రయోజనాలకూ అనుగుణ్యంగా వున్నవే. అందుచేతనే స్టాలిన్ పేరు, సర్వసహజంగానే ప్రపంచమెల్లెడలా కీర్తించబడుతోంది. అయితే, లెనినిస్టు పంథాను సరిగ్గా అన్వయించడం ద్వారా దేశంలోపలా, వెలుపలా వున్న ప్రజలలో ఇంతటి గొప్ప గౌరవాన్ని సంపాదించుకున్నాడు స్టాలిన్.

స్టాలిన్ వ్యక్తిగత జీవితాన్ని పరిశీలిస్తే, స్టాలిన్ యువకుడిగా ఉన్నప్పుడే తనతో పాటు పనిచేస్తున్న సోషలిస్టు ఉద్యమకారుని చెల్లె (ఎకాటెరిన్ స్వామిడ్జ్)తో పెండ్లి జరిగింది. ఒక బాబు పుట్టాడు. 1905 విప్లవ కాలంలో ఆమె మరణించింది. కొడుకును ఆమె తల్లి తండ్రులు పెంచుకున్నారు. తర్వాత స్టాలిన్ నడెజ్డా అల్లులుయేవాను రెండో వివాహం చేసుకున్నాడు. ఈమె తండ్రి స్టాలిన్‌కు బాగా సన్నిహితంగా ఉండే కార్మిక కామ్రేడ్. వారిద్దరి దాంపత్య జీవితం అన్యోన్యంగా కొనసాగింది. ఒక కొడుకును జర్మన్ సైన్యం బందీగా పట్టుకుని చంపివేసింది.

గర్జించు రష్యా, గాండ్రించు రష్యా అని శ్రీ శ్రీ కవితావేశం తో ఊగిపోయాడు. 'స్టాలిన్ నీ ఎర్రసైన్యం' అనే పాట ప్రపంచం అంతా మారుమోగింది. ఫాసిస్టు హిట్లర్‌ను, జర్మన్ దురాక్రమణ సైన్యాలను దునుమాడిన రష్యాన్ ఎర్ర సైన్యం ఎత్తుగడలు, అవి సాధించిన విజయాలు ప్రపంచ ప్రజలను ఉత్సాహపరుస్తూనే ఉంటాయి' కా॥ స్టాలిన్ పీడిత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాడు.

ఇప్పటికే మనం కా॥ లెనిన్, స్టాలిన్‌ల జీవిత చరిత్రల ద్వారా రష్యా విప్లవం ఎలా కొనసాగిందో కొంత చూశాము. ఇంకా కొంత వివరంగా చూద్దాం.

బోల్షివిక్ పార్టీ చరిత్ర అంటే మూడు విప్లవాల చరిత్రగా చెప్పుకోవాలి. 1. 1905 నాటి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం. 2. 1917 ఫిబ్రవరి నాటి బూర్జువా ప్రజాతంత్రం విప్లవం. 3. 1917 అక్టోబరు నాటి సోషలిస్టు విప్లవం. చరిత్రలో నాలుగు బలమైన ఫ్యూడల్ సామ్రాజ్యాలలో రష్యన్ (జారు) సామ్రాజ్యం ఒకటి. జర్మనీ, రష్యా సామ్రాజ్యాల మధ్య నిరంతరం యుద్ధం జరుగుతూ ఉండేది. 1861లో క్రిమియా యుద్ధంలో జారు ప్రభుత్వం ఓడిపోయి బలహీన పడింది. ఇంతే గాక భూస్వాములకు వ్యతిరేకంగా రైతులు లేవదీసిన తిరుగుబాట్లు చూసి ప్రభుత్వం బేజారెత్తింది. ఈ కారణాలచే జారు ప్రభుత్వం అర్ధ

బానిస విధానాన్ని రద్దు చేయవలసి వచ్చింది. అయినా భూస్వాములు రైతులను పీడిస్తూనే ఉన్నారు.

జారు రాజుల నాటి రష్యా వివిధ జాతులకు బంధీఖాన. జారు రాజుల అణిచివేత కింద జాతులు హక్కులు కోల్పోయాయి. అర్ధ బానిస విధానం తర్వాత (1865–90ల మధ్య) 25 సం॥రాలలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందింది. 1880 నుండి రష్యన్ కార్మిక వర్గం మేల్కొంది. కార్మిక సంఘాలు ఏర్పడ్డాయి. దుర్భర పరిస్థితులను నిరసిస్తూ సమ్మెలు మొదలైనాయి. సాయుధ శక్తి ద్వారా ప్రభుత్వం సమ్మెలను అణచివేసింది.

ప్లెఖనోవ్ నాయకత్వాన రష్యాలో 1883లో మొట్టమొదటి మార్క్సిస్టు అధ్యయన కేంద్రం, కార్మిక విమోచన సమితి ఏర్పడింది. మార్క్సిజాన్ని వ్యాప్తి చేయడానికి, నరోడ్నిజాన్ని ఓడించడానికి కార్మిక విమోచన సమితి విశేషంగా కృషి చేసింది. నరోడ్నిక్‌లపై ప్లెఖనోవ్ సాగించిన పోరాటం, రచనలు, సిద్ధాంత రీత్యా నరోడ్నిజాన్ని ఓడించాయి. లెనిన్ రష్యాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి రచన ద్వారా చివరి దెబ్బ కొట్టాడు. సిద్ధాంత పునాదిని మాత్రమే వేసిన కార్మిక విమోచన సమితి కార్మిక వర్గాన్ని ఉద్యమం వైపు నడపడంలో ప్రారంభంలోనే ఓడిపోయింది. కార్మికోద్యమాన్ని ఐక్యపరిచే కర్తవ్యం, కార్మిక విమోచన సమితి తప్పులను సరిదిద్దే కర్తవ్యం రెండు లెనిన్‌పై పడ్డాయి. కామ్రేడ్ లెనిన్ 1895 నాటికి సెయింట్ పిటర్స్‌బర్గ్‌లోని మార్క్సిస్టు కార్మిక బృందాలన్నింటిని 'శ్రామిక విమోచనా పోరాట సమితి' అనే సంస్థలో ఐక్యం చేశాడు. ఒక విప్లవకర మార్క్సిస్టు కార్మిక పార్టీని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేశాడు.

లెనిన్ ప్రవాసంలో ఉన్నప్పుడు 1898లో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ ఏర్పడి మొదటి కాంగ్రెస్ జరుపుకుంది. వాస్తవంగా ఇంకా రష్యాలో పార్టీ ఏర్పడలేదు. ఒకే కార్యాచరణ మార్గం, కార్యక్రమం, నిబంధనావళి, ఏకీకృత కేంద్ర నాయకత్వం ఏర్పడలేని కారణంగా గందరగోళం, ఆర్థికవాదం పెరిగాయి.

1903లో జరిగిన రెండవ కాంగ్రెస్‌లో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ ఏర్పడింది. 'పార్టీ కార్యక్రమం, నిబంధనావళిని ఆమోదించారు. పార్టీ కేంద్ర నాయకత్వం, సంస్థలు ఏర్పడ్డాయి. ఈ కాంగ్రెస్ తర్వాత బోల్షివిక్‌లు (మెజారిటీ), మెన్షివిక్‌లు (మైనారిటీ) అనే రెండు గ్రూపులు ఏర్పడి వారి మధ్య విభేధాలు నిర్మాణ సమస్యలపై కేంద్రీకృతమయ్యాయి.

రెండవ కాంగ్రెస్ జరగడానికి ముందుగా పార్టీ ఆశయాలు, ఉద్దేశాల కోసం ఆర్థిక వాదులతో సిద్ధాంతరీత్యా విడిపోవడం అవసరం అని గుర్తించారు. ఎక్కడ నుండి ప్రారంభించాలి? అనే ప్రఖ్యాత వ్యాసంలో లెనిన్ పార్టీ నిర్మాణ విషయమై ఒక నిర్దిష్ట కార్యక్రమాన్ని సూచించాడు. తర్వాత ఆ కార్యక్రమాన్ని ఏం చేయాలి? అనే గ్రంథంలో వివరించాడు. ఇస్క్రా పత్రికను ఆర్గనైజర్‌గా వినియోగించాడు. సమిష్టి ఉద్యమ నిర్మాతగా కూడా ఇస్క్రా పని చేసింది. ఇస్క్రా పత్రికలోనూ, ఏమి చేయాలి అనే గ్రంథంలోనూ ఆర్థికవాదుల, అవకాశవాద తత్వంపై తీవ్రంగా దాడి చేసి, సమూలంగా నాశనం చేశాడు.

ఆర్థికవాదం రష్యాలో అకస్మాత్తుగా వచ్చింది కాదని, పశ్చిమ యూరప్ సోషల్ డెమోక్రటిక్ పార్టీల్లోని అవకాశవాద ధోరణి, రివిజనిస్టు బెర్న్‌స్టిన్ విధానాలు ఉన్నాయని అంటూ వీళ్ల ధోరణి విప్లవాన్ని, సోషలిజాన్ని, శ్రామిక వర్గ నియంతృత్వాన్ని అన్నింటిని వదులుకోవడమేనని చెప్పి ఆర్థికవాదాన్ని ఎదుర్కొన్నాడు.

1. మార్క్సిస్టు చరిత్రలో అవకాశవాదపు బీజాలను బహిర్గతపరిచి, స్పాంటేనిటీని పూజించడం, సోషలిస్టు చైతన్య అవసరాన్ని గుర్తించకపోవడం దాని లక్షణాలు అని తెలియజేసింది. 2 సిద్ధాంతం, చైతన్యంల ప్రాధాన్యతలను గుర్తించడం, స్పాంటేనిటీ ఉద్యమాలను విప్లవోద్యమంగా మలచడం పార్టీ బాధ్యత అని లెనిన్ చెప్పాడు. 3 మార్క్సిస్టు పార్టీ అంటే కార్మికవర్గ ఉద్యమంతో సోషలిజాన్ని మేళవించడం అనే ప్రధాన మార్క్సిస్టు సిద్ధాంత ప్రతిపాదనను చేసి నిరూపించాడు. 4 మార్క్సిస్టు పార్టీ సిద్ధాంత పునాదులను అద్భుతంగా వివరించాడు. బోల్షివిక్ పార్టీకి అవే సిద్ధాంత పునాది అయ్యాయి. ఈ కార్యక్రమం తయారు చేస్తున్నప్పుడు ఇస్క్రా సంపాదకవర్గంలో లెనిన్‌కు, ప్లెఖనోవ్‌కు మధ్య తీవ్రమైన విభేధాలు తలెత్తాయి.

1903 జూలై 17న రష్యా సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ రెండవ కాంగ్రెస్ విదేశాలలో అత్యంత రహస్యంగా జరిగింది. పార్టీ కార్యక్రమాన్ని సులభంగానే అంగీకరించారు. కాని నిబంధనలపై తీవ్రమైన ఘర్షణలు జరిగాయి. పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించి, దానికి ఆర్థికంగా సహకరిస్తూ, పార్టీ సంఘాలలో ఏదో ఒక దానిలో ఉంటే పార్టీ సభ్యుడు అవుతాడు అని లెనిన్ ప్రతిపాదించాడు. మార్టోవ్ ఏదో ఒక సంస్థలో ఉండనక్కరలేదని, పార్టీ క్రమశిక్షణకు లోబడి ఉండనవసరం లేదని వాదించాడు. లెనిన్ ప్రతిపాదనలు నెగ్గాయి. పార్టీ కేంద్ర సంస్థల ఎన్నికల్లో మెజారిటీ అయిన భాగాన్ని 'బోల్షివిక్' లని, మైనార్టీ అయిన భాగాన్ని 'మెన్షివిక్' లని అన్నారు.

రెండవ కాంగ్రెస్‌లో అవకాశవాదంపైన, ఆర్థికవాదంపైన, మార్క్సిజం విజయం సాధించింది. పార్టీ కార్యక్రమాన్ని, నిబంధనావళిని అంగీకరించి సోషల్ డెమోక్రటిక్ పార్టీ అనే ఏకపార్టీని నిర్మించింది. నిర్మాణ సమస్యలపై తీవ్ర విభేధాలు వచ్చి బోల్షివిక్‌లు, మెన్షివిక్‌లుగా విడిపోయారు. నిర్మాణ సూత్రాల కోసం బోల్షివిక్‌లు పోరాడారు. నిర్మాణ రాహిత్యం అనే ఊబిలోకి, అవకాశవాదంలోకి మెన్షివిక్‌లు దిగజారారు. పాత ఆర్థిక వాదుల స్థానాన్ని కొత్త అవకాశవాదులైన మెన్షివిక్‌లు తీసుకున్నారు. నిర్మాణ కర్తవ్యాలను కాంగ్రెస్ సరిగ్గా నిర్వహించలేకపోయింది. ఊగిసలాడింది. అవకాశవాదాన్ని ఓడించలేక పోయింది. కాంగ్రెస్ తరువాత విభేధాలు మరింత పెరిగాయి. రెండవ కాంగ్రెస్ తీర్మానాలను నిష్ఫలం చేయడానికి పార్టీ కేంద్ర సంస్థలను వశం చేసుకోవడానికి మెన్షివిక్‌లు తమ యావత్ శక్తిని ఉపయోగించారు.

పార్టీకి తెలియకుండా రహస్యంగా పార్టీ వ్యతిరేక సంస్థను నిర్మించారు. మార్టోవ్, ట్రాట్స్కీ, అగ్జల్‌రాడ్ నాయకులుగా ఉండి లెనినిజానికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశారు. పార్టీ పనినంతా చిన్నా భిన్నం చేయడం పార్టీ ఆశయానికి నష్టం చేయడం, ప్రతిపనిని, అన్నింటినీ కుంటుపర్చడం చేశారు.

మెన్షివిక్‌లు ప్లెఖనోవ్ నుండి తగినంత సహకారం పొందారు. మెన్షివిక్‌లతో రాజీ చేసుకోవాలని ప్లేఖనోవ్ నిశ్చయించుకున్నాడు. అదే అవకాశవాదం చివరికి అతనిని మెన్షివిక్‌ల్లోకి దిగజార్చింది. ఇస్క్రా పత్రికా మెన్షివిక్‌ల చేతిలో కొత్త ఇస్క్రాగా మారింది. లెనిన్ ప్రారంభించిన ఆ పత్రిక ఇప్పుడు లెనినిజానికి వ్యతిరేక పత్రికాగా మారింది. లెనిన్ 'ఒక అడుగు ముందుకు– రెండడుగులు వెనక్కి' అనే పుస్తకం ద్వారా మెన్షివిక్‌లను ఎదుర్కొన్నాడు. అందులో ముఖ్య నిర్మాణ సూత్రాలు చెప్పాడు. అవి బోల్షివిక్ పార్టీ నిర్మాణానికి ప్రాతిపదికగా నిలిచాయి.

1. మార్క్సిస్టు పార్టీ కార్మిక వర్గంలో భాగం, ఒక దళానికి కార్మిక వర్గ పార్టీకీ తేడా ఉంది. పార్టీ సాధారణ దళం కాదు. అగ్రగామి దళం వర్గ చైతన్యం గల దళం. కార్మిక వర్గ మార్క్సిస్టు దళం. 2. సంఘటిత కార్మికవర్గ దళం, క్రమశిక్షణ గల బాధ్యతాయుతమైన సభ్యులతో కూడినది. కార్మిక వర్గ ప్రత్యక్ష పోరాటాన్ని నడిపే ఒక ఆశయం వైపు తీసుకెళ్ళేదే పార్టీ. 3 కార్మిక వర్గ నిర్మాణ రూపాలన్నింటికీ ఉత్తమమైనది. పార్టీ ఇతర అన్ని నిర్మాణ రూపాలను నడపవలసిన కర్తవ్యం దానికి ఉంది. సిద్ధాంత జ్ఞానం, వర్గ పోరాట చైతన్యం, విప్లవోద్యమ అనుభవం ఉండడం వలన పార్టీ నిర్మాణ స్వరూపాల్లో అన్నిటికన్నా అతి ఉన్నతమైనవి. అధికారం చేపట్టడానికి చేసే పోరాటంలో శ్రామిక వర్గానికి నిర్మాణం తప్ప మరొక ఆయుధం లేదు. 4 పార్టీ ఎంత మంచి అగ్రగామి అయినప్పటికీ, ఎంత బాగా సంఘటిత పడినప్పటికీ, పార్టీ సభ్యులు ఇతర ప్రజాసామాన్యంతో సంబంధం పెట్టుకోకపోతే పార్టీ బతుకదు. అభివృద్ధి కాజాలదు. 5 పని సరిగ్గా నిర్వహించాలంటే, జన సామాన్యాన్ని క్రమ పద్ధతిలో నడుపాలంటే కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమలు చేయాలి. పార్టీకి నిబంధనావళి, అందరికీ సమాన క్రమశిక్షణ, ఒక నాయక సంస్థ (పార్టీ కాంగ్రెస్) ఉండాలి. ఈ షరుతులను తప్పినట్లయితే అది నిజమైన పార్టీగా మనజాలదు. కర్తవ్యాలను నెరవేర్చజాలదు. 6. నిత్య వ్యవహారంలో పార్టీ తన అనుచరుల మధ్య ఐక్యతను కాపాడాలి. క్రమశిక్షణ అందరికి సమానంగా ఉండాలి. లెనిన్ నాయకత్వాన 1905 జనవరి 4న 'ముందడుగు' పత్రిక మొదటి సంచిక వెలువడింది. అలా పార్టీలో రెండు గ్రూపులు, రెండు కేంద్ర సంఘాలు రెండు పత్రికలు నడిచాయి

1904 జనవరిలో రష్యా–జపాన్ యుద్ధం ప్రారంభమైంది. 1905 ఆగస్టు 23న రష్యా చక్రవర్తి జారు ఓటమి పాలై ఒక అవమానకరమైన ఒప్పందం చేసుకొన్నాడు. గతం నుండి కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం, యుద్ధ నష్టాలు, ఓటములు, జారు రాచరికం బలహీనపడడానికి, విప్లవ పరిస్థితి బలపడడానికి తోడ్పడింది. ప్రజల్లో వున్న జారు వ్యతిరేకత, ఆగ్రహం 1905 నాటి మహత్తర విప్లవంలో ప్రస్ఫుటంగా కనబడింది. 1905 జనవరి 9న సెయింట్ పీటర్స్ బర్గ్‌లో విప్లవ తుపాను ప్రారంభమైంది. రష్యా అంతట జనవరి, ఫిబ్రవరి నెలల్లో పోరాటాలు చెలరేగాయి. జనవరి 2న 1లక్ష 40వేల మంది ప్రజలు ఊరేగింపుగా వింటర్ ప్యాలెస్‌కు విజ్ఞాపన పత్రం ఇవ్వడానికి పోతుండగా రెండవ నికోలస్ (జారు) ఆదేశంతో సైనికులు కాల్పులు జరపగా, వేయి మంది కార్మికులు చనిపోయారు, రెండు వేల మంది గాయపడ్డారు. ఈ ఘటన జరిగిన జనవరి 9 'బ్లడీ సండే' గా చరిత్రలో నిలిచిపోయింది. ఈ వార్త రష్యా దేశం నలుదిశలా వ్యాపించగా, కార్మికులు ద్వేషంతో, క్రోదంతో నిరంకుశ ప్రభుత్వం నశించాలనే నినాదంతో వీధుల్లోకి వచ్చారు. ఇలా రష్యా విప్లవం ప్రారంభమైంది. 1905 జూన్‌లో నల్ల సముద్రం నౌక దళంలోని పొటెంక్విన్ అనే యుద్ధ నౌకలో తిరుగుబాటు వచ్చింది. కానీ ఆహార ఇందన కొరతవల్ల చివరికి లొంగిపోవాల్సి వచ్చింది. అయితే ఈ తిరుగుబాటు విప్లవ శ్రేణులను గొప్పగా ఉత్సాహపరిచింది. ఈ పరిస్థితి లిబరల్ బూర్జువాజీని కార్యాచరణకు పురికొల్పింది. విప్లవ పెనుభూతాన్ని చూసి జారు భయపడ్డాడు. ప్రజలను చల్లబర్చడానికి సంస్కరణలు తెచ్చి రాజీ మార్గాన్ని అనుసరించాడు. తాత్కాలిక ప్రభుత్వ శాసన సభ (డ్యూమ) (హక్కులు లేని) ఏర్పాటుకు ప్రయత్నించారు. బోల్షివిక్‌లు డ్యూమాను బహిష్కరించారు. మెన్షివిక్‌లు అందులో పాల్గొన్నారు.

రష్యా సోషల్ డెమొక్రటిక్ పార్టీలో బోల్షివిక్, మెన్షివిక్‌ల పోకడలు రెండు ఘర్షణపడ్డాయి. బోల్షివిక్‌లు విప్లవకరంగాను, మెన్షివిక్‌లు రాజీ ధోరణితోనూ భిన్న మార్గాలను ఎంచుకున్నాయి. మెన్షివిక్‌లు కార్మికవర్గంతోనే వుంటూ బూర్జువా ఏజెంట్లుగా తయారయ్యారు. పార్టీలోనూ, దేశంలోనూ బోల్షివిక్‌లు ఒక్కరే మార్క్సిస్టు విప్లవ శక్తి అని నిరూపించబడింది 5వ కాంగ్రెస్ బోల్షివిక్‌ల మార్గం మార్క్సిస్టు విప్లవ మార్గం అని చెప్పింది. 1905 డిసెంబర్‌లో బోల్షివిక్ మహాసభ పిన్‌ల్యాండ్‌లో నిటామర్ పర్స్‌లో జరిగింది. ఐక్యతను పునరుద్ధరించడం, డ్యూమాను బహిష్కరించడం అనే రెండు కర్తవ్యాలను మహాసభ తీసుకుంది. ఇక్కడే మొదటిసారిగా లెనిన్, స్టాలిన్‌లు కలుసుకున్నారు.

డిసెంబర్ 7న మాస్కోలో రాజకీయ సమ్మె ప్రారంభమైంది. దాన్ని దేశవ్యాప్త సమ్మెగా మార్చలేక పోయారు. జారు నిరంకుశ ప్రభుత్వం తిరుగుబాటు దారులకు మించిన బలాన్ని ప్రయోగించి అత్యంత క్రూరంగా అణచివేయడంతో 1905 మొదటి రష్యన్ బూర్జువా విప్లవం ఓడిపోయింది. ఈ విప్లవం అంతర్జాతీయ ఉద్యమానికి అనేక గుణపాఠాలు నేర్పింది. మెన్షివిక్‌లకు వ్యతిరేకంగా లెనిన్ చేసిన పోరాటం ఆనాడు ఇంటర్నేషనల్‌లో బలంగా పాతుకుపోయిన అవకాశవాదం, రివిజనిజం లకు కూడా వర్తిస్తుంది. రెండవ డ్యూమా గురించి లెనిన్ విప్లవం తిరుగుముఖం పట్టడం వల్ల డ్యూమాను బహిష్కరించే సమస్యను తిరిగి ఆలోచించి, విప్లవ ప్రయోజనాల కోసమే డ్యూమాను ఒక వేదికగా వాడుకున్నారు.

### రష్యా ప్రథమ విప్లవం అపజయానికి కారణాలు

జారుకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యత స్థిరంగా ఏర్పడలేదు. ఇంకా రైతుల్లో అనేక మందికి జారుపై నమ్మకం ఉంది. రైతాంగానికి బోల్షివిక్‌లపై కంటే కూడా సోషలిస్టు రివల్యూషనరీలపైననే ఎక్కువ నమ్మకం ఉంది. రైతు పోరాటాలు చెదురుగా, సంఘటితం కాకుండా తగినంత తీవ్రత లేకుండా జరిగాయి. ఇది విప్లవ ఓటమికి ప్రధాన కారణాలలో ఒకటి.

1907 జూన్ 3వ తేదీన జారు ప్రభుత్వం రెండవ జారును రద్దు చేసింది. మూడవ జారు కోసం కొత్త చట్టాన్ని ప్రకటించింది. ఆ జారు మంత్రి అయిన స్టోలోఫిన్ దేశమంతటా ఉరికంబాలను నెలకొల్పాడు. వేలాది మంది విప్లవకారులు ఉరితీయబడ్డారు. ఆ రోజుల్లో ఈ ఉరికంబాలను స్టోలోఫిన్ నెక్‌టైలు అనేవారు. కులక్‌లకు, భూస్వాములకు వ్యతిరేకంగా రైతు ఉద్యమం తీవ్రమైంది.

ఆర్థికంగా, రాజకీయంగా రష్యా వెనుకబడి వుండడం వల్ల రష్యన్ పెట్టుబడిదారీ వర్గమూ, జారు ప్రభుత్వమూ రెండు కూడా పశ్చిమ యురప్ పెట్టుబడిదారీ విధానంపై ఆధారపడవల్సి వచ్చింది. స్టోలోఫిన్ అభివృద్ధి నిరోధక కాలమంతా రాక్షస దౌర్జన్యకాండ కొనసాగించారు. మార్క్సిస్టు సిద్ధాంత పునాదులను కూలదోయడానికి కపట శాస్త్రీయ సిద్ధాంత ధోరణులు ప్రభలంగా ముందుకు వచ్చాయి. వాటికి సమాధానంగా భౌతికవాదం-అనుభవవాద విమర్శ అనే తత్వశాస్త్ర సమస్యలపై లెనిన్ గ్రంథం, ఆ కువిమర్శలను శాస్త్రీయంగా ఖండించింది. పదార్థం వాస్తవమని, చలనము, మార్పు, అభివృద్ధి అనే మూడు గతి తార్కిక నియమాలు సరైనవని స్పష్టపరిచాడు.

విప్లవాభివృద్ధి కాలంలో కంటే అభివృద్ధి నిరోధక కాలంలోనే పార్టీ సంస్థలో పని చేయడం ఎక్కువ కష్టం. నిరాశ, నిస్పృహలు పెరుగుతన్న సమయంలోనే సైద్ధాంతిక గందరగోళం, నిర్మాణ అరాచకత్వం ముందుకు వస్తాయి. రహస్య, బహిరంగ కార్యకలాపాలతో మరో విప్లవ వెల్లువకు అవకాశాలను గుర్తించి కార్మిక వర్గ శక్తులను సన్నద్ధపరచాల్సి వుంది. లెనిన్ 'ఆగండి మరో 1905 విప్లవం వస్తుంది' అన్నాడు. అభివృద్ధి నిరోధక నిర్బంధ కాలంలో అఫెన్స్ ఎత్తుగడలు మాని డిఫెన్స్ ఎత్తుగడలు చేపట్టారు. సర్వశక్తులను సమకూర్చుకొని రహస్య, బహిరంగ కార్యకలాపాలను మేళవించి, ప్రతి చిన్న అవకాశాన్ని వినియోగించుకొని, పట్టుదల, ఓపిక, ఉక్కు క్రమశిక్షణ గల దృఢమైన పార్టీని తీర్చిదిద్దారు. కొత్త పోరాట పద్ధతులు నేర్చుకొని వర్గ శత్రువులతోనూ, రివిజనిస్టులతోనూ పోరాడారు. ట్రాట్స్కీ సెంట్రిజానికి వ్యతిరేకంగా, కామెనేవ్, జీనోవేవ్ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా లెనిన్ సూత్రబద్ధంగా పోరాడి ఓడించారు. లిక్విడేటర్లను తుడిచివేశారు. అనేక మెన్షివిక్ కార్మిక సంస్థలను తమ వైపుకు తిప్పుకున్నారు. శ్రామికవర్గ రహస్య పార్టీని రక్షించడంలో బోల్షివిక్‌లు విజయం సాధించారు. ఎకనామిస్టులు, మెన్షివిక్‌లు, ట్రాట్స్కీ వాదులు, ఆట్జోనిస్టులు, అన్ని రకాల భావవాదులు మొదలుకొని, అనుభవవాద విమర్శకుల వరకు అన్ని రకాల విప్లవ వ్యతిరేక భావజాలాలను ఓడించారు. బోల్షివిక్‌ల మధ్య ఐక్యతను సాధించారు. పార్టీ నిర్మాణానికి సైద్ధాంతిక సన్నాహాలు 'ఏం చేయాలి'? అనే గ్రంథ రచన నుండి మొదలయ్యాయి. నిర్మాణ సన్నాహాలు 'ఒక అడుగు ముందుకు-రెండడుగులు వెనక్కి' అనే గ్రంథం చేసింది. 'ప్రజాతంత్ర విప్లవంలో సోషల్‌డెమోక్రసీ అనుసరించాల్సిన రెండు ఎత్తుగడలు' అనే లెనిన్ గ్రంథం రాజకీయ సన్నాహాన్ని చేసింది. ఇంకా భౌతికవాదం, అనుభవవాద విమర్శ పార్టీకి తాత్విక సన్నాహాన్ని చేసింది. పరిస్థితులు పరిపక్వమై, సన్నాహాలు పూర్తయి 1912 జనవరిలో ప్రాన్స్‌లో జరిగిన ఆరవ అఖిల రష్యన్ మహాసభలో బోల్షివిక్ సెంట్రల్ కమిటీని ఎన్నుకోవడం, పార్టీ నుండి మెన్షివిక్‌లను తొలిగించడం జరిగింది. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ బ్రాకెట్లో 'బోల్షివిక్' అనే పదాన్ని చేర్చి పిలువడం మొదలైంది. ఈ మహాసభ చరిత్రలో కీలకమైనది. మెన్షివిక్‌లతో విభజన రేఖ గీయబడింది. శ్రామికవర్గ పార్టీ నుండి అవకాశవాదం అనే చెత్తను తుడిచి బోల్షివిక్ పార్టీ ఆ తర్వాత మరింత బలపడింది.

బోల్షివిక్‌ల నాయకత్వంలో 1912-14 సం॥ల మధ్య కార్మికవర్గ జనసామాన్యాన్ని విప్లవోద్యమంలో నూతన ఉత్సాహంతో నడిపింది. మధ్యప్రాచ్యం, దూర ప్రాంతల్లోనూ పీడిత ప్రజలపై ప్రగాఢమైన ప్రభావాన్ని వేశాయి. వారికి ఉత్తేజాన్ని ఇచ్చాయి. చైనా, ప్రష్యా, జాతీయ విముక్తి విప్లవాలకు ప్రేరణ అయ్యాయి. స్టోలోఫిన్ నిర్బంధ చర్యలు ఎంత అలవాటు అయ్యిపోయాయంటే, అవి ప్రజల్లో భయాన్ని కల్గించడం మానేశాయి. ఆర్థిక, రాజకీయ పోరాటాలను జోడించడం వల్ల అసాధారణమైన విప్లవశక్తి అబ్బింది. 1914 నాటికి సమ్మె చేసే కార్మికుల సంఖ్య 15 లక్షలకు పెరిగింది. విప్లవ విజృంభన, సమ్మె ఉద్యమ ప్రభావం 1905 నాటి విప్లవ పరిస్థితి మళ్లీ వచ్చింది. కార్మికవర్గ సమ్మెలు రైతులను, సైనికులను పోరాటాలలోకి లాగాయి. అన్ని సెక్షన్ల ప్రజానీకాన్ని పార్టీ కర్తవ్యాలకు అనుగుణంగా సంఘటితం చేయడం జరిగింది. లెనిన్ దగ్గరగా వచ్చి సభలో పాల్గొంటు రహస్యంగా కార్యకలాపాలు సమన్వయించాడు.

సామ్రాజ్యవాదం ఆవిర్భావంతో పదునెక్కిన వైరుధ్యాలు యుద్ధానికి కారణం అయ్యాయి. బ్రిటన్‌ను అమెరికా, జర్మనీలు సవాలు చేశాయి. శత్రువు కూటములుగా ఏర్పడ్డాయి. జర్మనీ, ఆస్ట్రో హంగేరి, ఇటలీ, బల్గేరియా, టర్కీ ఒక కూటమిగా బ్రిటన్, ప్రాన్స్, అమెరికా, జపాన్, రష్యాలు ఒక కూటమిగా ఏర్పడ్డాయి. 1914 జూలై 28న ఆస్ట్రేలియా సెర్బియాపై దాడి చేసింది. ఆగస్టు 9న జర్మనీ రష్యాపై యుద్ధం ప్రకటించింది. ఇలా మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. అవకాశవాదుల చేతులలో వున్న రెండవ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ వాదాన్ని వదిలి బూర్జువా జాతీయవాద రొంపిలోకి దిగిపోయింది. 1914 ఆగస్టు 4 నుండి ఇంటర్నేషనల్ అస్థిత్వం లేకుండా పోయింది. 1914 సెప్టెంబర్ 6న లెనిన్ యుద్ధంపైన తన థీసీస్‌ను ప్రకటించాడు. "యూరోపియన్ యుద్ధంలో సోషల్ డెమోక్రసీ కర్తవ్యాలు" అనే రచనలో

ఇంటర్నేషనల్ పార్టీలోని ఛావనిజాన్ని ఖండించాడు. నవంబర్ 1న సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలని పిలుపునిస్తూ కార్యక్రమాన్ని విడుదల చేశాడు. అంతర్జాతీయ సోషల్ డెమోక్రసీలోని యుద్ధ వ్యతిరేక శక్తులకు లెనిన్ 1915 నుండి మార్గదర్శకత్వాన్ని అందించాడు. అందుకు అపారమైన సైద్ధాంతిక కృషి చేయాల్సి వచ్చింది. 'సోషలిజం-యుద్ధం' అనే చిన్న రచనలో సోషలిస్టు సూత్రాలను వివరిస్తూ సామ్రాజ్యవాద యుద్ధంలో విప్లవకర కార్మికవర్గ కర్తవ్యాలను స్పష్టపరిచాడు. అందులోనే కాట్స్కీజంకు వ్యతిరేకంగా మార్క్స్-ఎంగెల్స్ బోధనలను పరిరక్షిస్తూ, కాట్స్కీ వక్రీకరణలను ఖండించాడు. అతివాద సోషల్ డెమోక్రాట్లలోని నిలకడలేని అంతర్జాతీయ వాదులయిన రోజా లగ్జెంబర్గ్, కారల్ లీబ్నెక్ట్ల తప్పులను లెనిన్ విమర్శిస్తూ అదే సమయంలో వారు సరైన పంథా అవలంభించేటట్లు సహాయపడ్డాడు.

పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిలో అన్ని దేశాల్లోనూ ఒకేసారి విప్లవం విజయం సాధించడం జరగదని, విడిగా ఒక్కొక్క పెట్టుబడిదారీ దేశంలో సోషలిజం జయించడం సాధ్యమని లెనిన్ తన కొత్త సిద్ధాంతంతో మార్క్సిజాన్ని సుసంపన్నం చేసి పురోగమింపజేశాడు. ఇదే కాలంలో బోల్షివిక్‌లు సైనికుల్లోనూ, నావికులలోనూ తీవ్రంగా కృషి చేశారు. శ్రామికవర్గ అంతర్జాతీయత అనే సోషలిస్టు ఆశయానికి బోల్షివిక్ పార్టీ ఒకటే నిరంతరం విశ్వాసంతో కృషి చేసింది.

యుద్ధం రష్యా ఆర్థిక జీవితాన్ని విచ్ఛిన్నం చేసింది. జారు సైన్యం అనేక ఓటములు పొందుతూ వచ్చింది. జారు ప్రభుత్వం స్పష్టంగా మరణ సంక్షోభవేదనలో పడింది. ఈ సంక్షోభాన్ని రాజభవన తిరుగుబాటు (కూప్) ద్వారా పరిష్కరించాలని పెట్టుబడిదారీ వర్గం తలచింది. కానీ ప్రజలు తమ స్వంత మార్గాన దానిని పరిష్కరించారు. ఈ మార్క్సిజాన్ని జాతుల సమస్య పరిష్కారానికి అన్వయించి 1914లో 'జాతుల స్వయం నిర్ణయాధికార హక్కు' అనే గ్రంథాన్ని లెనిన్ రాశాడు. చిన్న జాతుల తిరుగుబాట్లు లేకుండా సామాజిక విప్లవాన్ని ఊహించలేమూ అన్నాడు. స్టాలిన్ లోతుగా అధ్యయనం చేసి రాసిన 'మార్క్సిజం-జాతుల సమస్య' అనే వ్యాసం (1913)లో స్టాలిన్ జాతుల సమస్య పరిష్కారానికి ఐదు షరతులు చెప్పాడు.

అవి. 1. అన్ని జాతుల స్వయం నిర్ణయాధికార హక్కును గుర్తించాలి 2 బహు జాతుల రాజ్యంలో ఉన్న జాతి గ్రూపులకు తామున్న ప్రాంతంలో ప్రాదేశిక స్వయం ప్రతిపత్తిని కల్పించాలి. 3 సంపూర్ణ ప్రజాస్వామ్యానికి అనువైన పరిస్థితులను ఏర్పాటు చేయాలి. 4 జాతుల సమానత్వం అంటే ఏ ఒక్క జాతికి విశేషాధికారాలు లేక పోవడం, మైనార్టీ హక్కులకై ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉండాలి. 5 సమైక్య కార్మికవర్గ సంస్థలు, కార్మికవర్గ అంతర్జాతీయ సంఘీభావం ఉండాలి.

1916లో లెనిన్ రాసిన గొప్ప గ్రంథం 'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' వెలువడింది. మార్క్సిస్టు సిద్ధాంతానికి అది ప్రముఖమైన చేర్పు. అది ప్రపంచ ప్రజానీకం సామ్రాజ్యవాదపు ఆర్థిక రాజకీయ అంతస్సారాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడింది. ఆ గ్రంథం ప్రత్యేకించి ఆ సమయంలో పరమ అవసరం. సామ్రాజ్యవాద దశలోని ప్రత్యేక లక్షణాలను పేర్కొన్నాడు. సామ్రాజ్యవాదంతో పెట్టుబడిదారీ వ్యవస్థ అవసాన దశకు చేరుకుంటుంది. కార్మికవర్గ విముక్తికి విప్లవానికి రంగం సిద్ధమవుతుందని చెప్పాడు.

రోజువారి పోరాటాలతో లక్షలాది కార్మిక శ్రేణులు ఉద్యమంలోకి వచ్చారు. జారు ప్రభుత్వం నశించుగాక, యుద్ధం నశించుగాక, 'మాకు తిండి కావాలి' అనే నినాదాలు రాసిన ఎర్రజెండాలు కార్మిక ప్రజాస్వామ్య శిరస్సులపై తేలి ఆడాయి. కార్మికులు సైనికులను, పోలీసులను నిరాయుధులను చేసి తామే సాయుధులు కాసాగారు. పెట్రోగాడ్ విప్లవ విజయ వార్త అన్ని పట్టణాలకు చేరవేశారు. జారు ప్రభుత్వ ఉద్యోగులను తొలగించారు. ప్రజా తిరుగుబాటుతో జారు చక్రవర్తి కూలిపోయాడు. ఫిబ్రవరిలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం విజయం సాధించింది. 1917 ఫిబ్రవరిలో బోల్షివిక్‌ల చొరవ వల్ల కార్మిక, సైనికుల ప్రతినిధుల సోవియట్లు ఏర్పడ్డాయి. ఈ కాలంలో లెనిన్ విదేశాల్లో ప్రవాసిగా ఉ న్నాడు. స్టాలిన్, స్వెర్డలోవ్, సైబీరియాలో ప్రవాస శిక్ష అనుభవిస్తున్నారు. సోషలిస్టు రివల్యూషనరీలకు, మెన్షివిక్‌లకు యుద్ధాన్ని ఆపాలని గాని, శాంతిని సాధించాలని గానీ ఉద్దేశ్యం లేదు. పెట్టుబడిదారీ వర్గానికి అన్ని అధికారాలను అప్పగించారు. బోల్షివిక్‌లు అసమ్మతిని తెలియజేసినా ఫలితం లేకుండా పోయింది. దీని ఫలితంగా రెండు అధికారాల విచిత్ర బంధనం ఏర్పడింది. ఒకటి తాత్కాలిక ప్రభుత్వం ప్రాతినిధ్యం ద్వారా వచ్చిన పెట్టుబడిదారులు. రెండు కార్మిక-కర్షక ప్రతినిధులు సోవియట్ ప్రాతినిధ్యం ద్వారా వచ్చిన శ్రామిక వర్గ రైతాంగం. దీని ఫలితం ద్వంద్వ అధికారం. విజయాన్ని సాధించిన కార్మికులు తమకు తామే బూర్జువా ప్రతినిధులకు అధికారాన్ని అప్పగించడానికి కారణాలను లెనిన్ ఈ క్రింది విశ్లేషణలో వివరించాడు.

1 రాజకీయాల్లో అనుభవం లేని లక్షలాది మంది ప్రజలు చైతన్యవంతులై రాజకీయ కార్యాచరణలోకి దూకారు. వీరంతా నిన్నటిదాకా రైతులు. రష్యా యూరప్‌లో కల్లా ఎక్కువ మంది మధ్య తరగతి ప్రజలు ఉన్న దేశం. మధ్య తరగతి పార్టీలైన మెన్షివిక్, సోషలిస్టు రివల్యూషనరీల కార్యకలాపాలకు తోడ్పడింది. శ్రామికవర్గంలో తగినంత నిర్మాణ, వర్గ చైతన్యం లేదు. బూర్జువా ప్రభుత్వ అధికారాన్ని అర్థం చేసుకోకుండా అమాయకంగా నమ్మి అధికారాన్ని అప్పగించారు. పెట్టుబడిదారులు, బ్యాంకర్ల మద్దతుతో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం ప్రజాతంత్ర హక్కులపై దాడిచేయడం మొదలు పెట్టింది. విప్లవ సంస్థలను, బోల్షివిక్ పార్టీని నాశనం చేయడానికి పూనుకున్నది. ఈ ప్రభుత్వాన్ని కూల్చి పేద రైతాంగంతో పొత్తు పెట్టుకున్న కార్మికవర్గం చేతుల్లోకి అధికారం బదిలీ అయ్యే విప్లవం-సోషలిస్టు దశకు నేరుగా వెళ్ళాలని లెనిన్ తన ఏప్రిల్ థీసిస్‌లో పిలుపునిచ్చాడు. ఫిబ్రవరి విప్లవం తర్వాత బోల్షివిక్ పార్టీ బహిరంగ కార్యకలాపాలు కొనసాగించింది. 1917 ఏప్రిల్ 3న లెనిన్ ప్రవాసం నుండి తిరిగి వచ్చాడు. 4న

బోల్షివిక్ సమావేశంలో తన ఏప్రిల్ థీసిస్‌ను ప్రతిపాదించాడు. తాత్కాలిక ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలి. సోవియట్లలో బోల్షివిక్‌లు మెజారిటీ కోసం కృషి చేయాలి. రాజ్యాధికారాన్ని సోవియట్లకు బదలాయించాలి. శాంతి, భూమి, రొట్టె డిమాండ్లు సాధించే కర్తవ్యాన్ని ప్రతిపాధించాడు. చివరిగా కొత్త కమ్యూనిస్టు పార్టీ పేరుతో కొత్త కాంగ్రెస్, కొత్త ఇంటర్నేషనల్ మూడవ ఇంటర్నేషనల్ ఏర్పాటుకు పిలుపునిచ్చాడు. ఏప్రిల్‌లో జరిగిన బోల్షివిక్ పార్టీ అఖిల రష్యా కాన్ఫరెన్స్ లెనిన్ థీసిస్‌ను ఆమోదించడంతో పాటు "సర్వాధికారాలు సోవియట్లకే" అనే నినాదాన్ని ఇచ్చింది. అలాగే స్టాలిన్ ప్రతిపాధించిన 'విడిపోయే హక్కుతో సహా జాతులకు స్వయం నిర్ణయాధికార హక్కు'ను ఆమోదించింది. ఆగస్టులో జరిగిన పార్టీ 6వ కాంగ్రెస్‌లో సాయుధ తిరుగుబాటు సన్నాహాలు జరపాలన్న నిర్ణయాన్ని ఆమోదించింది. పార్టీ సాయుధ పోరాటానికి సన్నాహాలు ప్రారంభించింది. సాయుధ తిరుగుబాటుకు పార్టీ సన్నద్ధమైంది. టాట్స్కీవాదులు, బుకారిన్‌లు తిరుగుబాటును వ్యతిరేకించారు.

1917 అక్టోబర్ విప్లవానికి సన్నాహాలు జరుగుతున్నప్పుడే 'రాజ్యం-విప్లవం' అనే గ్రంథం లెనిన్ రాశాడు. లెనిన్ రాసిన 'రాజ్యం-విప్లవం' అనే గ్రంధానికి అంతర్జాతీయ స్థాయిలో అపారమైన సైద్ధాంతిక, ఆదరణ, ప్రాధాన్యత వచ్చింది. పెట్టుబడిదారీ ఘోర పాలన నుండి విముక్తి కావడానికి ప్రజారాశులు తక్షణం ఏం చేయాలి? అనే విషయాన్ని వివరించడానికి, పరిష్కరించడానికి ఇది తోడ్పడింది. రాజ్యం అనేది వర్గ పాలనకు సాధనంగా ఆవిర్భవించింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థలో పటిష్టపరిచింది. కార్మికవర్గం ఆ రాజ్యాన్ని కూల్చి కార్మికవర్గ రాజ్యాన్ని ఏర్పరచాలి. వర్గరహిత సమాజమైన కమ్యూనిజం సాధించేవరకు కార్మికవర్గ నియంతృత్వం వుంటుంది. బూర్జువా ప్రజాస్వామ్యం, కార్మికవర్గ ప్రజాస్వామ్యం రెండు భిన్నమైనవి. వాటి లక్ష్యాలు, మార్గాలు పరస్పరం విరుద్ధం. బూర్జువా ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తూనే కార్మికవర్గం బూర్జువా శక్తులతో పోరాడి సోషలిస్టు విప్లవం పరిపూర్తి చేయాలి. కమ్యూనిజంలో 'శక్తికొలది పని-అవసరం మేరకు ఉపయోగం' సూత్రం అమలు కావాలంటే సోషలిస్టు సమాజంలో శ్రమల మధ్య, ప్రాంతాల మధ్య, గ్రామాలు-పట్టణాల మధ్య, స్త్రీ-పురుషుల మధ్య, వ్యవసాయం-పరిశ్రమల మధ్య ఇలా అన్ని రకాల వైరుధ్యాలు పరిష్కారమై చివరికి వర్గ నియంతృత్వ సాధనమైన రాజ్యాంగ యంత్రం అవసరం క్రమంగా తీరి నశించిపోతుంది.

1917 సెప్టెంబర్ -అక్టోబర్‌లలో భూస్వాముల ఎస్టేట్లను ప్రజలు స్వాధీనం చేసుకోవడం మొదలైంది. సోషలిస్టు రివల్యూషనరీల్లో, మెన్షివిక్‌లలోని తీవ్రవాద పక్షం బోల్షివిక్‌ల వైపు మొగ్గాయి. అక్టోబర్ 7న ఫిన్‌ల్యాండ్ నుండి లెనిన్ రహస్యంగా పెట్రోగ్రాడ్‌కు వచ్చాడు. 10న సెంట్రల్ కమిటీ సమావేశం జరిగి సాయుధ తిరుగుబాటు చేయాలని నిర్ణయించింది. కామెనీవ్, జినోవేవ్‌లు తిరుగుబాటును బహిర్గతపరిచినందుకు లెనిన్ సలహా మేరకు ఆ ద్రోహులను బహిష్కరించారు. ట్రాట్స్కీ బడాయి కోరుతనం పట్టలేక సాయుధ తిరుగుబాటుకు బోల్షివిక్‌లు నిర్ణయించుకున్న తేదీని బహిర్గతం చేశాడు. అక్టోబర్ 24న రాత్రి లెనిన్ స్మోల్నీ భవనంలోకి ప్రవేశించి తిరుగుబాటుకు స్వయంగా నాయకత్వం వహించాడు. అక్టోబర్ 24న ఆఫీసులు, కార్యాలయాలు, బ్యాంకులు స్వాధీనపరచుకున్నారు. తాత్కాలిక బూర్జువా ప్రభుత్వం కూలదోయబడి రాజ్యాంగ అధికారం సోవియట్లకు స్వాధీనమయ్యింది. అక్టోబర్ 27న శాంతికి సంబంధించిన ఒక చట్టం ఆమోదించారు. అదే రాత్రి సోవియట్ల రెండవ కాంగ్రెస్ భూమి హక్కుపై ఒక చట్టాన్ని చేసింది. 40 కోట్ల ఎకరాల భూమిని ప్రజల పరం చేశారు. 40 కోట్ల బంగారు రూబుల్స్ రుణాలను రద్దు చేశారు. నూనె, బొగ్గు, ముడిలోహం మొదలయిన ఖనిజ సంపదలు, అడవులు, జల వనరులు మొత్తం ప్రకృతి సంపదంతా ప్రజలపరం అయ్యింది. రష్యా సోవియట్ల రెండవ కాంగ్రెస్ సోవియట్ ప్రభుత్వాన్ని ఏర్పర్చింది. ప్రజా కమీసర్ల (మంత్రులు), మొదటి సమితికి కామ్రేడ్ లెనిన్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. ప్రతిచోట అధికారం వెంటనే సోవియట్ల హస్తగతం కాలేదు. సోవియట్ విప్లవం దేశమంతటా పరిపూర్తి కావడానికి 5నెలలు పట్టింది. అది ఎంతో వేగంగా వ్యాపించింది. దీనినే లెనిన్ జైత్రయాత్ర అన్నాడు.

రష్యాలో సోషలిస్టు విప్లవం చాలా సులభంగా విజయం సాధించింది. అందుకు చాలా కారణాలు వున్నాయి. రష్యన్ బూర్జువావర్గం బలహీనపడింది. అది ఇంకా సుసంఘటితం కాలేదు. రాజకీయంగా అనుభవశూన్యమైనదే. ఆర్థికంగా బలహీనంగా వుండి, కాంట్రాక్టులపై పూర్తిగా ఆధారపడి వుంది. రాజకీయ స్వయం శక్తి, చొరవ లేదు. ఫ్రాన్స్‌లాగా రాజకీయ ముఠాలు కట్టడం, రాజకీయ కుయుక్తులు పన్నడం తెలియదు. బ్రిటిష్ బూర్జువావర్గం వలే వంచనతో కూడిన రాజీ చేసుకోవడం వీరికి తెలియదు. యుద్ధ భారం దేశం తాహత్తుకు మించిపోయింది. ప్రజలు, సైన్యం, పూర్తిగా అలసిపోయారు. జారు విధానాలనే కొనసాగిస్తూ ప్రజలకు వ్యతిరేకంగా మారింది. మెన్షివిక్‌లు, సోషలిస్ట్- రెవల్యూషనరీలు సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వర్గపు ఏజెంట్లుగా బహిర్గతం అయ్యారు. రష్యన్ కార్మికవర్గం యుద్ధ రంగంలో కాకలు తీరింది. కొద్ది కాలంలోనే రెండు విప్లవాలను చవి చూసింది. మూడవ విప్లవం నాటికి శాంతి, భూమి, స్వాతంత్ర్యం, సోషలిజంలకై జరిపే పోరాటంలో ప్రజా గుర్తింపు పొందింది. కార్మిక, రైతు మైత్రితో ఆ విప్లవ వర్గం అక్టోబరు విప్లవానికి నాయకత్వం వహించింది. కార్మిక, రైతు, మైత్రి లేకుంటే విప్లవం సాధ్యమయేది కాదు. బోల్షివిక్ పార్టీ ఒక్కటే ఎటువంటి ఊగిసలాట లేకుండా చివరి వరకు నిలిచి పోరాడిందని రైతాంగం గుర్తించింది. వారు రైతాంగ మైత్రి కోసం చేసిన కృషి ఫలితంగా మధ్యతరగతి రైతులు హృదయపూర్వకంగా విప్లవం వైపు మొగ్గి పేద రైతాంగంతో కలిశారు. రాజకీయ పోరాటాల్లో పరీక్షకు నిలబడి కాకలు తీరిన బోల్షివిక్ పార్టీ కార్మిక వర్గానికి నాయకత్వం వహించింది. జాతుల స్వాతంత్ర్యానికి, వర్గ నియంతృత్వ స్థాపనకు, సోషలిస్టు ఉద్యమానికి నాయకత్వం

వహిస్తూ విభిన్న విప్లవాలను ఒకే ప్రవాహంగా బోల్షివిక్ పార్టీ చాతుర్యంతో సమన్వయించగల్గింది. సామ్రాజ్యవాద యుద్ధం ఉచ్ఛ స్థాయిలో ఉన్నప్పుడు, బూర్జువా ప్రభుత్వాలు రెండు శిభిరాలుగా విడిపోయి వున్న సమయంలో అక్టోబరు విప్లవం ప్రారంభమై విజయవంతమయ్యింది.

సోవియట్ అధికారాన్ని సుస్థిరపరచుకోవడానికి బోల్షివిక్ పార్టీ ముందుగా యుద్ధాన్ని అంతమొందించాలని డిసెంబర్ 3న బ్రెస్ట్‌లిటోవ్సుష్కితో రాయభారం ప్రారంభమై డిసెంబర్ 5న యుద్ధ విరామ సంధి జరిగింది. కొంత ఊపిరి పీల్చుకునే వ్యవధి సంపాధించడానికి, దేశాన్ని శత్రువు దాడి నుండి రక్షించేందుకు, శక్తివంతమైన రెడ్ ఆర్మీని సృష్టించడానికి, సోవియట్ అధికారాన్ని బలపర్చడానికి ఇటువంటి వ్యవది అవసరం. సోషలిస్టు మాతృ భూమి రక్షణకు రెడ్‌గార్డ్స్, ఆర్మీ ఏర్పడి కృతనిశ్చయంతో జర్మన్ సామ్రాజ్యవాద సైన్యాలను ఫిబ్రవరి 23న ఓడించింది. ఆ రోజును రష్యన్ రెడ్‌ఆర్మీ జన్మదినంగా ప్రకటించారు. 1918లో మార్చి 8న కాంగ్రెస్ ప్రారంభమైంది. పార్టీ పేరును రష్యన్ కమ్యూనిస్టు బోల్షివిక్ పార్టీగా మార్చారు. పార్టీలో దాగివున్న ట్రాట్స్కీవాదులను కాంగ్రెస్ ఓడించింది. అక్టోబర్ సోషలిస్టు విప్లవం పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేసింది. యావత్తు సంపదను ప్రజల ఆస్థిగా సమిష్టి ఆస్తిగా మార్చివేసింది. అది శ్రామికవర్గ నియంతృత్వాన్ని స్థాపించింది. కార్మిక వర్గాన్ని పరిపాలక వర్గంగా మార్చింది. అక్టోబర్ సోషలిస్టు విప్లవం మానవజాతి చరిత్రలో ఒక నూతన శకాన్ని, శ్రామికవర్గ విప్లవాల శకాన్ని ప్రారంభించింది.

సోవియట్ 5వ కాంగ్రెస్ మొదటి రాజ్యాంగ చట్టాన్ని అనగా రష్యా సోవియట్ ఫెడరేటివ్ సోషలిస్టు రిపబ్లిక్ రాజ్యాంగ చట్టాన్ని ఆమోదించింది. గ్రామాలలో శ్రామికవర్గ ప్రచారోద్యమం, బీదరైతుల కమిటీల నిర్మాణం సోవియట్ అధికారాన్ని స్థిరపరిచింది. ఇవి మధ్యతరగతిని ఆకర్షించడానికి తోడ్పడ్డాయి. విప్లవ ప్రతిఘాతకులు ముఖ్యంగా కోసక్‌లు, కులక్‌లు అధికంగా వున్న జిల్లాల్లో తిరుగుబాట్లను సంఘటితపరచడానికి నిశ్చయించుకున్నారు. బ్రెస్ట్‌లితోష్కి శాంతితో లభించిన వెసులుబాటు ఎంతో కాలం నిలువలేదు. బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, అమెరికా దేశాలు ప్రత్యక్ష మిలిటరీ జోక్యానికి, దేశంలోని ప్రతీఘాతకులకు సహాయం అందించే విధంగా పరోక్ష జోక్యానికి పాల్పడ్డాయి. ప్రతీఘాతకులు, సామ్రాజ్యవాదులు ఎటువంటి హెచ్చరికలు లేకుండా రష్యాకు వ్యతిరేకంగా అతి క్రూరమైన దురాక్రమణ యుద్ధాన్ని మొదలు పెట్టారు. అయినా ఇంతా క్లిష్ట పరిస్థితుల్లో కూడా కార్మికవర్గం గుండె జారిపోలేదు. బోల్షివిక్ పార్టీ ధైర్యం కోల్పోలేదు. అపరిమిత శక్తితో అత్యంత సాహసంగా పోరాడి బోల్షివిక్ పార్టీ పలుకుబడిని ఇనుమడింప చేశారు. దేశమంతా ఒక యుద్ధ శిభిరం అని పార్టీ ప్రకటించింది. సోషలిస్టు మాతృ భూమి ప్రమాదంలో ఉన్నదని ప్రకటించింది. 'అందరు యుద్ధరంగానికే' అని లెనిన్ నినాదం ఇచ్చాడు. సోవియట్ ప్రభుత్వం 'యుద్ధకాల కమ్యూనిజం' అనే విధానాన్ని ప్రవేశపెట్టింది. లక్షలాదిగా కార్మికులు, రైతులు రెడ్ ఆర్మీలో చేరి యుద్ధరంగానికి వెళ్లారు. రెడ్ ఆర్మీ సంఖ్య 10 లక్షలకు పెరిగింది. బాల్య దశలోవున్న రెడ్ ఆర్మీ పరిపక్వమైంది. కాకలు తీరింది. 1920 చివరికల్లా విదేశీ జోక్యందారులందరినీ, స్వదేశీ ప్రతీఘాతకులందరిని ఓడించడానికి నూతన సోవియట్ రిపబ్లిక్ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను పరిరక్షించుకోవడానికి యుద్ధకాల కమ్యూనిజం తోడ్పడింది. ఆనాడు యూరప్‌ను ముంచెత్తిన విప్లవ వెల్లువ కూడా సోవియట్ రిపబ్లిక్ పరిరక్షణకు దోహదం చేసింది.

రష్యాలో రాజ్యాధికారం హస్తగతం చేసుకునే నాటికి మొదటి ప్రపంచ యుద్ధం పూర్తి స్థాయిలో కొనసాగుతోంది. రష్యా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. బ్రెస్ట్‌లితోవ్‌స్కి శాంతి సంధి ఈ శత్రువు ఆధిక్యతను కలిగి ఉన్నప్పుడు సరైన క్రమపద్ధతిలో రిట్రీట్ కావడమనే లెనినిస్టు ఎత్తుగడలకు మంచి ఉదాహరణ. ట్రాట్స్కీ లెనిన్ నాయకత్వానికి వ్యతిరేకంగా బుకారిన్ లాంటి వారితో కలిసి వామపక్ష కమ్యూనిస్టు కూటమిని ఏర్పాటు చేశాడు. 1918లో మే లో లెనిన్ 'వామపక్ష బాల్యారిస్టం– పెటీబూర్జువా మనస్తత్వం' అనే వ్యాసం రాశాడు. శాంతి– సోషలిజంల గురించి ట్రాట్స్కీ వాదులు (వామపక్ష కమ్యూనిస్టులు) చెప్పే అంతర్జాతీయ పదాడంభరమే అని విమర్శించాడు. సోషలిస్టు మాతృ భూమి రక్షణ ఏ విధంగా కార్మికవర్గ అంతర్జాతీయ ప్రయోజనాలకు అవసరమో వివరించాడు.

అక్టోబర్ విప్లవ విజయం ప్రపంచం మీద గొప్ప ప్రభావాన్ని చూపింది. ప్రపంచ యుద్ధం, విప్లవ సంక్షోభం కారణంగా నాలుగు భూస్వామ్య నిరంకుశ సామ్రాజ్యవాద దేశాలైన రష్యా, జర్మనీ, ఆస్ట్రో అంగేరియన్, టర్కీలు కుప్పకూలిపోయాయి. పాత సామ్రాజ్యవాదుల శిథిలాలపై కొత్త రాజ్యాలు ఏర్పడ్డాయి. జర్మనీలో జనవరి 15న రోజా లగ్జంబర్గ్, కార్ల్ లిబ్‌నెక్ట్‌లను జర్మనీ వైట్‌గార్డులు హత్య చేశారు. రష్యా నుండి నేర్చుకోక పోవడం వలన జర్మనీ, హంగేరీలలో విప్లవాలు విజయవంతం కాలేదు.

సోషల్ డెమోక్రటిక్ విద్రోహుల సిద్ధాంతకర్త కాట్స్కీ 1918లో కార్మిక నియంతృత్వం అనే పుస్తకం రాశాడు. అందులో సోవియట్ ప్రభుత్వం మీద దాడి ప్రారంభించాడు. దానికి వ్యతిరేకంగా లెనిన్ 'విప్లవ ద్రోహి కాట్స్కీ' అనే పుస్తకం రాశాడు. దానిలో బూర్జువా ప్రజాస్వామ్యం కన్నా కార్మికవర్గ నియంతృత్వం ఎలా సమర్థనీయమో వివరించాడు. ప్రపంచంలోని కమ్యూనిస్టు పార్టీలను ఐక్యపర్చడానికి మూడవ ఇంటర్నేషనల్ ఏర్పర్చడానికి 1919 మార్చిలో లెనిన్ నాయకత్వానా బోల్షివిక్‌ల చొరవతో మాస్కోలో వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీల ప్రథమ కాంగ్రెస్ జరిగింది. ఇది 3వ ఇంటర్నేషనల్‌ను స్థాపించింది. 1919లో పార్టీ 8వ కాంగ్రెస్ జరిగింది. కొత్త కార్యక్రమాన్ని ఆమోదించింది. పెట్టుబడిదారుల ఆస్తులను స్వాధీనం చేసుకునే పని పూర్తి చేయడం, సోషలిస్టు పథకం ప్రకారం దేశ ఆర్థిక జీవితాన్ని నిర్వహించుట, జాతీయ, ఆర్థిక నిర్మాణ కార్యకలాపాల్లో బూర్జువా

నిపుణులను వినియోగించుకొనుట, మధ్యతరగతి రైతాంగాన్ని పాల్గొనేలా చేయుట కర్తవ్యాలుగా రూపొందించారు. 1921 నుండి పరిస్థితి మరొక మలుపు తిరిగింది. ఆర్థిక పునరుద్ధరణ కోసం శాంతియుత కృషి సాధించడం. అందుకు నూతన ఆర్థిక విధానానికి (ఎన్.ఈ.పీ) విధానపరమైన మార్పు జరిగింది. రైతాంగం నుండి మిగులును ఆపు(జప్తు) చేశారు. ప్రైవేట్ తయారీదారుల, చిన్న తరహా వ్యాపారానికి అనుమతినిచ్చారు. ట్రాట్స్కీయిట్లు ఈ ఎన్.ఈ.పీ. విధానాన్ని గట్టిగా వ్యతిరేకించారు. 1921 మార్చిలో పార్టీ 10వ కాంగ్రెస్‌లో లెనిన్ వీరిని ఎదుర్కొన్నాడు. రష్యన్ కమ్యూనిస్టు పార్టీ ఎత్తుగడల గురించిన నివేదిక ఎన్.ఈ.పీ.ని సైద్ధాంతికంగా సరైనదని రుజువుపరిచింది. ఎన్.ఈ.పీ.ని సోషలిస్టు పారిశ్రామికీకరణ దశ వరకు (1925) కొనసాగించింది.

1922 చివరికి లెనిన్ అనారోగ్యానికి గురై, 1924 జనవరి 21న అమరుడయ్యాడు. పార్టీలోని ట్రాట్స్కీయిట్లు, ఇంకా ఇతర 46 ప్రతిపక్ష గ్రూపులు ఒక్కటై ప్రకటనను విడుదల చేశారు. 1924 జనవరిలో జరిగిన 13వ పార్టీ కాన్ఫరెన్సు ఆ ప్రతిపక్షాన్ని మార్క్సిజం నుండి వైదొలగిన బూర్జువా ధోరణిగా ఖండించింది. దీనికి స్టాలిన్ నాయకత్వం వహించాడు. లెనిన్ మరణానంతరం స్టాలిన్ నాయకత్వం వహించాడు. రష్యన్ పార్టీని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని నడపడంలో, రెండవ ప్రపంచ యుద్ధంలో కార్మిక వర్గ వ్యూహం-ఎత్తుగడలను రూపొందించడంలో, ఫాసిజాన్ని ఓడించి సోషలిజాన్ని విజయవంతం చేయడంలో స్టాలిన్ పాత్ర ముఖ్యమైనది.

లెనిన్ మరణంతో యావత్ ప్రపంచ కార్మికవర్గం తీవ్రమైన నష్టం జరిగిందని గుర్తించింది. అంతర్జాతీయ శ్రామికవర్గం 5ని॥లు పని బంద్ పెట్టి శ్రద్ధాంజలి ఘటించింది. లెనిన్ తమకు తండ్రి, గురువు, స్నేహితుడు, సంరక్షకుడు అని గుర్తించారు. వేలకొలది కార్మికులు పార్టీలోకి మూకుమ్మడిగా చేరారు. పార్టీ ఆశయం కోసం, లెనిన్ ఆశయం కోసం తమ ప్రాణాలను అర్పించడానికి సిద్ధమైన ప్రజలు కొద్ది కాలంలోనే 2 లక్షల 44వేల మంది బోల్షివిక్ పార్టీలో చేరారు; లెనిన్ స్మారక సభ్యత్వ క్యాంపేయిన్ విజయవంతం అయ్యింది. అదే రోజుల్లో సోవియట్ యూనియన్ సోవియట్ల 2వ కాంగ్రెస్ జరిగింది. పార్టీ పేరిట కా॥ స్టాలిన్ ఈ క్రింది ప్రతిజ్ఞను గావించాడు. పార్టీ సభ్యత్వ పవిత్రతను, ఔన్నత్యాన్ని, ఐక్యతను, శ్రామికవర్గ నియంతృత్వాన్ని, కార్మికులు-రైతుల మైత్రిని, జాతుల మధ్య సోదర సహకారాన్ని, రెడ్ ఆర్మీని, అంతర్జాతీయతను లెనిన్ ఆజ్ఞగా, గౌరవప్రదంగా స్వీకరిస్తూ అమలు చేస్తామని తమ నాయకుడైన లెనిన్ స్మారకంగా బోల్షివిక్ పార్టీ శపథం చేసింది.

పెట్టుబడిదారీ విధానం స్థిరీకరణతో పాటు, సోవియట్ యూనియన్ కూడా స్థిరపడింది. పెట్టుబడిదారీ విధాన స్థిరీకరణ మరో నూతన సంక్షోభానికి ప్రారంభం మాత్రమే. దీనికి భిన్నంగా సోవియట్ యూనియన్ స్థిరపడడం అంటే సోషలిస్టు దేశం యొక్క ఆర్థిక, రాజకీయ బలం మరింత పెంపొందడమే. 1922లో ఇటలీలోని జెనీవాలో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక సమావేశానికి సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్‌ను పిలిచి అక్టోబరు విప్లవం జాతిపరం చేసిన ఫ్యాక్టరీలు, కర్మాగారాలను తిరిగి అప్పగించాలని, జారు ప్రభుత్వం చేసిన రుణాలను సోవియట్ ప్రభుత్వం చెల్లించాలని, దీనికి బదులుగా నామమాత్రపు రుణాలు ఇస్తామని వాగ్దానం చేశారు. రాజనీతి పేరిట చేసిన ఈ సిగ్గుమాలిన కోరికలను సోవియట్ యూనియన్ తిరస్కరించింది. 1923లో బ్రిటన్ దాడి బెదిరింపును కూడా తిప్పికొట్టారు. సోవియట్ బలం అర్థమైన తర్వాత 1924లో బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, ఇటలీలు దౌత్యసంబంధాలు పెట్టుకున్నాయి.

వ్యవసాయ ఉత్పత్తి, పారిశ్రామిక ఉత్పత్తి పెరిగి జాతీయ ఆర్థిక విధానంలో కీలక స్థాయిలో సోషలిజం స్థిరపడింది. కార్మికుల జీతాలు పెరిగాయి. ఉత్పదక శక్తి పెరిగింది. రైతుల జీవన ప్రమాణాలు పెరిగాయి. శ్రామికవర్గ నియంతృత్వం మరింత దృఢతరం అయింది. బోల్షివిక్ పార్టీ ప్రతిష్ట, పలుకుబడి పెరిగింది. ట్రాట్స్కీవాదులు పార్టీ విధానాలను వ్యతిరేకించి, మెన్షివిక్‌ల శాశ్వత విప్లవ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. బుకారిన్ వాదులు "ధనికులు కండి" అనే కొత్త నినాదంతో పెట్టుబడిదారీ వర్గం శాంతియుతంగా సోషలిజంలోకి పోతుంది అన్నారు. జినోవివ్, కామనివ్‌లు దేశం ఆర్థికంగా సాంకేతికంగా వెనుకబడింది కాబట్టి సోషలిజం అసాధ్యమని చెప్పారు. కానీ త్వరలో తమ తప్పులను గుర్తించి వెనక్కి తగ్గారు; పార్టీ 14వ కాన్ఫరెన్సు లొంగుబాటు సిద్ధాంతాలన్నింటిని ఖండించింది. సోవియట్ యూనియన్ సోషలిస్టు విజయం కోసం పనిచేయాలనే పార్టీ పోకడను దృవపరిచింది. నూతన ప్రతిపక్షం అపజయం పాలైంది. అతివాద, మితవాద రెండు పెడ ధోరణులను కాంగ్రెస్ వదిలించుకుంది. పార్టీ పేరును సోవియట్ యూనియన్ యొక్క కమ్యూనిస్టు బోల్షివిక్ పార్టీ (సీ.పీ.ఎస్.యూ.) (బి) అని నిర్ణయించబడింది. నూతన ప్రతిపక్షం వారి నిరాశవాదాన్ని ఏడుపుగొట్టుతనాన్ని కాంగ్రెస్ కాలదన్నింది. బలాన్ని, సాధన సంపత్తిని సమీకరించిన పిదప బోల్షివిక్ పార్టీ తన చరిత్రలో సోషలిస్టు పారిశ్రామికం చేసే నూతన దశను దేశ చరిత్రలో తీసుకవచ్చింది.

1925- 29 మధ్య కాలంలో సోషలిస్టు పారిశ్రామికం చేసే పోరాటంలో దేశీయ, విదేశీ రంగాల్లో వచ్చిన అనేక కష్టాలను ఎదుర్కొని పార్టీ జయించింది. సోషలిస్టు నిర్మాణానికై ప్రథమ పంచవర్ష ప్రణాళిక ఆమోదించబడింది. దేశంలో వర్గ పోరాటం, పార్టీలో అంతరంగిక పోరాటం తీవ్రమయ్యాయి. వీటి ఫలితంగా కులక్‌ల ప్రతిఘటన అణిచివేయబడింది. ట్రాట్స్కీ, జినోవీవ్‌ల, లొంగుబాటుదారుల కూటమి సోవియట్ వ్యతిరేక కూటమిగా, కులక్ ఏజెంట్లుగా బహిర్గతమయ్యారు. వీరిని పార్టీ నుండి బహిష్కరించారు. లక్షలాది శ్రమజీవుల్లో సోషలిస్టు పోటీ అభివృద్ధి చెందింది. క్రమశిక్షణ పెరిగి సమిష్టి వ్యవసాయ క్షేత్రాల వైపు మధ్యతరగతి మొగ్గారు. ప్రజా బాహుళ్యపు సమిష్టి వ్యవసాయ ఉద్యమం ప్రారంభమయ్యింది.

ప్రపంచ యుద్ధాల నడుమ ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ చాలా కాలం పాటు కుప్పకూలినట్లు కనిపించింది. 1913 నుండి 1925 వరకు గల 25 సం॥రాల కాలంలో ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తి 8 శాతం మాత్రమే పెరిగింది. 1924- 29 మధ్య ప్రపంచ పెట్టుబడిదారీ విధానం సాపేక్షికంగా స్థిరత్వం పొందిన కాలం. 1929 నుండి 33 వరకు సాగిన మహా మాంద్యం, రెండవ ప్రపంచ యుద్ధం వరకు కొనసాగిన సంక్షోభం భూగోళమంతటినీ ముంచెత్తింది. వైరుధ్యాలు పదునెక్కాయి. సామాజిక, రాజకీయ, అశాంతి పెరిగి విప్లవ వెల్లువలు పుంజుకున్నాయి. పాలక వర్గాలు తమ పరిష్కారానికి ప్రతిఘాతకత్వం, ఫాసిజాన్ని ఆశ్రయించాయి. 1930- 31లో జపాన్‌లో సైనిక పాలన వచ్చింది. 1933లో జర్మనీ నాజీల పాలనను తెచ్చింది. దీనికి భిన్నంగా సోవియట్ రష్యాలో ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఎక్కడా కనబడలేదు. 1939లో జరిగిన పార్టీ 18వ కాంగ్రెస్‌కు స్టాలిన్ ఇచ్చిన సమాచారం ప్రకారం 99.4శాతం రైతుల భూమి సమిష్టి వ్యవసాయ క్షేత్రాల కిందికి వచ్చింది. పారిశ్రామిక ఉత్పత్తిలో 99.7 శాతం సోషలిస్టు పారిశ్రామిక రంగం నుండి వచ్చింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభ ప్రభావం సోవియట్ రష్యా మీద పడలేదు. దానికి కారణం అక్కడ సోషలిస్టు నిర్మాణం మౌలికంగా సరైన మార్క్సిస్టు వైఖరి చేపట్టడం వలన వ్యవసాయ రంగాల్లో అనేక విజయాలు లభించాయి.

1935 ఫిబ్రవరిలో సోవియట్ యూనియన్ సోవియట్ల 7వ కాంగ్రెస్ జరిగింది. 1924లో ఆమోదించబడిన సోవియట్ యూనియన్ ప్రథమ రాజ్యాంగ చట్టాన్ని అమలు పరిచింది. ఈ కాలంలో రక్త సంబంధాలు మారాయి. నూతన సోషలిస్టు పరిశ్రమ నిర్మాణం జరిగింది. కులక్‌లు నాశనం చేయబడ్డారు. సమిష్టి వ్యవసాయ పద్ధతి విజయం పొందింది. ఉత్పత్తి సాధనాలపై సోషలిస్టు యాజమాన్యం నెలకొల్పబడింది. స్టాలిన్ అధ్యక్షతన ఒక రాజ్యాంగ ఉపసంఘం ఏర్పడి సోవియట్ నూతన రాజ్యాంగ చట్టాన్ని తయారు చేసింది. దేశవ్యాప్త చర్చకు పెట్టి ఆ తర్వాత సోవియట్ల 8వ కాంగ్రెస్‌లో లోతుగా చర్చించారు. కార్మికులు, రైతులు, మేధావులు సోవియట్ నిర్మాణ కాలంలో గొప్ప మార్పుకు గురయ్యారు. దోపిడీ నుండి విముక్తి చెంది ఉత్పత్తి సాధనాలపై సమిష్టి వ్యవసాయ క్షేత్రాలపై సోషలిస్టు యాజమాన్యం నెలకొల్పిన కొత్త రకం కార్మికవర్గం, కొత్త రకం రైతాంగం ఇది. ప్రభుత్వ ఉన్నతాధికార సంస్థ దాని సుప్రీం సోవియట్. దీనిలో రెండు శాసన సభలు ఉంటాయి. అని 1. యూనియన్ సోవియట్ 2. జాతుల సోవియట్. సోషలిస్టు ఆర్థిక విధానం, ఉత్పత్తి సాధనాలపై సోషలిస్టు యాజమాన్యం ఈ రెండు సోవియట్ యూనియన్ల ఆర్థిక విధానానికి పునాది. "శక్తిని బట్టి పని- పనిని బట్టి ప్రతిఫలం." అనే సోషలిస్టు సూత్రాన్ని ఆచరణలో అమలు చేశారు. పౌరులందరికీ 'పని చేసే హక్కు' 'విశ్రాంతి- విరామాల హక్కు వృద్ధులు, రోగులు, అంగవైకల్యం గలవారికి జీవనభృతి పొందే హక్కు స్త్రీ- పురుషుల సమానత్వ హక్కు, మత స్వేచ్ఛ హక్కులతో పాటు చట్టాలను అనుసరించడం, క్రమశిక్షణ పాటించడం, బాధ్యతల నిర్వహణ, నిబంధనలను గౌరవించడం, ప్రజల ఆస్తిని, సోషలిస్టు ఆస్తిని కాపాడడం, సోషలిస్టు మాతృభూమిని సంరక్షించడం, సోవియట్ల 8వ కాంగ్రెస్ మూసాయిదాను ఏకగ్రీవంగా ఆమోదించింది. "సామర్థ్యాన్ని బట్టి పని- అవసరాన్ని బట్టి పంపకం" అనే కమ్యూనిస్టు సూత్రం మార్గదర్శక సూత్రంగా ఉంటుందని ఈ చారిత్రక నూతన రాజ్యాంగ శాసన రీత్యా స్థిరీకరించింది.

పాలక బూర్జువా వర్గం ఈ విపత్కర ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితి నుండి బయటపడడానికి ఫాసిజాన్ని కోరుకున్నారు. ప్రధాన పారిశ్రామిక దేశాలు ఫాసిస్టు ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకొని ప్రపంచ పునర్ విభజన కోసం నూతన ప్రపంచ యుద్ధానికి సన్నద్ధం అయ్యాయి. యుద్ధ సన్నాహాలు ముమ్మరంగా జరుగుతుండగా మూడవ ఇంటర్నేషనల్ 7వ కాంగ్రెస్ జరిగింది. సామ్రాజ్యవాదుల వ్యూహానికి ప్రతిగా స్టాలిన్, డిమిట్రావ్‌ల నాయకత్వంలో కొత్త ఎత్తుగడలు రూపొందించారు. సోవియట్ యూనియన్ రక్షణ, ఫాసిస్టు యుద్ధోన్మాదాన్ని ఓడించడం, జాతీయ విముక్తి పోరాటాలను అభివృద్ధి చేయడం, సాధ్యమైనన్ని దేశాల్లో సోవియట్ అధికారాన్ని స్థాపించడం, అందుకుగానూ సాధ్యమైనన్ని శక్తుల్ని ఐక్యం చేయడం, సోషల్ డెమోక్రట్లతో కలిసి ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటనను, ఫాసిస్టు వ్యతిరేక ప్రజా ఐక్య సంఘటనను నిర్మించాలని తీర్మానించారు.

ఫాసిస్టేతర సామ్రాజ్యవాద శక్తులు (బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా) జర్మనీని సోవియట్ యూనియన్‌పై దాడికి రెచ్చగొడుతున్నప్పుడు స్టాలిన్ 1939 ఆగస్టులో జర్మనీతో నిర్యుద్ధ సంధిని చేసుకున్నాడు. ఈ రకమైన ఎత్తుగడ వలన రష్యాకు యుద్ధ సన్నాహాలకు అవసరమైన సమయం దొరికింది. అయితే 1941 జూన్‌లో జర్మనీ రష్యాపై దాడిని మొదలు పెట్టింది. సోవియట్ రష్యాలోని బోల్షివిక్ పార్టీ, సోషలిస్టు ప్రభుత్వం రెడ్ ఆర్మీలు వీరోచితంగా పోరాడి జర్మనీ సైన్యాలను నాశనం చేస్తూ, వెనక్కి తరుముతూ తూర్పు యూరప్‌ను విముక్తి చేసి బలమైన, విస్తృతమైన సోషలిస్టు శిబిరాన్ని నిర్మించాయి. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే సరికి సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని మరొక తీవ్ర విప్లవ సంక్షోభంలో ముంచెత్తింది. జాతి విముక్తి పోరాటాల వెల్లువలో అన్ని సామ్రాజ్యాలు కూలిపోయాయి. 5 కోట్ల 40 లక్షల మంది ప్రాణాలను ఈ యుద్ధం బలిగొంది. అమెరికా మినహా మిగతా ప్రధాన సామ్రాజ్యవాద దేశాలన్నింటి ఆర్థిక వ్యవస్థలను నాశనం చేసింది. సామ్రాజ్యవాద ప్రత్యక్ష పాలన సాధ్యం కాదని తెలిపోయింది. పెద్ద సంఖ్యలో అనేక దేశాలు సోషలిస్టు శిబిరంలో చేరిపోయాయి. రష్యా ప్రతిష్ఠ పెరగడం, తూర్పు యూరప్ దేశాలన్ని విముక్తి కావడం, ఉత్తర కొరియా, ఉత్తర వియత్నాం, చైనా కమ్యూనిస్టు పార్టీలు పురోగమించి తరువాత కాలంలో విప్లవాన్ని విజయవంతం చేశాయి. సోవియట్ యూనియన్ నాయకత్వంలో ప్రపంచంలో మూడవవంతు భాగం శక్తివంతమైన సోషలిస్టు శిబిరంగా ఏర్పడింది. సోవియట్ రష్యా, చైనా విప్లవానికి అనేక రకాలుగా సహకరించింది. ఒక దేశంలో విజయవంతం అయిన విప్లవం ప్రపంచంలో అన్ని దేశాల విప్లవాలకు చేయగలిగిన సహకారాన్ని స్థావర ప్రాంతంగా స్టాలిన్ బతికున్నంతా కాలం చేసింది.

కా॥ స్టాలిన్ ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి, సోవియట్ దేశానికి, విప్లవకర నాయకత్వ పాత్రను జయప్రదంగా నిర్వహించాడు. మూడవ వంతు ప్రపంచం సోషలిస్టు శిభిరంగా మారడంలో స్టాలిన్ కృషి గణనీయమైంది. 1954లో స్టాలిన్ అమరుడయ్యాడు. ఆనాడు (ఆ కాలంలో) అంతర్జాతీయ కార్మిక వర్గపు ప్రధాన పార్టీగా ఉండిన సీ.పీ.ఎస్.యూ పైన కృశ్చేవ్ నాయకత్వంలోని ముఠా కుట్రపూరితంగా పార్టీలోని విప్లవకారులను చంపడం లేదా వెళ్ళగొట్టడం చేసి ఆధిపత్యాన్ని సంపాదించింది. పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించే క్రమాన్ని ప్రారంభించింది. సామ్రాజ్యవాద శిభిరంతో ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదంతో సంబంధాలు పెంచుకుంది. 1956 కల్లా ఆ ముఠా పార్టీపైన గట్టిపట్టును సంపాదించింది. సీ.పీ.ఎస్.యూ. 20వ కాంగ్రెస్ రివిజనిస్టు విషాన్ని వ్యాపింపజేసింది. శాంతియుత పరివర్తన- శాంతియుత సహజీవనం- శాంతియుత పోటీలను ప్రవేశపెట్టింది. ఆ ముఠా వ్యక్తిపూజ అనే పేరిట స్టాలిన్‌పై దాడిచేసి రాజకీయంగా స్టాలిన్‌ను నిర్మూలించాలని కోరుకున్నది.

ఆయా దేశాల్లో రివిజనిస్టు పంథాను చేపట్టిన నాయకులు, పార్టీలు కృశ్చేవ్ రివిజనిస్టు పంథాను ఆమోదించాయి. అమెరికాకు చెందిన బౌడర్, ఫ్రాన్స్‌కు చెందిన తోవ్‌రేన్, ఇటలీకి చెందిన టోగ్లియాటి, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కృశ్చేవ్ మార్గాన్ని అనుసరించాయి. చైనా, ఆల్జిరియా లాంటి దేశాలు కృశ్చేవ్ రివిజనిజాన్ని వ్యతిరేకించాయి. మావో నాయకత్వంలో సి.పి.సి. స్టాలిన్‌ను అత్యంత గొప్ప మార్క్సిస్టు-లెనినిస్టుగా గుర్తించింది. కృశ్చేవ్ రివిజనిజంతో పార్టీ వేదికల్లో అంతర్గతంగా 7 సం॥రాల సుదీర్ఘ కాలం పాటు పోరాడింది. 1957లో జరిగిన 60 సోదర పార్టీల సమావేశాలలోనూ, 1960లో జరిగిన 80 సోదర పార్టీల సమావేశంలోనూ, అలాగే రష్యా పార్టీతో జరిపిన సమావేశంలోనూ రాజీలేని విధంగా కామ్రేడ్ మావో సైద్ధాంతిక, రాజకీయ పోరాటాన్ని నడిపాడు. 1963లో బహిరంగంగా మొదలై 1964 అంతా ఆ పోరాటం కొనసాగింది. అదే గ్రేట్ డిబేట్.

అది ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా సాగిన సూత్రబద్ధమైన, సమగ్రమైన పోరాటం. ప్రపంచ కార్మిక విప్లవ కారులందరినీ సమీకరించే కేంద్రంగా మార్క్సిజం, లెనినిజం యొక్క అభివృద్ధి దోహదం చేస్తూ, సాధారణ విప్లవ పంథాను అందించింది. పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించాలంటే సోషలిస్టు నిర్మాణాన్ని పురోగమింపజేయాలంటే, కమ్యూనిజంలోకి, పరివర్తనకు పరిస్థితులను సృష్టించాలంటే, సోషలిస్టు చారిత్రక దశలో కార్మికవర్గ నియంతృత్వాన్ని కొనసాగించడం, సోషలిస్టు విప్లవాన్ని చివరి వరకూ కొనసాగించడం అవసరం. ఆర్థిక రంగంలో సోషలిస్టు విప్లవంతో పాటు రాజకీయ, భావజాల రంగాలలో కూడా విస్తృతమైన, లోతైన విప్లవం జరగాలి. ప్రజా పంథాలో ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజా ఉద్యమాలను చేపట్టాలి. సోషలిస్టు శత్రువులకు వ్యతిరేకంగా జనాభాలో 95 శాతం ప్రజలతో అగ్రగామి దళంగా ఐక్యం కావాలి. దీనికి భిన్నంగా వ్యవహరించడంతో రష్యాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగింది.

కా॥ స్టాలిన్ నుండి కొన్ని పొరపాట్లు జరిగాయి. వాటిని తాను గుర్తించాడు. సోవియట్ సమాజంలో వైషమ్య పూరితమైన వర్గాలు, శత్రు వర్గాలు నిర్మూలించబడ్డాయని అంచనాకు వచ్చాడు. ఈ పొరపాట్లు ఉన్నా స్టాలిన్ ప్రధానంగా విప్లవ ప్రయోజనాలకే సోషలిస్టు నిర్మాణానికే జీవితాంతం కృషి చేశాడు. స్టాలిన్ 75 శాతం ఒప్పులు చేశాడని, రష్యాకు, ప్రపంచానికి మార్గదర్శిగా, మార్క్సిజం-లెనినిజాన్ని పరిరక్షించి విస్తృతం చేసిన నాయకుడిగా, గొప్ప విప్లవకారుడిగా, శత్రువుల పాలిట ఉక్కుమనిషిగా గుర్తిస్తూ స్టాలిన్ విప్లవ కారుడే అని మావో నిర్ధారించాడు. స్టాలిన్ మీద కుట్రపూరితంగా జరిగిన దాడిని అంతర్జాతీయ కమ్యూనిస్టు సమాజం తిప్పికొట్టింది.

**బోల్షివిక్ పార్టీ అధిగమించిన చారిత్రక పంథా నుండి మనం ఈ క్రింది అంశాలు (సారాంశం) నేర్చుకోవాలి.**

1. విప్లవ, శ్రామికవర్గ పార్టీ లేనిదే, అవకాశవాదం, రాజీ బేరగాళ్ళు, లొంగుబాటు దారులతో అంతర్గత పోరాటం జరగనిదే రాజ్యాధికార లక్ష్యంతో శ్రామిక వర్గ విప్లవ విజయాన్ని, శ్రామికవర్గ నియంతృత్వాన్ని, సాధించలేమని పార్టీ చరిత్ర బోధిస్తున్నది. అటువంటి నూతన పార్టీ లెనినిస్టు పార్టీనే.

2. మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతం అర్థం కాకుంటే కార్మికవర్గ పార్టీ శ్రామికవర్గ విప్లవ నిర్మాతగా నాయకత్వ పాత్రను నిర్వహించలేదు. సరైన పరిష్కార మార్గాన్ని, అంతరంగిక సంబంధాలను, అభివృద్ధి క్రమాన్ని అర్థం చేసుకోవడానికి సిద్ధాంతం అవసరం. ఆత్మవిశ్వాసంతో కార్మికవర్గం పురోగమించడానికి, ఆటంకాలను అధిగమించడానికి సిద్ధాంతం అవసరం. సిద్ధాంతం పిడివాదం కాదు. కార్యాచరణకు మార్గం.

3. కార్మిక వర్గ ఐక్యతను చీల్చే మధ్యతరగతి పార్టీలను నాశనం చేస్తే తప్పా శ్రామికవర్గ విప్లవం విజయం సాధించదు. పెటీ బూర్జువా పార్టీలైన సోషలిస్టు రివెల్యూషనరీలకు, మెన్షివిక్‌లకు, అరాచకవాదులకు, సంకుచిత జాతీయవాదులకు వ్యతిరేకంగా రష్యన్ కార్మికవర్గం పోరాడి ఓడించింది. అత్యంత విప్లవకరమైన మార్క్సిస్టు పార్టీ వల్లనే ఇతర పార్టీలకు వ్యతిరేకంగా ఎడతెగని పోరాటం సాగించుట వల్లనే సామాజిక విప్లవ దశలో శ్రామిక ఐక్యత సాధించబడుతుంది.

4. అవకాశవాదుల్ని, లొంగుబాటు దారులను నాశనం చేయకుండా ఐక్యతను, క్రమశిక్షణను నిలబెట్టలేదు. ఎకనామిస్టులు, మెన్షివిక్‌లు, ట్రాట్స్కీవాదులు, బుకారిన్‌వాదులు, పెడదారి పట్టిన జాతీయవాదులు మున్నగు వారినందరినీ ఓడించి సోషలిజం నిర్మించడం జరిగింది. మన అనుచరుల్లో సంస్కరణవాదులు, మెన్షివిక్‌లు, పెటీబూర్జువా ప్రజాతంత్రవాదులు ఉండిపోయినట్లయితే క్లిష్ట సమయాల్లో సోవియట్ ప్రభుత్వం కూలదోయబడి ఉండేది.

**(మిగతాది 23వ పేజీలో)**

# మరణశయ్యపై- మరమగ్గాలు

## వంద సంవత్సరాల రష్యా సోషలిస్టు విప్లవ స్ఫూర్తితో పోరాడండి

బట్టను చేసే కార్మికునికి బతుకు దెరువు కరువైంది. చాలీ చాలని వేతనాలతో బతుకు బండిని లాగుతూ...."చావు- బ్రతుకు" మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఏళ్లు గడిచినా కూలీ పెంచకపోవడంతో అర్థాకలితో అలమటిస్తున్నారు. ఆధారం చూపని ధారం పోగులు... మరమగ్గాల చాటున వెక్కిరిస్తుంటే...బతుకు చిద్రమైన నేతన్నలు ఆ ధారాలనే ఉరితాళ్లుగా చేసుకొని ఊపిరి వదులుతున్నారు. పెరిగిన ధరలు, బడా కంపెనీల పోటి, పవర్‌లూమ్స్ యాజమానులు, కార్మిక బతుకులను బుగ్గిపాలు చేస్తోంది. పవర్‌లూమ్ పరిశ్రమలోని కార్మికుల దుస్థితి, ప్రపంచీకరణ మూలంగా చేనేత కార్మికుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రస్తుత జీ.ఎస్.టీ. అమలు మూలంగా నేత కార్మికుల మీద ప్రభావం పడుతుంది.



### సిరిసిల్లలో కార్మికుల దుస్థితి

ప్రస్తుతం పది పిక్కులకు 0.20 పైసలు చెల్లిస్తున్న కూలిని 0.28 పైసలకు పెంచాలని సిరిసిల్లలోని పవర్‌లూమ్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీనితో సిరిసిల్లలో పాలిష్టర్ బట్ట ఉత్పత్తి జరిగే 35 వేల మరమగ్గాలు స్తంభించిపోయాయి. పనులను ఆపినారు. కార్మికులను ఉత్పత్తి రంగంలోకి తీసుకొచ్చేందుకు మరమగ్గాల ఆధునీకరణ పథకం "యార్న్ బ్యాంక్" మెగా పవర్‌లూమ్ క్లస్టర్ వంటివి చేస్తామని మంత్రి కే.టీ.ఆర్. ప్రకటించినా... అవి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. 7 వేల మంది కార్మికులకు ఉపాధి లక్ష్యంతో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కు ఏ మాత్రం భరోసా కల్పించలేకపోతుంది. కార్మికులకు నెలకు కనీసం 15 వేలు వేతనం అందేలా చర్యలు తీసుకుంటామని మరమగ్గాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి కే.సీ.ఆర్. స్వయంగా ప్రకటించినా దానికి అతీగతీ లేకుండాపోయింది.

టెక్స్‌టైల్, జిల్లా ఉన్నతాధికారుల నివేదికలు గానీ, శాసన సభ్యుల ఆలోచనా విధానాలను గానీ వ్యవస్థను యజమానుల కోణం నుంచి అవగతం చేసుకున్నాయి. పరిశ్రమలో సంక్షోభం పేరుతో రెగ్యులేట్ చేసే యత్నాలు చేసింద్రు తప్పా, కార్మికునికి నేరుగా ఫలితాలు అందే చర్యలు ఏవీ ఇంత వరకు జరుగలేదనే చెప్పాలి.

ప్రధాన, అనుబంధ నేత పరిశ్రమల్లో కార్మికులు మొత్తం 25 వేల వరకు ఉంటారు. అయితే వీరంతా అసంఘటిత కార్మికులు అంటే గుర్తింపులేని వారు. వీరికి ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యంలేదు. ప్రభుత్వం కల్పించే ఎలాంటి సహాయాలు వీరి చెంతకు చేరవు. అంతా కంటితుడుపు చర్యలు. ఒక విధంగా సిరిసిల్ల నేత కార్మికుల విషయంలో అన్ని ప్రభుత్వ శాఖలు విఫలం చెందాయి. అసంఘటిత కార్మికులుగా వుండడమే అసలు సమస్యకు మూల కారణం. ప్రభుత్వాలు కార్మిక ఆత్మహత్యల సమస్య తీవ్రతను గ్రహించి 2002 నుంచి పవర్‌లూం పరిశ్రమను కుటీర పరిశ్రమగా పరిగణించి 50శాతం విద్యుత్ సబ్సీడిని అంద చేస్తున్నాయి. 2006 నుంచి ప్రారంభమైన టెక్స్‌టైల్ పార్క్ పరిశ్రమలకు 2010 నుంచి 2014 వరకు 50శాతం విద్యుత్ రాయితీ ఇచ్చింది. పరిశ్రమ నిలదొక్కుకోవడానికి లోన్లు, క్రాఫ్ సబ్సిడీలు, విద్యుత్ రాయితీలు యజమానులకు అందాయి. కానీ కార్మికునికి బోటాబోటి పని దొరికిందే తప్ప పెద్దగా ఒరిగింది లేదు. సారంశంలో 1997 నుంచి 2016 వరకు దాదాపు 392 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇందులో ప్రభుత్వ నిబంధనలకు లోబడి 204 మందికి పరిహారం అందింది. మిగతా కుటుంబాలు గాలిలో దీపాలుగా రెపరెపలాడుతున్నాయి.

**కడిగేసిన కాగ్:** సిరిసిల్ల నేత కార్మికుల ఆత్మహత్యలను ఆపడమే లక్ష్యంగా సిరిసిల్లలో 2003 టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం చేపట్టి 2004లో పూర్తి చేసారు. దాదాపు 7 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించడానికి 192 యూనిట్లను నెలకొల్పే విధంగా 7.73 రూ॥ కోట్లతో పార్క్ నిర్మాణం చేపట్టారు. అయితే 114 యూనిట్లను మాత్రమే నెలకొల్పారు. 7 వేల మంది కార్మికులకు ప్రస్తుతం 1250 మంది కార్మికులు మాత్రమే పని చేస్తున్నారు. పార్కు స్థాపన తర్వాత ఇప్పటి వరకు జరిగిన పరిణామాలపై భారత కంట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) కూడా పార్కులోని లోపాలను ఎత్తి చూపింది.

**ఇంటిల్లిపాది పని చేస్తే మూడొందలు:** మరమగ్గాలపై బట్టల తయారీకి వాటి యజమానులే మాస్టర్ వీవర్స్‌గా పని చేస్తున్నా గిట్టుబాటు కావడం లేదు. మీటర్ బట్ట తయారీకి రూ॥ 6 చొప్పున తయారు చేసి ఇవ్వాలి. రోజుకు 12 గంటలు పని చేసినా 50, 60 మీటర్ల వస్త్రం కూడా తయారు కాదు. విద్యుత్, మరమగ్గాల నిర్వహణ, రవాణా చార్జీలు పోతే రోజుకు నాలుగు మర మగ్గాలపై రూ॥ 300 కూడా కూలీ గిట్టుబాటు కావడం లేదని నేత కార్మికులు వాపోతున్నారు.

**తక్కువ కూలీతో భారంగా కుటుంబ పోషణ:** మరమగ్గాల పరిశ్రమలో పొద్దంత పని చేసినా తక్కువ కూలే వస్తుంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. యజమానులు పెంచిన కూలీని ఇవ్వకుండా తక్కువ

**(మిగతాది 35వ పేజీలో)**

# దారిలో

విచ్ఛిత్తి, సిద్ధాంత, రాజకీయ అనైక్యతా, పార్టీ లక్ష్యరహితంగా కొట్టుక పోవడమూ జరిగి సంవత్సరం గడిచింది. మన సకల పార్టీ శాఖల సభ్యత్వమూ పడిపోయింది. వాటిలో కొన్ని-అన్నింటికంటే తక్కువ కార్మికవర్గ సభ్యత్వం గలవి ముక్క చెక్కలైనాయి. విప్లవం సృష్టించిన అర్థ చట్టబద్ధ పార్టీ శాఖలు పదే పదే బ్రద్దలు చేయబడినాయి. పరిస్థితులు యే స్థితికి వచ్చినాయంటే, సాధారణ విచ్ఛిత్తి ప్రభావం వలన పార్టీలోని కొంత మంది పాత సోషల్ డెమోక్రటిక్ పార్టీని నిలుపుకోవడం అవసరమా అనీ, దాని పనిని కొనసాగించడం అవసరమా అనీ, మరోకసారి అజ్ఞాతవాసంలోకి వెళ్లడం అవసరమా అనీ, యెలా వెళ్లాలి అనీ అడుగుతున్నారు. యెట్టి పరిస్థితులలోనూ, పార్టీ కార్యక్రమాన్నీ, యెత్తుగడలనూ, నిర్మాణాన్నీ బహిరంగంగా విసర్జించడం అనే మూల్యం చెల్లించి అయినా, (రద్దువాదుల ధోరణి[14] అనబడేది) ఈ ప్రశ్నకు జవాబు చెప్తున్నారు. నిస్సందేహంగా ఇది, నిర్మాణపరమైన సంక్షోభం మాత్రమే కాదు, సిద్ధాంత, రాజకీయ సంక్షోభంగా కూడా వుండింది.

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీయొక్క ఇటీవలి అఖిల రష్యా కాన్ఫరెన్సు[15] పార్టీని మళ్లీ దారిలోకి తెచ్చింది; విప్లవ ప్రతీఘాతపు విజయం తర్వాత రష్యన్ కార్మిక వర్గ ఉద్యమంలో ఇది మలుపులా కనిపిస్తోంది. కాన్ఫరెన్సు తీర్మానాలు, మన పార్టీ కేంద్ర కమిటీచేత జారీచేయబడిన ప్రత్యేక "నివేదిక"లో ప్రచురింపబడినట్టివి, కేంద్ర కమిటీచేత ఆమోదింపబడినాయి; కనుక అవి వచ్చే మహాసభ దాకా యావత్తు పార్టీ తీర్మానాలుగా వుంటాయి. ఈ తీర్మానాలు సంక్షోభపు కారణాలూ, ప్రాముఖ్యమూ, దాన్ని అధిగమించే మార్గాలూ యేమిటనే ప్రశ్నకు చాలా నిశ్చితమైన జవాబు ఇస్తాయి. కాన్ఫరెన్సు తీర్మానాల తత్వంలో పనిచేయడం ద్వారా, పార్టీ కార్యకర్తలందరూ పార్టీ యొక్క ప్రస్తుత కర్తవ్యాలను స్పష్టంగా, పూర్తిగా గుర్తించేటట్లు కృషిచేయడం ద్వారా, మన శాఖలు ఫలవంతమైన విప్లవ సోషల్ డెమోక్రటిక్ పనికిగాను తమ బలాలను పటిష్ట పరుచుకొని, దృఢ పరుచుకొనగలవు.

పార్టీ నిర్మాణం మీద చేసిన తీర్మానపు ఉపోద్ఘాతంలో పార్టీ సంక్షోభపు ప్రధాన కారణం చూచింపబడింది. ఈ ప్రధాన కారణం ఊగిసలాడే మేధావి, పెటీబూర్జువా అంశాలు; వీటిని కార్మికుల పార్టీ తొలగించుకోవలసి వుంది. ఈ అంశాలు ప్రధానంగా బూర్జువా ప్రజాతంత్ర విప్లవం త్వరగా జయిస్తుందనే ఆశతో కార్మికవర్గ ఉద్యమంలో చేరినాయి; ప్రగతి వ్యతిరేక దశకు ఇవి తట్టుకోలేకపోయినాయి. వీటి అస్థిరత్వం యిటు సిద్ధాంతంలోనూ ("విప్లవ మార్క్సిజంనుండి వైదొలగడం". ప్రస్తుత పరిస్థితి మీద తీర్మానం) యెత్తుగడలలోనూ ("నినాదాలను తగ్గించడం"[16]), అలాగే పార్టీ నిర్మాణ విధానంలోనూ వెల్లడైంది. వర్గ చైతన్య పూరిత కార్మికులు ఈ అస్థిరత్వాన్ని ఎదుర్కొని, రద్దువాదాన్ని వ్యతిరేకించి పార్టీ శాఖలను నిర్వహించడమూ, నడిపించడమూ తమ చేతుల్లోకి తీసుకోవడం ప్రారంభించినారు. పార్టీలోని ఈ గట్టి కేంద్రకం అనైక్యతా సంక్షోభాల అంశాలను మొట్ట మొదట అధిగమించలేకపోయిందంటే, విప్లవ ప్రతీఘాతం విజయం పొందడం యీ కర్తవ్యం పెద్దదీ, కష్టమైనదీ కావడంవల్ల మాత్రమే కాదు, విప్లవాభిముఖులైనప్పటికీ, తగినంతగా సోషలిస్టు చైతన్య పూరితులు గాని కార్మికులలో పార్టీ పట్ల కొంత నిర్లక్ష్యం వుండడంవల్ల కూడా. అనైక్యతతోనూ, ఊగిసలాటతోనూ పోరాడే మార్గాల గురించి సోషల్ డెమోక్రసీ యొక్క రాటుదేలిన అభిప్రాయంగా కాన్ఫరెన్సు తీర్మానాలు ప్రధానంగా ఉద్దేశింపబడింది సరిగ్గా వర్గ చైతన్య పూరితులైన రష్యా కార్మికులకే.

ఈనాటి వర్గ సంబంధాల మీదా, జారిజం యొక్క నూతన విధానం మీదా మార్క్సిస్టు పరిశీలన; గతంలో లాగే ఇప్పుడు మన పార్టీ పెట్టుకుంటూనే వున్న తక్షణ పోరాట లక్ష్యం గురించి సూచన; విప్లవ సోషల్ డెమోక్రట్ల యెత్తుగడలు యెంతవరకు సరైనవనే విషయం మీద విప్లవం నేర్పిన గుణపాఠాలను గ్రహించడం; పార్టీ సంక్షోభపు కారణాలను వివరించడమూ, దానిమీద పోరాటం చేసిన పార్టీలోని కార్మికవర్గ అంశాల పాత్ర నొక్కి చెప్పడమూ; రహస్య సంఘాలకూ, చట్టబద్ధ సంఘాలకూ మధ్య గల సంబంధం గురించిన సమస్యా పరిష్కారం, డ్యూమ వేదికను వినియోగించుకోవలసిన అవసరాన్ని గుర్తించడమూ, మన డ్యూమ బృందం[17] పొరపాట్ల మీద సూటి విమర్శతో జతపరిచి, ఆ బృందాన్ని నడిపించడానికి కచ్చితమైన ఆదేశాలు రూపొందించడమూ-ఇది కార్మికవర్గ పార్టీ ప్రస్తుత కష్టదశలో కచ్చితమైన ఒక మార్గాన్ని యెన్నుకునే సమస్యకు సంపూర్ణమైన జవాబు యిచ్చే కాన్ఫరెన్సు తీర్మానాల ప్రధాన సారం. ఈ జవాబు శ్రద్ధగా పరిశీలిద్దాం.

తమ రాజకీయ గ్రూపింగులలో వర్గాల సంబంధం జనాల ప్రత్యక్ష విప్లవ పోరాటం జరిగిన గత దశలో(1905-07 విప్లవ దశ) వున్నట్టే వుంది. యేది అర్థ ఫ్యూడల్ భూ యాజమాన్యాన్ని ధ్వంసం చేస్తుందో, జారిజంను కూలదోయకుండా యేది సాధింపబడజాలదో, ఆ వ్యవసాయ విప్లవం కొరకు అత్యధిక భాగం రైతులు ఆశపడకుండా వుండరు. ప్రగతి వ్యతిరేకత యొక్క విజయం రైతాంగంలోని ప్రజాతంత్ర శక్తులను తీవ్రంగా దెబ్బతీసింది; రైతాంగం గట్టిగా సంఘటితపడడానికి శక్తి లేకుండా వుంది. కానీ, యెంత దమనకాండ వున్నప్పటికీ, "నల్ల నూర్ల" డ్యూమ[18] వున్నప్పటికీ, "త్రుదోవీక్కులు"[19] అత్యంత అస్థిరంగా వున్నప్పటికీ, రైతు జనాల విప్లవ మనస్థితి మూడవ డ్యూమా చర్చలలో స్పష్టంగా వెల్లడౌతున్నది. రష్యాలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవపు కర్తవ్యాల విషయంలో కార్మికవర్గపు మౌలిక వైఖరి యేమీ మారకుండా అలాగేవుంది; ప్రజాతంత్ర రైతాంగానికి నాయకత్వం వహించడమూ, ఉదారవాద బూర్జువావర్గం యొక్క, అక్టోబరిస్టులతో[20] చిల్లర సొంత కీచులాటలు వున్నప్పటికీ యేది అంతకంతకూ వాళ్లకు దగ్గరగా జరుగుతూనే వుందో, యేది ఇటీవలి జాతీయ దురహంకార ఆందోళన

ద్వారా జాతీయ ఉదారవాదాన్ని నెలకొల్పడానికీ జారిజంనూ, ప్రగతి వ్యతిరేకతనూ బలపరచడానికి కృషిచేస్తున్నదో ఆ కాడెట్ పార్టీ[21] ప్రభావం నుండి బయటికి లాగడమూ. రాజరికాన్ని పూర్తిగా రద్దుచేయడానికీ, కార్మికవర్గమూ, విప్లవరైతాంగమూ రాజకీయాధికారం గెలుసుకోవడానికి పోరాటం గతంలో లాగే సాగుతుంది, అని తీర్మానం చెప్తున్నది.

గతంలో లాగే నిరంకుశత్వం కార్మికవర్గానికీ, సమస్త ప్రజాతంత్ర ధోరణులకూ ప్రధాన శత్రువు. కానీ అది మారకుండా అలాగే వుంటుందని అనుకోవడం పొరపాటు. స్టోలోపిన్ "రాజ్యాంగమూ," స్టోలోపిన్ భూ విధానమూ[22] పాత, అర్ధపితృస్వామిక, అర్ధ ఫ్యూడల్ జారిజం యొక్క విచ్ఛిత్తిలో ఒక నూతన దశనూ, అది బూర్జువా రాజరికంగా రూపాంతరం చెందడంపైపు ఒక కొత్త అడుగునూ సూచిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితి యొక్క యీ గుణవర్ణనను పూర్తిగా తొలిగించాలనీ, "బూర్జువా"కు బదులు "ధనస్వామ్య" అని పెట్టాలని కోరిన కాకసస్ ప్రతినిధులది తప్పు. నిరంకుశత్వం చాలా కాలంగా ధనస్వామ్యంగా వుంది; కానీ, విప్లవ ప్రథమ దశ తర్వాతనే, దాని దెబ్బల ప్రభావం వల్లనే, నిరంకుశత్వం తన వ్యవసాయ విధానంలోనూ, బూర్జువా వర్గంలోని కొన్ని పొరలతో జాతీయ స్థాయిలో యేర్పాటు చేయబడిన దాని ప్రత్యక్ష పొత్తులోనూ బూర్జువా అవుతున్నది. నిరంకుశత్వం చాలా కాలంగా బూర్జువావర్గాన్ని లాలిస్తున్నది. డబ్బు ద్వారా బూర్జువావర్గం చాలా కాలంగా "పైకి" దారిచేసుకుంటున్నది, శాసన నిర్మాణం మీదా, పరిపాలన మీదా పలుకుబడి సంపాయించు కుంటున్నది, ప్రభువర్గం పక్కన స్థానం సంపాయించుకుంటున్నది. కానీ, ప్రస్తుత పరిస్థితిలోని విశిష్ట లక్షణం యేమిటంటే, నిరంకుశత్వం బూర్జువావర్గంలోని కొన్ని పొరల కొరకు ఒక ప్రతినిధుల సభను నెలకొల్పడమూ, వాళ్లకూ, ఫ్యూడల్ భూస్వాములకూ మధ్య సమతూకం నెలకొల్పడమూ, ద్యూమ లోని యీ భాగాల మధ్య పొత్తు యేర్పరచడమూ చేయవలసి వచ్చింది; నిరంకుశత్వం రైతుయొక్క పితృస్వామికతత్వం మీద తాను పెట్టుకొని వుండిన ఆశలన్నిటినీ విసర్జించి, గ్రామీణ జనాలకు వ్యతిరేకంగా, గ్రామ సమిష్టి సంఘాన్ని నాశనం చేస్తున్న ధనిక రైతులలో అండదండలకొరకు ప్రయత్నం చేయవలసివచ్చింది.

నిరంకుశత్వం కుహనా రాజ్యాంగబద్ధ సంస్థల బురఖా వేసుకుంటున్నది; కానీ, అదే సమయంలో, పురిష్కేవిచ్‌లతోనూ, గుచ్‌కోవ్‌లతోనూ మాత్రమే, జారు పొత్తు పెట్టుకోవడం ద్వారా, నిరంకుశత్వం యొక్క వర్గ సారం యెప్పుడూ లేనంతగా బట్టబయలౌతున్నది. నిరంకుశత్వం వస్తుగతంగా అవసరమైన బూర్జువా విప్లవ కర్తవ్యాలను తానే నెరవేర్చడానికి ప్రయత్నిస్తున్నది– బూర్జువా సమాజపు వ్యవహారాలను నిజంగా నిర్వహించే ప్రజా ప్రతినిధుల సభను నెలకొల్పడమూ, గ్రామీణ ప్రాంతం నుండి మధ్యయుగపు, బీరకాయ పీచు లాంటి కాలం తీరిన భూ సంబంధాలను ప్రక్షాళనం చేయడమూ. కానీ, నిరంకుశత్వం తీసుకున్న యీ కొత్త చర్యల ఆచరణ గత ఫలితాలు యింతవరకు కచ్చితంగా శూన్యం; యీ చారిత్రక కర్తవ్య నిర్వహణకు యితర శక్తులూ, యితర మార్గాలూ అవసరమని మాత్రమే యిది యెప్పుడూ లేనంత స్పష్టంగా తెలుపుతున్నది. రాజకీయాలలో అనుభవంలేని లక్షలాది ప్రజల మనస్సుల్లో యింతవరకు నిరంకుశత్వానికీ దరహం మీద ప్రజా ప్రాతినిధ్యానికీ గల భేదం చూడబడేది. యిప్పుడు పోరాటం తన లక్ష్యాలను సంకుచితపరుస్తూ, ఆ ప్రజా ప్రాతినిధ్యం యొక్క స్వభావాన్నీ, ప్రాముఖ్యాన్నీ నిర్ణయించే రాజ్యాధికారం కొరకు పోరాటంగా తన కర్తవ్యాన్ని మరింత నిర్దిష్టంగా నిర్వచిస్తున్నది. అందువల్లనే మూడవ ద్యూమ పాత జారిజం యొక్క విచ్ఛిత్తిలోనూ, దాని దుందుడుకు స్వభావం తీవ్రతరం కావడంలోనూ, పాత విప్లవ లక్ష్యాలు పాతుకపోవడంలోనూ, యీ లక్ష్యాలకొరకు జరిగే పోరాట రంగం (పోరాటంలో పాల్గొనేవాళ్ల సంఖ్యా) విస్తృతం కావడంలోనూ ఒక ప్రత్యేక దశను సూచిస్తున్నది.

యీ దశను మనం దాటాలి. ప్రస్తుతం నూతన పరిస్థితులకు నూతన పోరాట రూపాలు కావాలి. ద్యూమ వేదికను ఉపయోగించుకోవడం పరమ అవసరం. కార్మికవర్గ జనాలను చైతన్యవంతులను చేసి, వాళ్ళను సంఘటితం చేయడానికీ దీర్ఘ కృషి మరీ ముఖ్యమౌతున్నది. రహస్య నిర్మాణాన్నీ, చట్టబద్ధ నిర్మాణాన్నీ కలపడం పార్టీ ముందు ప్రత్యేక సమస్యలను లేవనెత్తుతున్నది. విప్లవానుభవాన్ని ప్రజలకు తెలియజేయడమూ, వివరించడమూ– ఉదారవాదులూ, రద్దువాద మేధావులూ వేటిని అపఖ్యాతి పాలుచేయడానికి ప్రయత్నిస్తున్నారో అవి– సిద్ధాంత, ఆచరణాత్మక ప్రయోజనాలకు అవసరం. కానీ, పార్టీయొక్క యెత్తుగడల పంథా– పోరాట పద్ధతులలోనూ, మార్గాలలోనూ, కొత్త పరిస్థితులను లెక్కలోకి తీసుకోగలిగివుండవలసిన పంథా–మారదు. విప్లవ సోషల్ డెమోక్రటిక్ యెత్తుగడలు సరైనవని 1905–07 సామూహిక పోరాట అనుభవం ధ్రువపరుస్తున్నదని ఒక కాన్ఫరెన్సు తీర్మానం తెలుపుతున్నది. యీ మొదటి ఉద్యమం ఫలితంగా యేర్పడిన విప్లవ పరాజయం వెల్లడించిందేమిటంటే, కర్తవ్యాలు తప్పు అని కాదు, తక్షణ లక్ష్యాలు "ఊహాజనితమైన"వని కాదు; అది వెల్లడించిందేమిటంటే, శక్తులు తగినంతగా సన్నద్ధం కాలేదని, విప్లవ సంక్షోభం తగినంతగా విస్తృతంగా లోతుగా లేదని, స్టోలోపిన్ వగైరాలు దానిని విస్తృతమూ, లోతు చేయడానికి ప్రశంసనీయమైన దీక్షతో కృషిచేస్తున్నారు! ఉదారవాదులూ, భయకంపిత మేధావులూ స్వేచ్ఛకొరకు జరిగిన మొదటి నిజమైన ప్రజా పోరాటం తర్వాత ధైర్యం కోల్పోదురుగాక, వాళ్లు పిరికిపందల్లాగ యిలా పునశ్చరణ చేయుదురు గాక; యింతకుముందు ఓడిపోయిన చోటికి పోవద్దు, ఆ మరణాంతక మార్గంలో మళ్లీ అడుగుపెట్టవద్దు. వర్గ చైతన్యంగల కార్మికవర్గం వాళ్ళకు యిలా జవాబు చెప్తుంది. చరిత్రలోని మహా యుద్ధాలు, విప్లవాల మహా సమస్యలు, పురోగామి వర్గాలు మళ్లీమళ్లీ దాడిచేయడానికి ముందుకు రావడం ద్వారానే పరిష్కరింపబడినాయి–పరాజయ గుణపాఠాలు నేర్చుకున్న తర్వాత ఆ వర్గాలు విజయం సాధించినాయి. ఓడిపోయిన సైన్యాలు బాగా నేర్చుకుంటాయి. రష్యా విప్లవ వర్గాలు తమ మొదటి దాడిలో ఓడిపోయినాయి, కానీ విప్లవ పరిస్థితి అలాగే వుంది. కొత్త రూపాలలో, యితర మార్గాలలో, విప్లవ సంక్షోభం సమీపిస్తున్నది. మళ్లీ

మొనదేలుతున్నది. కొన్ని సందర్భాలలో మనం ఊహించిన దానికంటే మందకొడిగా సమీపిస్తున్నది. మరింత విస్తారమైన జనాలను ఆ సంక్షోభానికి సన్నద్ధం చేసే దీర్ఘ కృషిని మనం సాగించాలి. యీ సన్నాహక కృషి మరింత నిష్ఠగా జరగాలి, మరింత ఉన్నతమైన, నిర్దిష్టమైన కర్తవ్యాలను లెక్కలోకి తీసుకోవాలి; యీ పనిని మనం యెంత సమర్థవంతంగా చేస్తే, అంత నిశ్చయంగా వుంటుంది. కొత్త పోరాటంలో మన విజయం 1905లో తన నాయకత్వం కింద ఒక బానిసల జాతి మొదటి సారి జారిజం మీద దెబ్బతీసే లక్షోపలక్షల దండు, విప్లవ సైన్యం, అయినందుకు రష్యన్ కార్మికవర్గ గర్వపడగలదు. ఈ కార్మికవర్గమే యింకా శక్తివంతమైన విప్లవ సైన్యంయొక్క కొత్త సైనికులను చైతన్యవంతులను చేసే శిక్షణ యిచ్చే పనిని పట్టువిడువకుండా, దీక్షగా, ఓపికగా చేయడం తెలుసుకుంటుంది.

యింతకు ముందు చెప్పినట్లు, చైతన్యవంతులను చేసి, శిక్షణ యిచ్చే యీ పనిలో డ్యూమ వేదికను ఉపయోగించుకోవడం ఒక ముఖ్యమైన అంశం. డ్యూమ బృందంమీద కాన్ఫరెన్సు తీర్మానం మన పార్టీకి (చరిత్రనుండి ఉదాహరణలు తీసుకోవాలంటే) సోషలిస్టు వ్యతిరేక చట్టం[23] కాలంలో జర్మన్ సోషల్ డెమోక్రట్ల అనుభవానికి అతి దగ్గరగా వుండే దారిని సూచిస్తుంది. చట్టబద్ధమైన డ్యూమ బృందాన్ని యెలా ఉపయోగించుకోవలసింది రహస్య పార్టీ తెలుసుకోవాలి, నేర్చుకోవాలి; తన కర్తవ్యాలకు సరితూగే పార్టీ సంఘంగా దానిని పార్టీ తర్ఫీదు చేయాలి. ప్రస్తుత దశలోని పరిస్థితులలో అత్యంత పొరపాటు యెత్తుగడా, స్థిరమైన కార్మికవర్గ కృషినుండి అత్యంత శోచనీయంగా వైదొలగడమూ యేదంటే డ్యూమ నుండి మన బృందాన్ని ఉపసంహరించడమనే సమస్యను లేవనెత్తడం (కాన్ఫరెన్సులో యిద్దరు ఒత్జోవిస్తులు"[24] వుండినారు, కానీ వాళ్లు యీ సమస్యను బహిరంగంగా లేవనెత్తలేదు,) లేదా (కాన్ఫరెన్సులో కొందరు ప్రతినిధులు పట్టుబట్టినట్లు) డ్యూమ బృందం పొరపాట్లను సూటిగా, బహిరంగంగా విమర్శించకుండానూ, వాటిని తీర్మానంలో పేర్కొనకుండానూ వుండడం. యే పొరపాట్లకు తాను మాత్రమే బాధ్యురాలు కాదో, యేవి మన పార్టీ శాఖలన్నిటియొక్క పొరపాట్లలాగే వుండినాయో, ఆ పొరపాట్లను బృందం చేసిందని తీర్మానం పూర్తిగా గుర్తిస్తున్నది. కానీ, యితర పొరపాట్లు వున్నాయి– పార్టీ యొక్క రాజకీయ పంథా నుండి వ్యతిక్రమణలు. ఈ వ్యతిక్రమణలు జరిగినాయి గనుక, మొత్తం పార్టీ తరపున బహిరంగంగా వ్యవహరించే సంఘం ద్వారా యివి జరిగినాయి. గనుక, యివి పెడదారులని పార్టీ స్పష్టంగా, నిశ్చితంగా ప్రకటించక తప్పలేదు. పశ్చిమ యూరోపియన్ సోషలిస్టు పార్టీల చరిత్రలో, పార్లమెంటరీ బృందాలకూ, పార్టీకీ మధ్య విపరీత సంబంధాలు ఉండిన ఉదాహరణలు అనేకం ఉన్నాయి. ఈనాటికి లాటిన్ దేశాలలో ఈ సంబంధాలు తరుచుగా, విపరీతంగా ఉన్నాయి; అక్కడ బృందాలు తగినంత పార్టీతత్వం ప్రదర్శించవు. మనం రష్యాలో మొట్ట మొదటినుండే పార్లమెంటరిజంను మరొక ప్రాతిపదికమీద యేర్పాటుచేయాలి; యీ రంగంలో మనం వెంటనే సమిష్టి కృషిని నెలకొల్పాలి– పార్టీ తన వెనుక వుందనీ, దానికి తన పొరపాట్ల పట్ల గాఢమైన ఆదుర్దా వుందనీ తన మార్గాన్ని చక్కదిద్దడానికి అది ప్రయత్నిస్తుందనీ ప్రతి సోషల్ డెమోక్రటిక్ ప్రతినిధి నిజంగా అనుకునేటట్లు– ప్రతి పార్టీ కార్యకర్త డ్యూమ బృందం మీద చేసే ఆచరణాత్మక మార్క్సిస్టు విమర్శ ద్వారా నేర్చుకుంటూ, దానికి తోడ్పడడం తన విధి అని అనుకుంటూ, బృందం యొక్క ప్రత్యేకమైన పనిని పార్టీయొక్క మొత్తం ప్రచారాందోళన కార్యకలాపాలకు అనుగుణంగా మలచడానికి కృషిచేస్తూ, పార్టీయొక్క సాధారణ డ్యూమ పనిలో పాల్గొనేటట్లు.

యీ కాన్ఫరెన్సు మొత్తం సెషన్‌లో డ్యూమలోని సోషల్ డెమోక్రటిక్ బృందం పనిని చర్చించడానికి అత్యంత పెద్ద పార్టీ శాఖల ప్రతినిధుల మొదటి అధికారిక సమావేశం అయింది. మన పార్టీ తన డ్యూమ పనిని యెలా ఏర్పాటుచేయబోయేదీ, యీ రంగంలో యిది పార్టీకీ, బృందానికీ యెంత కఠినంగా వుండబోయేదీ, నిజమైన సోషల్ డెమోక్రటిక్ పార్లమెంటరిజంను అభివృద్ధిచేయడానికి మన పార్టీ యెలా దారి తొలగకుండా, స్థిరంగా కృషిచేయదలచుకున్నదీ కాన్ఫరెన్సు తీర్మానం తెలుపుతున్నది.

డ్యూమ బృందంపట్ల మన వైఖరికి సంబంధించిన సమస్యలో యెత్తుగడల పార్శ్వమూ, నిర్మాణపరమైన పార్శ్వమూ వున్నాయి. రెండవ పార్శ్వంలో డ్యూమ బృందపు తీర్మానం మన సాధారణ నిర్మాణపర సూత్రాలను–నిర్మాణపర సమస్యమీద సూచనలు యిచ్చే తీర్మానంలో కాన్ఫరెన్సు రూపొందించిన సూత్రాలను–ఒక ప్రత్యేక సందర్భానికి వర్తింపజేయడం మాత్రమే యీ సమస్యమీద రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలో రెండు ప్రధాన ధోరణులు వున్నాయని కాన్ఫరెన్సు నమోదుచేసింది. అందులో ఒకటి రహస్య సంఘాలకు ప్రాముఖ్యం యిస్తుంది; మరొకటి "రద్దువాదానికి" దాదాపు సమానమైనట్టిది, చట్టబద్ధ, అర్ధచట్టబద్ధ సంఘాలకు ప్రాముఖ్యం యిస్తుంది. విషయమేమంటే, నేను యింతకు ముందే చెప్పినట్లు, కొంత మంది పార్టీ కార్యకర్తలు, ముఖ్యంగా మేధావులు, కానీ కొందరు కార్మికులు కూడా, పార్టీని వదలిపెట్టడం ప్రస్తుత పరిస్థితి యొక్క విశిష్ట లక్షణంగా వుంది. అత్యుత్తములూ, అత్యంత చురుకైనవాళ్లూ పార్టీని విసర్జించి, చట్టబద్ధ సంఘాలను యెన్నుకుంటున్నారా, లేక "ఊగిసలాడే మేధావి, పెటీ బూర్జువా అంశాలు" పార్టీని వదలిపెడుతున్నాయా అనే ప్రశ్నలు "రద్దువాద" ధోరణి లేవనెత్తుతున్నది. కంఠోక్తిగా "రద్దువాదాన్ని" నిరాకరించి ఖండించడం ద్వారా కాన్ఫరెన్సు యీ రెండవ అంశాలే పార్టీని వదలిపెడుతున్నాయని సమాధానం చెప్పిందని చెప్పనక్కరలేదు. పార్టీలోని అత్యంత నిరాస్తిపరులూ, సూత్రాలలో అత్యంత స్థిరంగా, అత్యంత సోషల్ డెమోక్రటిక్‌గా వుండిన మేధావులూ రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీకి విధేయంగా నిలిచినారు పార్టీని విసర్జించడ మంటే పార్టీ శుద్ధికావడమన్న మాట, పార్టీ తనలోని తక్కువ స్థిరమైన వాళ్లనూ, అవిశ్వసనీయ మిత్రులనూ, సహ ప్రయాణికులనూ తొలిగించుకోవడమన్న మాట; యీ సహ ప్రయాణికులు యెప్పుడు కొంతకాలంపాటు కార్మిక వర్గంలో చేరుతారు, వీళ్లు పెటీ బూర్జువా

వర్గం నుండి గానీ, "వర్గ రహితుల" నుండి, అనగా యేదో ఒక నిర్దిష్ట వర్గపు కక్ష్యనుండి నెట్టి వెయ్యబడినవాళ్ల నుండి గానీ చేర్చుకోబడినవాళు ్లు.

పార్టీ నిర్మాణపర సూత్రపు యీ అంచనా నుండి తర్కబద్ధంగా యేర్పడుతుంది కాన్ఫరెన్సు ఆమోదించిన నిర్మాణపర విధానపు పంథా. రహస్య పార్టీని పటిష్టపరచడమూ, అన్ని పని రంగాలలోనూ పార్టీ శాఖలను సృష్టించడమూ, "ప్రతి పారిశ్రామిక సంస్థలోనూ కార్మికులు మాత్రమే గల పార్టీ కమిటీలను, వాళ్ల సంఖ్య తక్కువగా వున్నా సరే" మొట్టమొదట నెలకొల్పడమూ, నాయకత్వపు కర్తవ్యాలను కార్మికుల నుండే వచ్చిన సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ నాయకుల చేతుల్లో సాంద్రీకరించడమూ–యిది యీనాటి కర్తవ్యం. యీ శాఖల, కమిటీల కర్తవ్యం అర్థచట్టబద్ధ సంఘాలన్నింటినీ, వీలైనంతవరకు చట్టబద్ధ సంఘాలనూ వినియోగించుకోవడంగానూ, "జనాలతో సన్నిహిత సంబంధం" పెట్టుకోవడంగానూ, జనాల అవసరాల కన్నిటికీ సోషల్ డెమోక్రసీ ప్రతిస్పందించేటట్లు పనిని నడిపించడంగానూ వుండాలని చెప్పనక్కరలేదు. ప్రతి పార్టీ శాఖా, ప్రతి కార్మికుల కమిటీ "జనాలలో ఆందోళనకూ, ప్రచారానికీ ఆచరణగతమైన సంఘటిత పనికీ కేంద్రం" కావాలి; అనగా, అవి జనాలు యెక్కడుంటే అక్కడికి పోవాలి, అడుగడుగునా జనాల చైతన్యాన్ని సోషలిజం దిశలో ముందుకు తోయడానికీ, ప్రతి నిర్దిష్ట సమస్యనూ కార్మిక వర్గపు సాధారణ కర్తవ్యాలతో లంకెవేయడానికీ, ప్రతి నిర్మాణపర చర్యనూ వర్గ దృఢీకరణ చర్యగా మార్చడానికీ, చురుకుదనం ద్వారా, సిద్ధాంత ప్రభావం ద్వారా (పదవుల ద్వారా, హోదాల ద్వారా కాదని చెప్పనక్కరలేదు.) కార్మిక వర్గ చట్టబద్ధ సంఘాలన్నిటిలోనూ అగ్రస్థానం సంపాయించడానికీ ప్రయత్నించాలి. యీ శాఖలూ, కమిటీలూ ఒకోసారి చాలా చిన్నవైనా, అవి పార్టీ సంప్రదాయంచేతా, పార్టీ నిర్మాణం చేతా, ఒక నిర్దిష్ట వర్గ కార్యక్రమం చేతా ఒకటిగా లంకించబడతాయి; యీ విధంగా పార్టీలోని యిద్దరు ముగ్గురు సోషల్ డెమోక్రటిక్ సభ్యులు రూపంలేని చట్టబద్ధ సంఘంలో మునిగిపోకుండా వుండగలిగి, అన్ని పరిస్థితులలోనూ, అన్ని రకాల సన్నివేశాలలోనూ తమ పార్టీ పంథాను అనుసరించ గలిగి, పరిసరాలు తమను దిగమింగనీయకుండా పరిసరాలను తాము మొత్తం పార్టీతత్వంలో ప్రభావితం చేయగలిగివుంటారు.

యేదో ఒక రకం ప్రజా సంఘాలు రద్దుచేయబడవచ్చు గాక, చట్టబద్ధ ట్రేడ్ యూనియన్లను వేధించవచ్చు గాక, విప్లవ ప్రతీఘాత వ్యవస్థలో కార్మికుల చొరవగల ప్రతి బహిరంగ చర్యనూ పోలీసులు యేదో ఒక సాకుతో ధ్వంసం చేయవచ్చు గాక, కానీ రష్యా యిప్పటికే అయిన మాదిరి పెట్టుబడిదారీ దేశంలో కార్మిక జనాల సమీకరణను యే శక్తి నివారించలేదు. యేదో ఒక విధంగా, చట్టబద్ధంగానో, అర్థ చట్టబద్ధంగానో, బహిరంగంగానో, ప్రచ్ఛన్నంగానో కార్మికవర్గం తన సొంత సమీకరణ కేంద్రాలు కనుక్కుంటుంది. పార్టీలోని వర్గ చైతన్యపూరిత సోషల్ డెమోక్రట్లు సర్వదా, సర్వత్రా జనాల ముందర నడుస్తారు, సర్వదా, సర్వత్రా జనాలను పార్టీ తత్వంలో ప్రభావితం చేయడానికి సమైక్యంగా కృషి చేస్తారు. తాను వర్గ పార్టీనని బహిరంగ విప్లవంలో రుజువుచేసుకున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీ, సమ్మెలోనూ, 1905 తిరుగుబాటులోనూ, 1906–1907 ఎన్నికలలోనూ లక్షోపలక్షల మందిని నడిపించడంలో కృతకృత్యురాలైన పార్టీ, యిప్పుడు కూడా వర్గ పార్టీగా, జనాల పార్టీగా, అగ్రదళంగా వుంటుంది; అత్యంత కష్ట సమయాల్లో కూడా సైన్యంలోని అధిక భాగంతో సంపర్కం కోల్పోకుండా, యీ కష్ట సమయాలను అధిగమించడానికీ తన శ్రేణులను మళ్లీ సంఘటితపరచుకోవడానికీ, అధికాధికంగా కొత్త యోధులను తర్ఫీదు చేయడానికీ సైన్యానికి తోడ్పడగలిగి వుంటుంది.

కరుడుగట్టిన నల్ల నూర్లవాళ్లు డ్యూమ లోపలా, బయటా, రాజధానిలోనూ, సుదూరపు రాష్ట్రాలలోనూ సంతోషంతో పొలికేకలు వేయనీ, ప్రగతి వ్యతిరేకత తాండవించనీ– ఒరగడ్డంగా వున్న నిరంకుశత్వాన్ని దాని పతనం దగ్గరికి తీసుకురాకుండా, రాజకీయ అస్తవ్యస్తాల, అసంబద్ధాల కొత్త చిక్కు సృష్టించకుండా, కార్మికవర్గ శ్రేణులకూ, రైతు జనాలలోని విప్లవ శక్తుల శ్రేణులకూ కొత్త, తాజా శక్తులను కలపకుండా నిత్యం వివేకంతుడైన స్టోలోపిన్ ఒక్క చర్య కూడా తీసుకోలేదు. జనాల సంపర్కంతో పట్టువిడవని పని చేయడానికి తన్ను తాను దృఢపరుచుకోవడంలో విజయం పొందే పార్టీ, పురోగామి వర్గం యొక్క పార్టీ, తన అగ్రదళాన్ని సంఘటితపరుకుకోవడంలో విజయం పొందే పార్టీ, కార్మిక వర్గంలోని ప్రతి జీవ లక్షణాన్నీ సోషల్ డెమోక్రటిక్ తత్వంలో ప్రభావితం చేసేటట్లుగా తన శక్తులను నడిపించే పార్టీ– యేమి జరిగినా సరే అలాంటి పార్టీ గెలుస్తుంది.

"సోత్సియాల్ డెమోక్రట్," సంచిక 2,
జనవరి 28 (ఫిబ్రవరి 10), 1909

**వివరణలు**

14. 1908 మధ్యలో ఏర్పడిన మెన్షివిక్కులలో దక్షిణ పక్షానికి ఇది ప్రస్తావన. దాని అనుచరులు రహస్య విప్లవ పార్టీని రద్దు చెయ్యాలని వాదించారు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. విప్లవాత్మక కార్యక్రమాన్ని పరిత్యజించారు, బహిరంగ సంస్కరణవాద పార్టీని స్థాపించాలని ప్రతిపాదించారు.

15. 1908 డిసెంబరులో పారిస్‌లో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. ఐదవ అఖిల రష్యా కాన్ఫరెన్సుని గురించి లెనిన్ ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. ఆ కాన్ఫరెన్సు రష్యాలో అప్పట్లో వున్న పరిస్థితిని ప్రగాఢంగా విశ్లేషించి, అభివృద్ధి నిరోధక దశలో పార్టీ ఎత్తుగడలను రూపొందించింది.

ఆనాటి రాజకీయ పరిస్థితిమీదా, పార్టీ కర్తవ్యాల మీదా ఆ కాన్ఫరెన్సు ఆమోదంచిన తీర్మానం దేశపు రాజకీయ, ఆర్థిక పరిస్థితిని గురించి సమగ్రంగా అంచనా వేసింది. ఆ తీర్మానం నిరంకుశ రాజరికం బూర్జువా రాజరికంగా పరిణామం చెందడాన్నీ, వర్తక, పారిశ్రామిక బూర్జువావర్గపు పై పొరపాట్ల నిరంకుశ రాజరికపు సౌహార్దాన్నీ, రైతాంగపు పై పొరతో పొత్తు పెట్టుకోవాలన్న నిరంకుశ రాజరికపు వాంఛనా, మెన్షివిక్కులలో

రద్దువాద ధోరణి పెరుగుదలనూ కూడా ప్రతిబింబించింది. ఆ తీర్మానం నూతన విప్లవపు భావి రూపాన్నీ, నూతన విప్లవ వెల్లువ అనివార్యతనూ సుస్పష్టంగా చిత్రించింది.

లెనిన్ ప్రతిపాదించిన ఆ కాన్ఫరెన్సు రద్దువాదాన్ని ఖండించి, పార్టీకి ప్రతికూలమైన ఈ ధోరణిమీద అవిరామ పోరాటం జరపవలసిందిగా అన్ని పార్టీ శాఖలకూ విజ్ఞప్తి చేసింది. ఈ కాన్ఫరెన్సులో మెన్షివిక్ రద్దు వాదుల మీద బోల్షివిక్కులు ఒక ప్రధాన విజయాన్ని సాధించారు.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. ఐదవ కాన్ఫరెన్సు రష్యన్ కార్మికోద్యమ అభివృద్ధిలో ఒక మూలమలుపు. కార్మికవర్గపు విప్లవకర శక్తుల్ని బోల్షివిక్ కేంద్రం చుట్టూ సమీకరించేందుకు ఇది పునాది వేసింది.

16. 1903లో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో ముందుకు తేబడి, పార్టీ కార్యక్రమంలో చేర్చబడిన ప్రజాతంత్ర రిపబ్లిక్, భూస్వాముల భూముల జప్తు, 8గంటల పని రోజు అనే విప్లవాత్మక డిమాండ్లు "తగ్గించబడని" నినాదాలని పిలవబడ్డాయి.

అభివృద్ధి నిరోధక పరిస్థితుల్లో మెన్షివిక్కులు పార్టీ కార్యక్రమంలోని విప్లవాత్మక డిమాండ్లనూ, నినాదాలనూ పరిత్యజించి, తక్షణ కార్యక్రమం నుంచి విప్లవ సమస్యని వదిలేసి రాజ్యాంగ చట్టపరమైన శకం అనబడేది వచ్చిందని ప్రకటించారు.

17. మూడవ స్టేట్ డ్యూమ (1907–1912) 1907 జూన్ 3 నాటి కొత్త అభివృద్ధి నిరోధక ఎన్నికల చట్టపు ప్రాతిపదికమీద ఎన్నుకోబడింది. ఈ చట్టం కార్మికుల, రైతుల హక్కుల్నీ, పట్టణవాసపు పెటీ బూర్జువా వర్గపు హక్కుల్నీ మరింతగా కుంటుపరిచి, భూస్వాముల, బడా పెట్టుబడిదారుల పూర్తి ప్రాబల్యాన్ని స్థిరపరిచింది. మూడవ స్టేట్ డ్యూమ పోలీసులకీ, రాజకీయ పోలీసులకీ, కోర్టులకీ, జైళ్లకీ పుష్కలంగా డబ్బు కేటాయించడం ద్వారా జూన్ 3 అభివృద్ధి నిరోధక పాలనను, దేశ, విదేశాంగ విధానపు అన్ని సమస్యలపైనా పూర్తిగా బలపరిచింది.

డ్యూమ వేదికను వినియోగించుకునేందుకుగాను, డ్యూమకి జరిగిన ఎన్నికల్లో బోల్షివిక్కులు పాల్గొన్నారు. నలుగురు ప్రతినిధుల్ని ఎన్నికచేయించుకోవడంలో వాళ్ళు సఫలురయ్యారు. మొత్తం మీద డ్యూమకి ఎన్నుకోబడిన 19మంది సోషల్ డెమోక్రట్లూ తమ సొంత గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. ఆ గ్రూపులోపల బోల్షివిక్కులకీ మెన్షివిక్కులకీ మధ్య తీవ్రమైన పోరాటం సాగింది. తమ మెజారిటీని వినియోగించుకొని మెన్షివిక్కులు పార్టీ పంథాని వక్రీకరించి, పార్టీ నాయక సంస్థలు ఆమోదించిన సోషల్ డెమోక్రటిక్ గ్రూపు కార్యకలాపాల్లో, ప్రత్యేకించి మొదట్లో, చాలా పొరపాట్లు జరిగాయి. అత్యంత పురోగామి కార్మికుల తీవ్ర విమర్శకు గురయ్యాయి.

18. మూడవ స్టేట్ డ్యూమలో భూస్వాముల, బడా బూర్జువావర్గ ప్రతినిధులూ, విప్లవోద్యమాన్ని ప్రతిఘటించేందుకు ఏర్పాటు చెయ్యబడిన సామూహిక హత్యాకాండల్లో నిమగ్నులైన రాజరిక సంఘాల ప్రతినిధులూ ("నల్ల నూర్లవాళ్ళు") ప్రాబల్యం వహించారు. అందుకే లెనిన్ మూడవ స్టేట్ డ్యూమని "నల్ల నూర్ల" లేక "నల్ల" డ్యూమ అని పిలుస్తుండేవాడు.

19. మొదటి డ్యూమాలోని రైతు ప్రతినిధుల్లో నుండి 1906 ఏప్రిల్లో త్రుదోవిక్ గ్రూపు ఏర్పడింది. డ్యూమలో వాళ్ళొక నిర్దిష్టమైన పంథా అంటూ ఏది అనుసరించలేదు, తమదంటూ రాజకీయ వేదిక ఏది వాళ్ళకి లేదు. కాగా, వాళ్ళు సోషల్ డెమోక్రట్లకీ, బడా బూర్జువావర్గ పార్టీలకీ మధ్య ఊగిసలాడారు. సన్నకారు సొంతదారుల రైతుల వర్గ స్వభావం మూలంగానే ఈ ఊగిసలాటలు నిర్ధారింపబడ్డాయి. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం "త్రుదోవిక్కులు" విప్లవ ప్రతిఘాతం పక్షాన చేరారు.

20. అక్టోబరిస్టులు–రష్యాలో 1905–17 దశలో ఏర్పాటు చెయ్యబడిన "అక్టోబరు పదిహేడు సంఘం" అనే పార్టీ సభ్యులు. బడా భూస్వాములు, వర్తక, పారిశ్రామిక బూర్జువావర్గంతో కూడిన పార్టీ ఇది. పౌర స్వేచ్ఛలనూ, శాసన నిర్మాణ డ్యూమనీ ప్రకటించిన 1905 అక్టోబరు 17వ తేదీ నాటి ప్రణాళిక ద్వారా దానికి ఆ పేరు వచ్చింది. వాస్తవానికి విప్లవ పోరాటం నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు ఉద్దేశింపబడిన ఒక ఎత్తుగడ అయిన ఆ ప్రణాళిక అక్టోబరిస్టుల రాజకీయ ఆకాంక్షలను సంతృప్తిపరిచింది. జారిస్టు ప్రభుత్వపు అభివృద్ధి నిరోధక విధానాన్ని అక్టోబరిస్టులు పూర్తిగా బలపరిచారు. ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం తర్వాత అక్టోబరిస్టులు పాలకపార్టీ అయి, రష్యాలో తలెత్తుతున్న సోషలిస్టు విప్లవానికి వ్యతిరేకంగా చురుగ్గా పోరాడారు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం తమ యావత్ శక్తి యుక్తులనూ వినియోగించి, సోవియట్ అధికారానికి వ్యతిరేకంగా పోరాడారు.

21. కాన్‌స్టిట్యూషన్ డెమోక్రటిక్ పార్టీ (కాడెట్లు)–రష్యన్ ఉదారవాద రాజరికవాద బూర్జువావర్గపు ప్రముఖ పార్టీ. అది 1905 అక్టోబరులో నెలకొల్పబడింది. బూర్జువా వర్గపు, భూస్వాముల, బూర్జువా మేధావుల ప్రతినిధులతో కూడివున్న పార్టీ అది. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో కాడెట్లు జారిస్టు ప్రభుత్వం అనుసరించిన కొల్లదారి విదేశాంగ విధానాన్ని బలపరిచారు. ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవ కాలంలో రాజరికాన్ని కాపాడేందుకు ప్రయత్నించారు. బూర్జువా తాత్కాలిక ప్రభుత్వంలో ప్రముఖ పదవులను వహించిన కాడెట్లు ప్రజావ్యతిరేక, విప్లవ ప్రతిఘాత విధానాన్ని అనుసరించారు. అక్టోబరు సోషలిస్టు మహా విప్లవ విజయానంతరం కాడెట్లు సోవియట్ అధికారానికి వ్యతిరేకంగా క్రియాశీలమైన పోరాటం జరిపారు.

22. స్టోలోపిన్ వ్యవసాయ సంస్కరణని లెనిన్ ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. రష్యాలో రైతుల భూమి స్వాధీనానుభవ వ్యవస్థకి సంబంధించిన ఈ బూర్జువా సంస్కరణకి మంత్రి పి.ఎ. స్టోలోపిన్ పేరు వచ్చింది. భూస్వామ్య ఎస్టేట్లను అలాగే వుంచి చిల్లరమల్లర భూ

కమతాలను రద్దు చెయ్యడం, గ్రామంలో శ్రేణీకరణను త్వరితపరిచి, కులాక్కుల (ధనిక రైతుల) రూపంలో నిరంకుశ రాజరికానికి అదనపు ప్రధానాధారాన్ని కల్పించడమే ఈ సంస్కరణ లక్ష్యం. స్టోలోపిన్ వ్యవసాయ సంస్కరణ రైతు జన సామాన్యపు ఇతోధిక ఆర్థిక వినాశానికీ, కులక్కులకీ గ్రామీణ పేదలకీ మధ్య వర్గ వైరుధ్యాలు తీవ్రతరమయ్యేందుకు దారితీసింది.

23. సోషలిస్టు వ్యతిరేక చట్టం-1878లో జర్మనీలో బిస్మార్క్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టం కార్మికవర్గాన్నీ, సోషలిస్టు ఉద్యమాన్నీ దెబ్బతీసేందుకు ఉద్దేశింపబడింది. ఈ చట్టం మేరకు సోషల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన అన్ని సంఘాలూ, అన్ని కార్మిక సంఘాలూ, కార్మికవర్గపు అన్ని పత్రికలూ నిషేధింపబడ్డాయి. సోషలిస్టు సాహిత్యం జప్తు చెయ్యబడింది, సోషల్ డెమోక్రట్లు హింసింపబడి, దేశంనుంచి వెళ్ళగొట్టబడ్డారు. కానైతే, ఈ నిర్బంధాలు సోషల్ డెమోక్రటిక్ పార్టీని విచ్ఛిన్నం చెయ్యలేకపోయాయి. ఆ పార్టీ రహస్య పరిస్థితుల్లో తన కార్యకలాపాలను పునర్నిర్మించుకోగలిగింది. అదే సమయంలో, జనబాహుళ్యంతోటి తన సంబంధాలను సుదృఢం చేసుకునేందుకుగాను చట్టబద్ధమైన అవకాశాలను విస్తృతంగా వినియోగించుకుంది. దాని పలుకుబడి నిరంతరాయంగా పెరుగుతూవచ్చింది. 1878-90 దశలో జర్మన్ పార్లమెంటు (రైహ్‌స్టాగ్) కి జరిగిన ఎన్నికల్లో సోషల్ డెమోక్రట్లకి వచ్చిన ఓట్ల సంఖ్య మూడు రెట్లకి పైగా పెరిగింది. మార్క్స్, ఎంగెల్సులు జర్మన్ సోషల్ డెమోక్రట్లకి విశేషమైన తోడ్పాటు ఇచ్చారు. నానాటికి పెంపొందుతున్న సామూహిక కార్మికోద్యమపు ఒత్తిడి మూలంగా సోషలిస్టులకి వ్యతిరేకంగా ఈ చట్టం 1890లో రద్దు చెయ్యబడింది.

24, "ఒత్జొవీస్టులు"-1908లో బోల్షివిక్కుల్లో తలెత్తిన ఒక అవకాశవాద గ్రూపు. విప్లవాత్మక పదాల మాటున మూడవ స్టేట్ డ్యూమా నుంచి సోషల్ డెమోక్రటిక్ ప్రతినిధులను ఉపసంహరించాలనీ, చట్టబద్ధమైన సంఘాల్లో కార్యకలాపాలకు స్వస్తి చెప్పాలనీ డిమాండ్ చేశారు. అభివృద్ధి నిరోధక పరిస్థితుల్లో పార్టీ రహస్య కార్యకలాపాలు మాత్రమే జరపాలన్న అభిప్రాయంతో, డ్యూమాలోనూ, కార్మికుల వృత్తి సంఘాల్లోనూ, సహకార సంఘాల్లోనూ, తదితర చట్టబద్ధ, అర్ధ చట్టబద్ధ ప్రజా సంఘాల్లోనూ పాల్గొనేందుకు ఒత్జొవీస్టులు నిరాకరించారు.

★

**(16వ పేజీ తరువాయి)**

5. పార్టీ తన విజయాలతో కొట్టుకొనిపోతే, అహంభావాన్ని పెంపొందించుకుంటే, తమ పనిలో లోపాలను గుర్తించకపోతే, తప్పులను అంగీకరించడానికి భయపడితే, సకాలంలో ఆ తప్పులను చిత్తశుద్ధితో, కపటములేని తనంతో సరిచేసుకోకపోతే, కార్మికవర్గ నాయకురాలుగా తమ పాత్రను నిర్వహించలేదు. తన వర్గం పట్ల, శ్రామిక ప్రజాసామాన్యం పట్ల మనస్ఫూర్వకంగా పార్టీ తన బాధ్యతను ఆచరణలో నిర్వహిస్తుందా? అని లెనిన్ ప్రశ్నిస్తూ తప్పులను నిష్పపటంగా అంగీకరించడం, సరిదిద్దడానికి మార్గాలను క్షణ్ణంగా చర్చించడం, బాధ్యత గల పార్టీకి విశిష్ట లక్షణం అన్నాడు. 6. పార్టీకి ప్రజా సామాన్యంతో విశాలమైన సంబంధాలు లేకపోయినట్లయితే, బలపరచుకోనట్లయితే, శ్రద్ధగా నేర్చుకోకపోయినట్లయితే, సంకుచితమైన పరిధిలో ముడుచుకుపోతే పార్టీ నాశనం అయిపోతుంది. ప్రాచీన గ్రీకు పురాణ గాథల్లో ఆంటియస్ అనే వీరుడు భూమిని అంటిపెట్టుకొని ఉన్నంతకాలం విజయుడే. హెరిక్యులస్ ఆంటియస్‌ను భూమి నుండి పైకెత్తి గాలిలో నిలబెట్టి గొంతు పిసికి చంపాడు. కమ్యూనిస్టు పార్టీ కూడా ప్రజలు అనే భూమిని వదిలితే నాశనం కాక తప్పదు అని హెచ్చరిస్తుంది గ్రీక్ గాథ అని స్టాలిన్ అన్నాడు.

ప్రస్తుత పరిస్థితుల్లో రష్యా చరిత్రను అధ్యయనం చేసి మన పరిస్థితులకు అన్వయించుకుందాము. విప్లవ ప్రతీఘాతక శత్రు దాడి మన ముందు కీలకమైన సవాలును ముందుకు తెచ్చింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో పాశవిక దాడిని కొనసాగిస్తున్నది. దీనితో దేశవ్యాప్తంగా ఉద్యమం గడ్డుస్థితిని ఎదుర్కొంటున్నది. ప్రజా సంబంధాలు దెబ్బతింటున్నాయి. యుద్ధ చర్యలలో బలహీనతలు, నిర్దిష్ట అధ్యయన లోపం, రహస్య- బహిరంగ కార్యకలాపాలను సమన్వయించడంలో సామర్థ్యం తగ్గడం, దీటైన ఎత్తుగడలు రూపొందించుకోవడంలో లోపం, అన్యవర్గ ధోరణులు కొనసాగుతున్నాయి. మన దేశ విప్లవోద్యమ చరిత్రలో ఎన్నోసార్లు గడ్డు కాలాలు, ఓటములు ముందుకు వచ్చాయి. వీటన్నింటినీ అధిగమించాము. ఇప్పుడు ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి రష్యా బోల్షివిక్ పార్టీ చరిత్రలో కావల్సినంతా రాజకీయ, సైద్ధాంతిక జ్ఞానం, అనుభవ జ్ఞానము పొందుపరచబడివుంది. దాన్ని అధ్యయనం చేస్తూ ఉద్యమానికి నిర్దిష్టంగా అన్వయించుకుంటూ భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం.

★

**పార్టీ పోరాటాలు పార్టీకి బలాన్ని, జీవశక్తిని చేకూరుస్తాయి**

**చెల్లా చెదురుగా వ్యాప్తి చెందడం స్పష్టమైన హద్దులు చెరిగిపోవడం**

**పార్టీ బలహీనతలకి మిక్కిలి పెద్ద రుజువులు**

**తనను తాను ప్రక్షాళనం చేసుకోవడం ద్వారా పార్టీ పటిష్టమవుతుంది.**

**-1852 జూన్ 24న కా. మార్క్సుకు లాసాల్ రాసిన లేఖ నుండి**

# అన్నం పెట్టే రైతు చేతులకు బేడీలు వేసిన నియంత కేసీఆర్ అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బోల్షివిక్ స్పిరిట్‌తో పోరాడండి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తమ బతుకులు బాగుపడుతాయని, తమ జీవితంలో చిరునవ్వులు చిగురిస్తాయని, మోడుబారిన జీవితాలకు ఒక అర్థం, పరమార్థం ఉంటుందని సబ్బండ తెలంగాణ బిడ్డలు ఆకాంక్షించారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి చంద్రశేకర్‌రావు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 సం॥ల అవుతున్నా అరచేతిలో వైకుంఠం చూపెడుతున్నది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్ధానాలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయి. హామీలను తుంగలో తొక్కి ప్రజావ్యతిరేక విధానాలను, రైతువ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నది.




ఎన్నికల హామీలో రైతులకు మొత్తం రుణ మాఫీ చేస్తానని చెప్పిన కే.సీ.ఆర్. అధికారంలోకి వచ్చిన తర్వాత రుణాలను ఒకేసారి మాఫీ చేయడం సాధ్యం కాదని దఫ, దఫాలుగా చేస్తున్నాడు. తెలంగాణలో మొత్తం రైతు రుణాలు 23 వేల కోట్లు అని నాగిరెడ్డి కమిటీ నిర్ధారిస్తే దాన్ని టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం 17 వేల కోట్లకు కుదించింది. ఇప్పటివరకు మొదటి, రెండవ విడత కింద కేవలం రూ॥లు 8798 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. రుణమాఫీ చెయ్యక బ్యాంకులు కొత్త రుణాలు మంజూరు చెయ్యక పోవడంతో రైతాంగం వడ్డీవ్యాపారుల కోరల్లో చిక్కుకొని అధిక వడ్డీలను చెల్లించడం జరుగుతుంది. అప్పుల ఊబిలోకి కూరుకుపోయిన రైతులు ప్రభుత్వ, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల అవమానాలకు గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా రైతన్నల బలవన్మరణాల సంఖ్య తీవ్ర స్థాయిలో కొనసాగుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011-2013 వరకు 6, 882 మంది మరణించారు. తెలంగాణలో 2014 నుండి 2017 జనవరి వరకు 898 మంది రైతులు, 499 మంది వ్యవసాయ కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. తెలంగాణలో రోజుకు సగటున 15 మంది వరకు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం, టీ.ఆర్.ఎస్. నాయకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఒక వైపు ఆత్మహత్యలు జరిగినప్పటికీ గుండె నిబ్బరంతో వ్యసాయయం సాగు చేసే క్రమంలో నకిలీ విత్తనాల బెడద రైతాంగాన్ని గుండెలవిసేలా చేస్తుంది.

తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో మిరప, పత్తి, మినుము,పెసర వంటి నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్నారు. వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలోనే పచ్చి మిర్చి విత్తనాలు అనేక మంది రైతులను నిలువునా ముంచింది. మిర్చి కాతకు రాకపోవడంతో వ్యవసాయశాఖ అధికారులను, విత్తన కంపెనీలకు మొరపెట్టుకున్నప్పటికీ వారికి ఎలాంటి నష్టపరిహారం అందలేదు. ఒక్కొక్క రైతు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టినప్పటికీ మిర్చి రాకపోవడంతో నష్టపోతున్నారు.

ఒక పక్క నకిలీ విత్తనాలతో రైతాంగం సతమతమవుతుంటే మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు నకిలీ పురుగు మందులతో రైతుల రక్తాన్ని తాగుతూ అక్రమ వ్యాపారులు కోట్లకు పరిగెడుతున్నారు. పంట కోసం తెచ్చిన పురుగు మందునే రైతన్నలు పెరుగు బువ్వగా స్వీకరించాల్సిన పరిస్థితికి ప్రభుత్వాలు నెట్టివేస్తున్నాయి.

నకిలీ విత్తనాల, పురుగమందుల స్కాంలో వ్యవసాయశాఖ మంత్రి హస్తం ఉన్నదని ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు.

తెలంగాణ ప్రజానీకం ఏ నీళ్ళ కోసమైతే 60 ఏళ్ళు పోరాటాలు చేసిందో, ఆ నీళ్ళు నేడు పగటికలగానే మారింది. ఎగువన జీవనదులు పారుతున్నా, రైతు ఎదను తడిపే పాలక వర్గం లేదు. సకాలంలో వ్యవసాయానికి కరెంటు అందక లక్షల ఎకరాల భూములు ఎండిపోయాయి. ఎన్నికల ముందు వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తానని ప్రగల్భాలు పలికిన కే.సీ.ఆర్. ప్రభుత్వం వాగ్ధానాన్ని ఎండమావిలో వదిలేసింది.

ఆరుగాలం కష్టపడి చేతికొచ్చిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించడంలో ప్రభుత్వాలు, దళారులు, వ్యాపారస్తులు కుమ్మక్కై కనీస మద్దతు ధరను ప్రకటించకుండా రైతాంగం నోట్లో మట్టికొడుతున్నారు. ఏ వలసాంధ్ర పాలనకు వ్యతిరేకంగా సబ్బండ వర్గాల ప్రజలు పోరాటం చేశారో అదే ఆంధ్ర దళారులతో కుమ్మక్కైన కే.సీ.ఆర్. అండ్ కో అవే దోపిడీ విధానాలను తమ వాగ్ధాటితో చాకచక్యంగా, మెరుగ్గా అమలు పరుస్తున్నాడు. రైతులు పండించిన పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం 'నామ్' పేరిట ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెడితే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం సరిగ్గా వినియోగించుకోలేక కుంటిసాకులు చెప్తుతూ రైతులను పక్క దారి పట్టిస్తున్నది.

ఈ సం॥రం మిర్చి, మొక్కజొన్న, పసుపు పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమైనాయి. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో మొక్కజొన్న కు గిట్టుబాటు ధర కల్పించాలని రైతాంగం ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే ప్రభుత్వం పోలీసు బలగాలతో అణిచివేస్తూ రైతులపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతున్నది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కే.సీ.ఆర్. అనేక సభల్లో తెలంగాణలో రైతు ఆత్మహత్యలు వలసాంధ్ర

పాలకుల కుట్రల వల్లే జరుగుతున్నాయని, మన తెలంగాణను మనం సాధించుకుంటే మన నీళ్ళు, మన నిధులు, మన కరెంటు అంటూ ప్రగల్భాలు పలికాడు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత తాను గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక రైతు అత్మహత్యలపై వ్యంగ్యంగా, సిగ్గు లేకుండా మాట్లాడటం నియంతృత్వ వైఖరికి నిదర్శనం. రాష్ట్రంలో అనేక మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నా కనీసం నోరు మెదపకుండా యజ్ఞాలు, యాగాలు, పుష్కరాల్లు అంటూ తెలంగాణ ప్రజలల్లో ఆధ్యాత్మీకతను నూరిపోస్తున్నాడు. కే.సీ.ఆర్. తానేదో రాజునని, కోటలో కూర్చోని శాసనాలు చేస్తానని కలలు కంటూ 300 కోట్లతో కోటలాంటి ప్రగతిభవన్‌ను నిర్మించుకున్నాడు. తన ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పని చేస్తుందని చెబుతూనే బడ్జెట్‌లో కనీసం వ్యవసాయ రంగానికి 20శాతం కూడా నిధులు కేటాయించడం లేదు.

గత సంవత్సరం పత్తి పంట దెబ్బతిన్నది కనుక ఈసారి మిర్చి పంట వేస్తే గిట్టుబాటు ధర కల్పిస్తానని ముఖ్యమంత్రి కే.సీ.ఆర్. వివిధ వేదికలపై ప్రకటించాడు. అది నమ్మిన రైతాంగం లక్షల్లో అప్పులు చేసి మిర్చి పంట వేసినారు. గత సంవత్సరం మిర్చికి క్వింటాల్‌కు 15వేల వరకు వున్న ధర ఈ సం॥రం క్వింటాల్‌కు 15వందల నుండి 2వేల వరకు పడిపోవడంతో తెలంగాణ రైతాంగం పండించిన మిర్చి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని తమ మిర్చిని తామే కాల్చి నిరసన తెలియజేశారు. వినూత్న రీతిలో రైతాంగం గిట్టుబాటు ధర కోసం మిలిటెన్సీ పోరాటం చేయాల్సి వచ్చింది. ఖమ్మం జిల్లా మిర్చి మార్కెట్‌లో రైతాంగం ఒక ఐక్యసంఘటన ఏర్పర్చి మార్కెట్ ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తూ రోడ్డుపై బైఠాయించింది. ప్రభుత్వం దిగివచ్చి గిట్టుబాటు ధర కల్పిస్తామని హామి ఇచ్చి దాన్ని తుంగలో తొక్కింది. ఒక తెలంగాణలోనే కాకుండా పండించిన పంటలకు గిట్టుబాటు ధర కోసం యావత్ దేశంలోని రైతాంగం ఎక్కడికక్కడ మిలిటేన్సీ రూపాల్లో పోరాడుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో చంద్రబాబు రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపితే చంద్రబాబు ప్రభుత్వం లాఠీలతో అణచివేసింది. మధ్య ప్రదేశ్‌లోని రైతాంగం గిట్టుబాటు ధరల కోసం మిలిటెన్సీ రూపంలో పోరాటం జరిపితే అక్కడి బీ.జే.పీ. శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపితే 5 గురు రైతులు చనిపోయారు. ధర్నా చేస్తున్న రైతులను అరెస్టు చేసి చేతులకు బేడీలు వేసి జైళ్ళో పెట్టింది. ప్రజా ఆందోళన పెరగడంతో శివరాజ్‌సింగ్ చౌహాన్ తానే రైతుల కోసం నిరాహారదీక్షకు కూర్చోవడం సిగ్గుచేటు. మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలో గిట్టుబాటు ధర కోసం మిలిటెంట్ పోరాటాలు కొనసాగిస్తూ, మధ్యప్రదేశ్ ఘటనపై దేశ వ్యాప్తంగా రైతాంగం స్పందించడంతో ప్రభుత్వాలు మెతక వైఖరిని ప్రదర్శిస్తూ కపట నాటకాలడుతూ రైతాంగాన్ని అదుకుంటామని ఉపన్యాసాలిస్తున్నారు. కాని ఆచరణలో మాత్రం చేసింది శూన్యం. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి గిట్టుబాటు ధరల కోసం ధర్నా చేస్తున్న ఖమ్మం రైతులను అరెస్టు చేసి జైళ్లో వేసింది. కోర్టులో బెయిల్ వచ్చినప్పటికీ విప్లవకారులపై కేసులు పెడుతున్నట్లు జైలు ఆవరణలోనే మరిన్ని కేసులు పెడుతున్నారు. ఖైదీలకు వేస్తున్నట్లు రైతుల చేతులకు బేడీలు వేస్తున్నారు.

2014న కేంద్రంలో అధికారం చేపట్టిన నరేంద్రమోడీ మాట్లాడితే రైతు సంక్షేమ రాజ్యమని, రైతు పక్షమని, దేశానికి రైతే వెన్నెముక అని ఊదరగొడుతున్నాడు. అదే రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయి, నకిలి విత్తనాలు, నకిలి పురుగు మందులతో పండిన పంటలకు గిట్టుబాటు ధరలేక సతమతమవుతుంటే, దానికి తోడు 2013లో యూ.పి.ఏ. ప్రభుత్వం తెచ్చిన భూసేకరణ చట్టాన్ని మార్చి రైతాంగాన్ని మొత్తం భూమి నుండి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

దేశంలో వ్యవసాయ రంగంపై ప్రత్యక్షంగా ఆధారపడిన ప్రజలు 90 శాతం నుండి 100 శాతం వరకు ఆధారపడిన ఏకైక రంగం వ్యవసాయమే. ఇలాంటి కీలక రంగమైన వ్యవసాయంపై ప్రభుత్వ నిర్లక్ష్యంతో దళారుల దోపిడీ, వ్యాపారులపై నియంత్రణ లేకపోవడంతో దళారులు చెప్పిందే మార్కెట్ ధరగా మారింది. గత మూడేళ్లుగా వ్యవసాయరంగం సామ్రాజ్యవాద విధానాలతో సంక్షోభానికి గురైంది.

అధికార మార్పిడి జరిగి 70 సం॥రాలు కావస్తున్నా భారత ప్రజల బ్రతుకులు మారకపోగా రైతాంగానికి మిగిలింది బలవన్మరణాలే. సామ్రాజ్యవాద అనుకూల విధానాల వల్ల వ్యవసాయం సంక్షోభంలో ఉంటే ఇవేమి పట్టకుండా ప్రగతి భవన్‌ల పేరిట, ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో వేల కోట్ల రూ॥ల ప్రజాధనాన్ని తాను దోచుకుంటూ, కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నాడు. అధిక సామర్థ్యం గల మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా, మూడు పంటలు పండే భూములను రైతాంగం వదులుకోక మిలిటెంట్‌గా పోరాటం చేస్తే ప్రజలపై కాల్పులు జరిపి, లాఠీచార్జీ, భాష్పవాయు గోళాలు ప్రయోగించి తన దొర స్వభావాన్ని, నియంతృత్వాన్ని బయటపెట్టుకున్నాడు.

ఎన్నికలకు ముందు ఓపెన్ కాస్ట్‌లకు వ్యతిరేకం అని చెప్పి తీరా అధికారాలోకి వచ్చిన తర్వాత 16 ఓపెన్‌కాస్ట్ మైన్స్‌ను ప్రారంభించే ప్రయత్నంలో ప్రజా ఆందోళన రావడంతో వెనక్కుతగ్గాడు. మొత్తంగా తెలంగాణను బొందలగడ్డగా మార్చే ప్రయత్నం చేయిస్తున్నాడు. అసలే తెలంగాణ రైతాంగం పంటలులేక, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక బలవన్మరణాలకు పాల్పడుతుంటే పరిశ్రమల కోసం భూసేకరణ చట్టం 2013 ను కాదని 123 జి.వో ద్వారా బలవంతపు భూసేకరణ చేసే ప్రయత్నం చేస్తున్నాడు. దీనితో మొత్తంగా రైతులను భూముల నుండి వెళ్ళగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

ఒక పక్క పారిశ్రామిక అవసరాల కోసం లక్షల ఎకరాల పంట భూములను ధారాధత్తం చేస్తూ మరోపక్క వ్యవసాయాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ 2019 ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామ గ్రామాన రైతులు రైతు సంఘాలు ఏర్పర్చుకోవాలని, ప్రభుత్వం ఖరీఫ్, రబీకి ఉచిత ఎరువులను ఇస్తుందని మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నాడు. తెలంగాణలో మౌలిక ప్రధాన సమస్య భూమి సమస్య. మనం సాధించుకున్నది కేవలం భౌగోళిక తెలంగాణనే. కాబట్టి మరో ప్రజా ఉద్యమానికి అంటే ప్రజాస్వామిక తెలంగాణకై పోరాడవలసిన తక్షణ అవసరం ఉన్నది. ప్రజాస్వామిక తెలంగాణలోనే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయి. అది వ్యవసాయిక విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవం వెలుగులో పోరాడాలి.

★

# వారసత్వ ఉద్యోగాలకై ఉద్యమిస్తున్న సింగరేణి కార్మికులకు అండగా నిలబడదాం

తెలంగాణకే సింగరేణి తలమానికం. సింగరేణి ప్రాంతం నల్ల బంగారానికి నిలయం. సిరులు పంచే సింగరేణికి పోరాటాల చరిత్ర ఉంది. త్యాగాల వారసత్వం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో బావిదోరల దోపిడీ దౌర్జన్యాలకు, అధికారుల అణిచివేత వేదింపులకు, 8 మస్టర్ల కోత చట్టానికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఉంది. ఉమ్మడిగా సమ్మె చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని చీకటి మయం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుండెల్లో రైళ్ళు పరిగెత్తించి, సింగరేణి యాజమాన్యం మెడలు వంచి హక్కులను సాధించుకున్న ఘణమైన చరిత్ర సింగరేణి కార్మికులకు ఉన్నదంటే అతియోశక్తి కాదు.



కార్మిక శక్తికి గాబరపడ్డ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యం కుట్రలతో కార్మికుల పోరాటాలను అణచివేయడానికిసింగరేణిలో సి.ఆర్.పి.ఎఫ్., బి.ఎస్.ఎఫ్. బలగాలను మోహరించి కార్మిక నాయకులను, విప్లవ కార్యకర్తలను హత్యలు చేసి రక్తపుటేరులు పారించి, బయోత్పాతాన్ని సృష్టించి పాశవిక నిర్బంధాన్ని అమలు పరిచింది. ఈ నిర్బంధ కాలంలో విప్లవ కార్యకలాపాలు తగ్గడంతో ఇదే అదునుగా భావించిన ప్రపంచబ్యాంక్ ఎజెంట్ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చీకటి చట్టాలను ప్రవేశపెట్టి, వారసత్వ ఉద్యోగాలను రద్దు చేసి, దోపిడీ దారులతో 'శహబాస్' అనిపించుకున్నాడు.

చీకటి గుయ్యారంలోకి వెళ్లి నల్ల బంగారాన్ని వెలికి తీసి లోకానికి వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మిక జీవితాలు మసక బారుతున్నాయి. భూగర్భం నుండి బొగ్గును వెలుపలికి తీసుకరావడానికి కార్మికులకు తట్టా, చెమ్మసులు సింగరేణి యాజమాన్యం సరఫరా చేయాలి. పని స్థలాలలో కార్మికుల రక్షణ కొరకు రక్షణ చర్యలు చేపట్టాలి. యాజమాన్యం మైనింగ్ చట్టాలను తుంగలో తొక్కి రక్షణ చర్యలను తీసుకోవడం లేదు. తట్టలు చీకిపోయినా, చెమ్మసులు విరిగిపోయినా కొత్తవాటిని సరఫరా చేయకుండా మొండి వైఖరిని చేపడుతుంది. అధికారులు లంచాలకు ఆశపడి కంపెనీలతో కుమ్మక్కై కార్మికులకు రక్షణగా ఇవ్వాల్సిన టోపి, బూట్లను నాసిరకం తెప్పించి కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

పాలక వర్గాల కుట్రలతో, యాజమాన్యం దోపిడీతో సింగరేణి ప్రాంతం నిరంతరం రావణకాష్టంలా రగులుతూనే ఉంది. నల్ల బంగారాన్ని వెలికి తీసి వేల కోట్ల రూ॥లు దండుకోవడానికి దోపిడీ ప్రభుత్వాలు సింగరేణి యాజమాన్యం కుట్రపూరితంగా సాంప్రదాయక బొగ్గు బావులను రద్దు చేసి ఓపెన్‌కాస్ట్ బొగ్గుబావులలో ఆధునాతన యంత్రాలను ప్రవేశ పెట్టి కార్మికులను తగ్గించుతుంది. మోసపూరితంగా గోల్డెన్ షేక్‌హ్యాండ్, స్వచ్ఛంద పదవి విరమణ పేరుతో లక్షా 20 వేలుగా ఉన్న కార్మికులను సగానికి సగం తగ్గించి వేశారు. మరి కొద్ది మంది కార్మికులు అనారోగ్యంతో డ్యూటికి హాజరు కాలేకపోతే గైర్‌హాజర్ అయినారని ఉద్యోగాల నుండి తొలిగించినారు. ఉద్యోగాల నుండి తొలిగించబడిన కార్మికులు ఉద్యోగాలకు తీసుకోవాలని యాజమాన్యానికి, ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా పట్టించుకోక పోవడంతో కార్మికులు రిలే నిరహారదీక్షలు చెపట్టి పోరాడుతున్నారు. మరో వైపు కార్మికుల రక్షణ కొరకు ఇచ్చే టోపి, బూట్లు నాన్యత కలిగినవి ఇవ్వాలని, కార్మికుల ఆరోగ్యాల కొరకు ఇచ్చే గుడ్లు, రొట్టె, బెల్లం, కొబ్బరి నూనె, డస్ట్‌ప్రూఫ్‌లు వెంటనే పునరుద్ధరించాలని, కార్మికులకు వారి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించడానికి ఆసుపత్రులను ఆధునికరించి సిబ్బందిని, డాక్టర్స్‌ను, స్టాఫ్ నర్సులను, ఫార్మాసిస్టులను, వార్డ్ బాయ్‌లను 24 గం॥లు అందుబాటులో వుంచాలని, ప్రైవేట్ కాంట్రాక్ట్ పద్ధలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

10వ వేజ్ బోర్డ్‌ను వెంటనే అమలు పరిచి మార్కెట్ ధరలకు అనుగుణంగా జీతాలను పెంచాలని, ఇన్‌కమ్ టాక్స్ రద్దు చేయాలని, అవుట్ సోర్సింగ్ పద్ధతిని ఎత్తివేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి యాజమాన్యమే నేరుగా కార్మికులను పనులోకి తీసుకోవాలని, కోడ్‌ఆఫ్ డిసిప్లెన్, న్యూకోల్ పాలసీ (చీకటి చట్టాలను) రద్దు చేయాలని వివిధ డిమాండ్స్‌తో సింగరేణి కార్మికులు బొగ్గుబావుల వద్ద నిరసనలు, టోకెన్ సమ్మెలు, జి.ఎమ్., ఏ.జి.ఎమ్. ఆఫీస్‌ల ముట్టడి లాంటి పోరాటాలు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం బహుళ జాతి సంస్థలకు అనుకూలంగా కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మిక హక్కులను కాలరాచే ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని సింగరేణి కార్మికులు కార్మిక శక్తిని, ఐక్యతను చాటి చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే సింగరేణి కార్మికులకు వారసత్వ ఉద్యోగాలు ఇస్తానని హామి ఇచ్చి ముఖ్యమంత్రి అయ్యాక రాజ్యాంగ విరుద్ధమైన నిబంధనలతో కూడుకున్న తప్పుడు జి.ఓ. ఇచ్చి సింగరేణి కార్మిక వారసులను మోసం చేసిండు.

సింగరేణి కార్మికుల పోరాటాల ఫలితంగా 1979 ఆగస్టు 11న రెండవ కార్మికుల వేజ్ బోర్డులో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు అన్‌ఫిట్ అయితే వారి వారసులకు ఉద్యోగం ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. సింగరేణి కార్మికులు ప్రకృతికి విరుద్ధంగా భూగర్భంలోని చీకటి గుహల్లోకి వెళ్లి నల్ల బంగారాన్ని వెలికి తీస్తారు. భూగర్భంలో సరిగా వెలుతురు అందక, స్వచ్ఛమైన గాలి, నీరు దొరకక, అధిక వేడిని తట్టుకొని దుమ్ము, దూళిలో పని చేస్తారు. కాబట్టి కార్మికులకు

బీ.పీ., షుగర్, మోకాళ్ళ నొప్పులు, క్యాన్సర్, ఉబ్బసం, గుండె జబ్బులు, ముక్కు, చేవులకు సంబంధించిన వ్యాధులు వస్తాయి. కనుక కార్మికులు అనారోగ్యంతో ఉద్యోగం చేయలేక మెడికల్ అన్‌ఫిట్ అయితే వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఐడీ యాక్ట్ 12 (3) కింద కార్మిక సంఘాలు 1979లోనే ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందానికి కొనసాగింపుగా 1981 జనవరి 21న సింగరేణిలో వీ.ఆర్.ఎస్. ద్వారా అనారోగ్యంతో ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే అన్‌ఫిట్ చేసి వారసుడిని ఫిట్ చేయడం ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందని ఐడీయాక్ట్ 12 (3) ప్రకారం ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ప్రపంచబ్యాంక్ ఏజెంట్ అయిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 1998లో రద్దు చేసి సింగరేణి కార్మికులకు ద్రోహం తలపెట్టాడు.

2009 తెలంగాణ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన సింగరేణి కార్మికులకు ఉమ్మడి రాష్ట్రంలో తీరని అన్యాయం జరిగిందని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బ్రతుకులు మారుతాయని, తమ పిల్లలకు వారసత్వ ఉద్యోగాలు లభిస్తాయని ఆశతో ఉమ్మడిగా సమ్మెలు చేసి కార్మిక శక్తిని చాటారు. ఉద్యమ సమయంలో కే.సీ.ఆర్. సింగరేణి కార్మికులకు వారసత్వ ఉద్యోగాలు కల్పిస్తానని వరాల జల్లులు కురిపించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, ముఖ్యమంత్రి పదవిని చేపట్టి 3 సం॥లు కావస్తున్నా కార్మికుల వారసత్వ ఉద్యోగాల కలలు నెరవేర్చకపోగా సింగరేణిలో కార్మిక సంఘాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాన్ని గెలిపించుకోవడం కోసం ఆగ మేఘాల మీద రాజ్యాంగ విరుద్ధంగా వారసత్వ ఉద్యోగాల జీ.ఓ.ను తీసుకవచ్చి కార్మికుల బిడ్డల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.

భూగర్భంలోకి వెళ్లి చీకటిని చీల్చుకొని నల్ల బంగారాన్ని వెలికి తీసి లోకానికి వెలుగులు పంచుతున్న కార్మికుల బతుకుల్లో వెలుగులు లేక జీవితాలు మసక బారుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలోనైనా, ప్రత్యేక రాష్ట్రంలోనైనా సింగరేణి కార్మికులకు ఒరిగిందేమిలేదు. అధికాంలో ఏ పార్టీ వున్న దోపిడీ, అణచివేతలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయి. పాలక వర్గాల, సింగరేణి యాజమాన్యాల కుట్రలను ఎండగడుతూ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు దగుల్బాజి మాటలకు మోసపోకుండా వారసత్వ ఉద్యోగాల కొరకు సింగరేణి కార్మికులు సమరశీల పోరాటాలకు పిలుపునిచ్చి సమ్మె సైరన్ మోగించారు.

కార్మికుల సమ్మె పోరాటాన్ని విచ్ఛిన్నం చేయడానికి టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం, పోలీసులు కుమ్మక్కై కార్మికుల ఐక్యతను దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారు. ఈ కుట్రలను ఎండగడుతూ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి, వారసత్వ ఉద్యోగాల పునరుద్ధరణకై జరుగుతున్న సింగరేణి కార్మికుల సమ్మె పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతునిచ్చి అండగా నిలబడాలని పిలుపునిస్తూ మావోయిస్టు పార్టీ సింగరేణి కార్మికుల న్యాయమైన పోరాటాలకు అండగా ఉంటుందని హామీ ఇస్తున్నది.

★

---

**పాక్షిక కోరికల కోసం ప్రభుత్వంతో జరిపే పోరాటం పాక్షిక కోరికలను కొన్నింటిని సాధించడం అంటే శత్రువులతో చిన్న చిన్న తగాదాలవంటివి మాత్రమే. శివారులలో శత్రువుతో చిన్న చిన్న ఘర్షణలవంటివి మాత్రమే- అని మనం గుర్తించాలి. న్యాయత్మక పోరాటం ఇక ముందు జరపవలసి ఉంది. మన ముందు శత్రువు కోట తన యావచ్ఛక్తితోనూ నిలబడిఉంది. మనపై అది తుపాకి గుండ్లను, ఫిరంగి గుండ్లను కురిపిస్తుంది. మన ఉత్తమ యోధులను రంపపు కోత కోస్తుంది. ఈ కోటను మనం పట్టుకోవాలి. జాగృతమవుతున్న శ్రామికవర్గ శక్తులతో రష్యన్ విప్లవకారుల శక్తులన్నింటిని కలిపి ఒక పార్టీని ఏర్పరిచినట్లయితే ఆ కోటను పట్టుకోగలం. ఆ పార్టీలోకి రష్యాలోని ఉత్సాహవంతులను చిత్తశుద్ధిగల వారినందరిని ఆకర్షించాలి. అప్పుడే “లక్షల కొలది కష్టజీవుల దృఢహస్తం లేస్తుంది. సైనిక బాయ్‌నెట్లచే కాపాడబడుతున్న నిరంకుశ ప్రభుత్వ దాస్యం తుత్తునియులై ధ్వంసం అవుతుంది”. అని రష్యన్ విప్లవ కార్మికుడు ప్యోటర్ అలెగ్జియెవ్ చెప్పిన ప్రవచనం నిజం అవుతుంది.**

**-లెనిన్**

## అమరవీరుల జీవిత చరిత్రలు

### బుర్కపాల్ అమరవీరులు

**కా. మడావి బొజ్జ (రవి)**



సుక్మా జిల్లా కిష్టారం ఏరియా మైలూరు గ్రామ నిరుపేద ఆదివాసీ కుటుంబం మాడవి కోసి, రమణయ్యలకు మూడవ సంతానంగా బొజ్జన్న (రవి)40 సం॥ల క్రితం జన్మించాడు. రవికి ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. బొజ్జన్న కుటుంబం భూమి లేని నిరుపేద కుటుంబం కావడంతో బతుకుదెరువు కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మైలూరు గ్రామం నుండి ఖమ్మం జిల్లాలోని చర్ల మండలం కోనెవాయి గ్రామానికి వలసవచ్చి స్థిరపడ్డారు. కోనేవాయి గ్రామంలో పార్టీ రాజకీయాలు బలంగా ఉండడంతో సహజంగానే బొజ్జన్న బాల్యం నుండే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడయ్యాడు.

దళం వాళ్ళ గ్రామానికి వెళ్లిందంటే కా. రవి దళం వద్దకు చేరుకుని దళం పోయే వరకు దళం వద్దనే ఉండేవాడు. బాలల సంఘంలో ఉంటూ గ్రామానికి సంబంధించిన అనేక విషయాలు దళంతో చర్చించేవాడు. పెరిగి పెద్దవాడయిన తరువాత సమాజంలో అసమానతలు చూసి చలించి పోయేవాడు. గ్రామంలోని భూస్వామ్య పెత్తందార్ల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేస్తూ పోరాడాడు. రవి తన చిన్నతనం నుండి తనకున్న కొద్దిపాటి పోడుభూమిలో వ్యవసాయం, కూలీ పని చేసుకుని తన కుటుంబంను పోషించేవాడు.

కా. రవి తన గ్రామానికి దళం వచ్చిందంటే తనకు ఇంటిపనులు ఎన్నిఉన్నా దళానికి రక్షణతో పాటు అనేక పనులు నిర్వహించేవాడు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలను పార్టీకి పరిచయం చేసే వాడు. గ్రామ సమస్యలను ఎలాంటి కపటం లేకుండా నిస్వార్థంగా, సామరస్యంగా పరిష్కరించేవాడు. అందుకే గ్రామ ప్రజలు కా.రవిని అమితంగా ప్రేమించేవారు. కొనేవాయి ప్రజలు భూమి కోసం అడవి పోడు నరుకుతున్న సమయంలో ఫారెస్టు అధికారులు ఆదివాసీ ప్రజలపై కేసులు పెట్టి అనేక ఆటంకాలు కల్పిస్తుండడంతో అధికారుల జులుంకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించి పోరాడినాడు. జల్-జంగల్-జమీన్, ఆత్మగౌరవం, అధికారం కాపాడుకోవాలని పిలుపునిచ్చాడు.

గ్రామంలో సంఘాన్ని నిర్మాణం చేసినాడు. గ్రామాన్ని గ్రామరాజ్య కమిటీగా అభివృద్ధి చేస్తున్న క్రమంలో ద్రోహి ఇచ్చిన సమాచారంతో 2007లో కా. రవి అరెస్టయ్యాడు.

శత్రువు తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసినా పార్టీ రహస్యాన్ని చెప్పకుండా దృఢ సంకల్పంతో ఉన్నాడు. తన పట్టుదలను చూసిన శత్రువు ఇంకా ఏమి రాబట్టలేమని కా. రవి పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపాడు. సంవత్సర కాలంలో జైలులో ఉండి ఖైదీల హక్కుల సాధనకై పోరాడాడు. రవిలో ఉన్న విప్లవ సంకల్పంతో శత్రువు నిర్బంధం, చిత్రహింసలు, జైలు గోడలు తన పట్టుదలను సడలించలేకపోగా, మరింత వర్గకసిని రగిలించింది.

కా. రవి జైలు నుండి విడుదల అయిన తర్వాత, కోర్టు వాయిదాలకు పోతూనే పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నాడు. రవి కి నలుగురు పిల్లలు, (ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు) ఉన్నారు. రవి పార్టీ పని చేస్తున్న సమయంలో రవి భార్య కోసి కూడా అనేక నిర్బంధాలను ఎదుర్కొంది. రవి కోర్టుల చుట్టు తిరుగుతున్నప్పటికీ పోలీసుల వేదింపులు తగ్గకపోగా మరింత అధికమైనవి. దీనితో రవి పార్టీ పిలుపు మేరకు కుటుంబాన్ని వదిలి భార్యకు ప్రజా పోరాటం గురించి వివరించి భూమి, భుక్తి, విముక్తికై పోరాటమే మార్గమని అర్థం చేపించి పూర్తి కాలం కార్యకర్తగా 2012లో పార్టీలో భర్తీ అయ్యాడు. మావోయిస్టు పార్టీ చెప్పిన రాజకీయాలను వింటు భారతదేశం అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య స్వభావం అని అర్థం చేసుకుని నూతన ప్రజాస్వామిక విప్లవమే ప్రజల విముక్తికి సరైన మార్గమని నమ్మి ప్రజాయుద్ధ బాట పట్టాడు.

పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను మనస్ఫూర్తిగా స్వీకరించి అంకితభావంతో పనిచేసాడు. కా. రవి జీవితమంతా విప్లవ కార్యకలాపాల నడుమనే వికసిస్తు వచ్చింది. అందరితో కలిసిమెలిసి ఆప్యాయంగా ఉండేవాడు.

కా. రవి ఇంటివద్ద చదుకుకోలేదు. దళంలో రోజు వారి సమిష్టిలో (సెంట్రీ, కోరియర్, వంట) పాల్గొంటూనే పట్టుదలతో చదువు నేర్చుకున్నాడు. తనకంటే చిన్నవాళ్ళు బాధ్యులుగా ఉన్నప్పటికీ వారు చెప్పే పనులు ఓపికగా చేస్తూ రానివాటిని అడిగి తెలుసుకొని నేర్చుకునేవాడు. తనకు తెలియని తెలుగు భాష నేర్చుకుని తన తోటి సభ్యులకు కూడా చెప్పేవాడు. పార్టీలోకి వచ్చిన 3 సం॥రాలకు అతి తక్కువ కాలంలోనే ఏ.సీ. మెంబర్‌గా 2015లో ప్రమోట్ అయినాడు. కా. రవి ఎల్.జీ.ఎస్. కమాండర్‌గా ఉంటూ ఏరియాలో చిన్న చిన్న మిలిటరీ చర్యలు చేస్తూ మిలీషియాకు మిలిటరీ ట్రైనింగ్ ఇస్తూ రాజకీయాలు చెప్పేవాడు. ఎల్.జీ.ఎస్. కమాండర్‌గా తన బాధ్యతల్లో 2సం॥రాలు పనిచేసాడు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటూ తన కమిటీలో చేసుకున్న తీర్మానాలు, కార్యక్రమాలు అమలు చేస్తూ తన సభ్యులతో చేయించేవాడు.

తన తోటి కమిటీ సభ్యులు, దళ సభ్యులు శత్రు నిర్బంధానికి భయపడి శత్రువు చూపించే ఆశలకు, వాడు ఇచ్చే ఎంగిలి మెతుకులకు ఆశపడి శత్రువు ముందు మోకరిల్లి, వాడి ఆశల ఉచ్చులో చిక్కి ద్రోహులుగా మారినా కా. రవి దృఢంగా నిలబడి పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించేవాడు.

శత్రువు పెట్టిన చిత్రహింసలు, వయస్సుతో వచ్చిన అనారోగ్య సమస్యలు ఎన్ని ఉన్నా వాటిని లెక్క చేయకుండా తన దళానికి రోజువారి కార్యక్రమాలకు ఆటంకం కాకుండా చూస్తు ప్రజల కోసం పట్టుదలతో పనిచేసాడు.

శత్రువు నిర్బంధం మూలంగా చాలా మంది నాయకత్వ కామ్రేడ్స్ శత్రువు ముందు దిగజారి పోయి లొంగిపోవడం మూలంగా ప్రజలపై శత్రువు దాడులు పెరిగి నిర్మాణాలు దెబ్బతిని ఖమ్మం జిల్లా ఉద్యమం గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్న క్రమంలో పార్టీ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 2017లో చర్ల ఎల్.ఓ.ఎస్. కమాండర్‌గా బాధ్యతలు అప్పగించగా రవి సంతోషంగా స్వీకరించి ఏరియాలో ప్రజలను సమీకరించి దెబ్బతిన్న నిర్మాణాలను పునర్నిర్మాణం చేస్తూ ప్రజలను నిర్మాణంగా, రాజకీయంగా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేసినాడు.

పట్టుదలతో పనులు చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారం చేస్తూ దోపిడీ పాలక వర్గాల కుటీల నీతి, సంస్కరణలు ఎండగడుతూ శత్రు నిర్బంధం మధ్యలోనే ఏరియాలోని గ్రామాలను తిరుగుతు ప్రజలతో సంబంధాలు, పరిచయాలు పెంచుకున్నాడు. కా. రవికి వర్గ శత్రువు అన్నా, శత్రు నిర్మూలన అన్నా ముందుండేవాడు. అందుకే ఏరియాలో ఇన్‌ఫార్మర్ల, పోలీసుల నిర్మూలనకై ప్రయత్నించేవాడు. అందుకే 2017లో టీ.సీ.ఓ.సీ., మాస్ వర్క్ సంయుక్తంగా నడుస్తున్న క్రమంలో కా. రవి బాధ్యతల రీత్యా ఆర్గనైజేషన్‌కు పోవలసి ఉండే. కానీ శత్రు దాడిలో పాల్గొంటానని పట్టుపట్టి కా. రవి ఏప్రిల్24, 2017న బుర్కపాల్ అంబుష్‌లో పాల్గొని హెూరాహెూరి పోరాటంలో కా. రవి తలకు తూట తగిలి అమరత్వం చెందాడు. కా. రవి తన నులివెచ్చని రక్తాన్ని ధారబోసి 25 మంది సీ.ఆర్.పీ.ఎఫ్. బలగాలను అంతమొందించి, ఆయుధాల పంట పండించిన వీరయోధుడు. కా. రవి అమరత్వం తెలంగాణ ఉద్యమానికి ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం-ఈస్ట్ గోదావరి డివిజన్ ఉద్యమానికి తీవ్రమైన నష్టం. కానీ భవిష్యత్‌కు బాటలు వేసాడు. కా. రవి త్యాగం, ధైర్యం, సాహసం మనకు ఆదర్శం. ఆ త్యాగాన్ని, ఆదర్శాలను ఎత్తిపడుతు కా. రవి ఆశయాన్ని కొనసాగిద్దాం.

### కా. మడ్కాం దేవాల్ (అనిల్)



మడ్కాం దేవాల్ బుర్గుం పంచాయితీకి చెందిన డోరెపార. ఇక్కడ అనేక పేద కుటుంబాల మాదిరిగానే కా. దేవాల్ (అనిల్) కుటుంబం కూడా తమ బతుకుదెరువును వెతుక్కుంటూ బీజాపూర్ జిల్లా ఊసురు బ్లాక్ లింగపురం వూళ్లో స్థిరపడ్డారు. ఆ సమయంలో చిన్న పిల్లవాడుగా వున్న దేవాల్‌ను ఒక గంపలో కూర్చోబెట్టి తీసుకపోయారు. ఇతని తల్లి దండ్రులు దేవాల్ అని పేరు పెట్టారు. పార్టీలో దక్షిణ్ బస్తర్, దర్భ డివిజన్‌ల్లోని ప్రజలందరికీ అనిల్‌గా పరిచయం.

వర్గ రీత్యా నిరుపేద కుటుంబానికి చెందిన అనిల్ స్వాభావికంగానే విప్లవం పట్ల చిన్న వయస్సులోనే ఆకర్షితుడయ్యాడు. చివరి వరకు అనేక కఠిన పరిస్థితుల్లో కూడా ప్రజల పట్ల విప్లవ రాజకీయాల పట్ల విప్లవ పార్టీపై అచంచల విశ్వాసంతో పనిచేశాడు.

1998లోనే గ్రామంలో బాలల సంఘంలో సభ్యత్వం తీసుకున్న అనిల్ 2004లో వృత్తి విప్లవకారునిగా తన జీవితం మొదలై, అంచెలంచలుగా ప్లాటూన్ పార్టీ కమిటీ కార్యదర్శి స్థాయి వరకు ఎదిగాడు.

పామేడ్ ఏరియాలో ఎల్.జీ.ఎస్. సభ్యునిగా పని చేస్తూ ప్రజల విశ్వాసం చూరగొన్నాడు. తర్వాత కంపెనీ-3లోకి నాయకత్వ కామ్రేడ్‌కు గార్డ్‌గా బదిలీ అయ్యాడు. ఇతనిలో వున్న మిలిటెన్సీ, చొరవను గమనించిన నాయకత్వ కామ్రేడ్స్ అనిల్‌ను దక్షిణ రీజయన్ స్థాయి ఏ.టీ.లోకి తీసుకున్నారు. ఆ సమయంలో అనేక యుద్ధ చర్యల్లో పాల్గొన్నాడు. 2008లో గాదేరాస్ వద్ద ఒక ఎస్.ఐ., పోలీసు జవాన్ పై కత్తులతోనే దాడి జరిపి ఇద్దరిని చంపి వారి నుండి ఒక ఎస్.ఎల్.ఆర్. మరొక ఇన్‌సాస్ స్వాధీనం చేసుకున్నారు.

2009లో పార్టీ దళాలు కొత్తగా విస్తరించిన దర్భ డివిజన్‌లోకి బదిలీ అయ్యాడు. ఈ డివిజన్‌లో ముందు మలింగేర్ ఎల్.జీ.ఎస్. కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. 2010 ఏప్రిల్ 6న 75 మంది సీ.ఆర్.పీ.ఎఫ్. బలగాలను మట్టికరిపించిన చారిత్రాత్మకమైన ముకురం దాడిలో చురుకుగా పాల్గొన్నాడు. 2011లో పీ.ఎల్. కమాండర్‌గా 2015లో ప్లాటూన్ పార్టీ కమిటీ కార్యదర్శిగా కూడా బాధ్యతలు చేపట్టాడు. పార్టీ ద్వారా ఇవ్వబడ్డ ఏ పనినైనా ఎటువంటి వూగిసలాట లేకుండా చేపట్టాడు.

కిరందుల్ బస్తీ మధ్యలోనే రోడ్డుపై గస్తీ నిర్వహిస్తున్న పోలీసులపై జరిపిన క్లేమేర్ దాడి అనిల్ నాయకత్వంలోనే జరిగింది. ఇందులో 6గురు పోలీసులు చనిపోయారు. ఇద్దరు పోలీసులు గాయపడ్డారు.

కా. అనిల్ దక్షిణ సబ్ జోన్‌లో జరిగిన అనేక యుద్ధ చర్యల్లో పాల్గొన్నాడు. రాణిబోదిలీ, జీరంఘాటీ, తాడిమెట్ల లాంటి వీరోచిత చారిత్రక ఘటనల్లో పాల్గొన్నాడు. 2007లో జరిపిన ఉర్పల్ మెట్ట యుద్ధ చర్యలో పాల్గొని తన తుపాకిలోని తూటాలు అయిపోయిన వెంటనే గొడ్డలితోనే పోలీసులను చంపి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంలో ముందున్నాడు. కా. అనిల్ పాల్గొన్న ఘటనలు పదుల సంఖ్యలోనే ఉంటాయి. అనేక చర్యల్లో అస్సాల్ట్ పార్టీలో పాల్గొని శత్రువును సంహరించి ఆయుధాలు జప్తు చేసుకోవడంలో ముందుండి పీ.ఎల్.జీ.ఏ.ను సాయుధం చేశాడు. కొన్ని చర్యల్లో స్కౌట్ పార్టీలో ముఖ్య భూమిక నిర్వర్తించాడు.

కా. అనిల్ శత్రువుతో తలపడే యుద్ధంలో శత్రువుపై వర్గ కసితో ధైర్యంగా దూకుడుగా దాడులలో పాల్గొనేవాడు. దర్భ ఏరియాలో శత్రువుపై చేసిన దాడులలో ప్రముఖ పాత్ర పోషించాడు. 2013లో జీరంఘాటీ దాడిలో సల్వాజుడుం నేత, అనేక గ్రామాలను ధ్వంసం చేసిన, ఆదివాసీ ప్రజల ధన, మాన, ప్రాణలను అర్పించిన పరమ కిరాతకుడు మహేంద్రకర్మతో పాటు మరో 30 మంది ప్రజా వ్యతిరేకులను హతం చేసిన ఈ ఘటనలో పాల్గొన్నాడు. 2014లో టాకవాడ లో జరిగిన ఘటనలో కూడా పాల్గొన్నాడు.

యుద్ధ చర్యలు నిర్వహించడానికి ముందు అనేకంగా జరిపిన రెక్కీల్లో దేవాల్ పాల్గొన్నాడు. రెక్కీలో లభ్యమైన వివరాలను బాధ్యుల ముందుంచేవాడు. దానికి సరిపోయే విధంగా ప్లానింగ్ చేయడంలో కూడా అనిల్ పాత్ర వుండేది. పార్టీ క్రమశిక్షణను పాటించడంలో ముందుండేవాడు. రాత్రి, పగలు, అలసటను లెక్క చేయకుండా పని చేయడం కా. అనిల్ అలవాటుగా మార్చుకున్నాడు. ఎంతటి అనారోగ్య సమస్య ఎదురైనా కింద పడిపోయే వరకు కూడా పని చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన ఆదర్శ విప్లవకారుడు.

అనేక మిలిటరీ శిక్షణా క్యాంపుల్లో పాల్గొని మిలిటరీ నిపుణత, మెలకువలు అలవర్చుకున్నాడు. గెరిల్లా యుద్ధ నియమాలు ఖచ్చితంగా పాటించడంలో ముందుండే వాడు. తనకిచ్చిన బాధ్యత నిర్వర్తించడంలో పట్టుదలతో పని చేసేవాడు. తన గురించి ఇతరుల ముందు ప్రదర్శించడం దేవాల్ (అనిల్)కు గిట్టదు. తన వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చేవాడు. ప్రజల్లో ఒకడిగా కల్సిపోతూ కేడర్‌తో కూడ సన్నిహితంగా వుండేవాడు.

దర్భ డివిజన్‌లో 2010 నుండి జరుగుతున్న మెజారిటీ టీ.సీ.ఓ.సీ.ల సఫలతల్లో కా.అనిల్ భూమిక ముఖ్యమైనది. బ్రాహ్మణవాద హిందూ భాజపాకు చెందిన ప్రజా వ్యతిరేకులైన వారిని ఖతం చేయడంలో దేవాల్ భూమిక వుంది. మొత్తంగా దక్షిణ్ సబ్ జోన్‌లో జరిగిన యుద్ధ చర్యల్లో కా. అనిల్ పాల్గొనకుండా వున్నవి చాలా తక్కువ. ఇలాంటి మిలిటరీ అనుభవం కల్గి ఎంతో క్రమశిక్షణ, వినమ్రత కల్గిన కా. అనిల్‌ను కోల్పోవడం వల్ల ఉద్యమానికి జరిగిన నష్టం వెంటనే పూడ్చుకోలేనిదే.

శత్రువు కార్పెట్ సెక్యూరిటీని మరింత విస్తరిస్తూ ఉద్యమ నిర్మూలనకు మిషన్-2017 చేపట్టాడు. నాయకత్వ నిర్మూలనకై శత్రువు దూకుడుగా చేస్తున్న దాడులను ఎదుర్కోవడంలో భాగంగా చేపట్టిన టీ.సీ.ఓ.సీ.లో ఏప్రిల్ 24, 2017వ తేదీన రోడ్డు నిర్మాణ పనుల కోసం రక్షణగా వున్న సీ.ఆర్.పీ.ఎఫ్. బలగాలపై బుర్కపాల్ క్యాంపుకు అతి సమీపంలో చేసిన దాడిలో 25 మంది జవానులు ఖతం అయ్యారు. ఈ దాడిలో కామ్రేడ్ అనిల్ సాహెూసోపేతంగా, అత్యంత ధైర్యసాహసాలతో శత్రువుపై కాల్పులు జరుపుతూ అమరుడయ్యాడు.

రాబోయే సమయంలో కా. అనిల్ అమరత్వం స్ఫూర్తితో జరగబోయే యుద్ధ చర్యల్లో, అనేక సెక్షన్ల ప్రజలు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై జరిపే ప్రజా పోరాటాల్లో కా.అనిల్‌ను చూసుకుందాం. మనం నిర్వహించే యుద్ధ చర్యల ద్వారా, ప్రజ ఉద్యమాల ద్వారా విప్లవానికి మరింతగా పెరుగుతున్న అనుకూల పరిస్థితులను వుపయోగించుకుంటూ మన శక్తుల్ని పెంచుకుందాం. గ్రీన్‌హంట్ ఆపరేషన్ మూడవ దశను మిషన్-2017ను ఓడిద్దాం.

కా. అనిల్ ఆశయ సాధనకై చివరి వరకు పోరాడుదాం. కా. అనిల్ విప్లవ స్ఫూర్తిని, అంకితభావంతో ప్రజల కోసం పని చేయడాన్ని అలవర్చుకుందాం. ★

---

**(31వ పేజీ తరువాయి)**

దామెరకుంట వద్దనే మానేరు నది గోదావరి నదిలో కలుస్తుందని, దీంతో వరద ప్రవాహం అధికంగా ఉండటంతో గతంలోనే దామెరకుంట గ్రామం వరదలతో మునిగిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం అన్నారం బ్యారేజీ నిర్మాణంతో దామెరకుంట పొలాలు, గ్రామం ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తుం చేస్తున్నప్పటికీ అధికారులు ఏకపక్షంగా సర్వే నిర్వహించడం అత్యంత దారుణమని, ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రజల ఆకాంక్షల ప్రకారమే మార్పులు చేర్పులు చేయాలని డిమాండ్ చేస్తూ అధికారులు పాతిన సర్వే రాళ్ళను, కర్రలను తొలగించారు.

గోవిందరావు పేట మండలంలోని చల్వాయి గ్రామంలో పోలీసు బెటాలియన్‌కు, రైతులు తరతరాలుగా జీవనాధారంగా బతుకుతున్న భూములను సేకరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. మండలంలో 2వేల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని, ఆ భూములను పోలీసు బెటాలియన్‌కు సేకరించకుండా రైతుల భూములు లాక్కోవడానికి యత్నించడం దారుణమని, తమ పంట భూములను ఇవ్వమని రైతులు తేల్చిచెబుతూ, భూముల సేకరణను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ, పొలాల్లోనే టెంట్ వేసి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

శాయంపేట మండలంలోని మైలారం గ్రామ శివారులో దేవాదుల సొరంగం పనులను భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. గతంలో మైలారం గ్రామ శివారులో చేపట్టిన సొరంగం పనుల కోసం 18 మంది రైతుల నుంచి మూడెళ్ళలో పనులను పూర్తిచేసి తిరిగి అప్పగిస్తామని భూములను సేకరించారు. అయితే భూములు తీసుకున్న క్రమంలో మార్కెట్ ధర ప్రకారం కాకుండా చాలీచాలని పరిహారం చెల్లించారు. భూములు కోల్పోయి కూలీలుగా మారిన రైతులు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించి, తమ భూములు తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దేవాదుల పనులను అడ్డుకున్నారు.

★

# పోరాట వార్తలు

## భద్రాద్రి కొత్తగూడెం–ఈస్ట్ గోదావరి డివిజన్

### హరిత హార వ్యతిరేక ప్రచారం

మావోయిస్టుల ఎజెండే మా ఎజెండా, దున్నేవానికే భూమి, ప్రతి కుటుంబానికి 3 ఎకరాల భూమి ఇస్తానని వాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చిన టీ. ఆర్.ఎస్. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట మార్చి అభివృద్ధి పేరుతో భారీ ప్రాజెక్టులు, ఓపెన్‌కాస్టుల, పేర పేద ఆదివాసుల భూములు ఆక్రమించుకొని నిర్వాసితులను చేస్తూ మరోవైపు హరిత హారం పేరుతో ఆదివాసుల పోడు భూములలో మొక్కలు నాటుతున్నారు. మరోవైపు ఫారెస్టు అధికారులు వేలకు వేలు లంచాలు గుంజుకుంటున్నారు. ప్రభుత్వ, ఫారెస్టు అధికారుల అవినీతి, అక్రమ నిర్బంధానికి వ్యతిరేకంగా రైతుకూలి సంఘం నాయకత్వాన, మిలీషియా రక్షణలో జె.ఎన్.ఎమ్. పాటలతో గ్రామ గ్రామాన హరిత హార నిర్వాసితానికి వ్యతిరేకంగా బహిరంగ సభలు పెడుతూ ఏరియా వ్యాప్తంగా ప్రచారం చేయడం జరిగింది.

### భూమి సమతలీకరణ

చర్ల– శబరి ఏ.సీ. పరిధిలోని చర్ల ఎల్.ఓ.ఎస్. పరిధిలో పై కమిటీ తీర్మానం వెలుగులో భూమి సమతలీకరణ చేపట్టడం జరిగింది. చర్ల ఏరియా ఆర్.పీ.సీ. గ్రామాలలో 900 మంది ప్రజలు వారం రోజుల పాటు పాల్గొని ఆ గ్రామాలలో ఉన్న పేదలకు 5 ఎకరాల మడులు కట్టించారు. రెండు చిన్న చెరువులు పోశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం తమ తమ ఖర్చులతో వారం రోజుల పాటు రూ॥లు 20,000 విలువ గల పని చేశారు. శబరి ఏరియాలో శత్రువు నిర్బంధం మూలంగా, అరెస్టులు కావడంతో నిర్మాణాలు దెబ్బతిన్న 18 గ్రామాలలో నిర్మాణాలు లేక పోయినా, పార్టీ పిలుపు మేరకు భూమి సమతలీకరణ ప్రోగ్రాం 10 రోజులు, 11వందల మంది పాల్గొని 60 లక్షల విలువ గల బీరాలు, మడులు, చిన్న చిన్న కుంటలు పోసుకున్నారు.

### నక్సల్బరీ మీటింగ్

నక్సల్బరీ 50వ వార్షికోత్సవాల సందర్భంగా డివిజన్ వ్యాప్తంగా ప్రచారం చేయడానికి నాలుగు ప్రచార టీములు ఏర్పాటు చేసి శత్రువు నిర్బంధం మధ్యలోనే పోస్టర్లు, బ్యానర్లు, వేస్తూ గ్రామ, గ్రామాన ప్రచారం చేశారు. జె.ఎన్.ఎమ్. ఆట, పాటలతో ఏరియా వ్యాప్తంగా మిలీషియా, పి.ఎల్.జి.ఎ. రక్షణలో రెండు మీటింగ్‌లు జరిపారు. ఈ మీటింగ్‌లకు 1500 మంది ప్రజలు శత్రువు నిర్బంధాన్ని లెక్క చేయకుండా ఉత్సాహంతో, సాంప్రదాయక ఆయుధాలు (గోడ్డలి, విల్లు కాడి, గోర్కా కత్తులు)లతో పాల్గొనారు. అలాగే దక్షిణ్ బస్తర్– తెలంగాణ జాయింట్ కమాండ్ ఆధ్వర్యంలో జరిగిన భారీ బహిరంగ సభకు డివిజన్ నుండి 2000 మంది తరలి వచ్చారు.

### నిర్బంధ రిపోర్ట్

చర్ల– శబరి ఏ.సీ. పరిధిలో శత్రువు తలపెట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ దాడి, మిషన్– 2017లో భాగంగా ఏరియా వ్యాప్తంగా తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తూ, సాధారణ ప్రజల నుండి, కమిటీ, సంఘ సభ్యుల వరకు అరెస్టులు చేస్తున్నాడు. చిత్రహింసలు పెడుతూ జైల్లో పెట్టడం లేదా, వదిలి పెడుతూ కండిషన్ పేరుతో రోజు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయడానికి రావాలని, ప్రతి రోజు ప్రతి గ్రామం నుండి నలుగురు, ఐదుగురు యువకులు స్టేషన్‌కు వచ్చేలా చేస్తూ, వారి నుండి దళం, సంఘ నాయకత్వం సమాచారం సేకరిస్తూ గ్రామాలపై దాడులు చేస్తున్నారు. ఇలా ప్రజలను యువతీ, యువకులను తీవ్రంగా హింసిస్తూ, శరీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. శత్రువు నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు శత్రువు భౌతిక దాడులను లెక్క చేయకుండా పోరాడుతూ అరెస్టు చేసిన వారిని విడిపించుకుంటున్నారు. నిర్బంధ బాధితులకు రైతుకూలీ సంఘం కార్యకర్తలు గ్రామాలలో చందాలు వసులు చేస్తూ ఖైదీల విడుదలకై ప్రయత్నాలు చేస్తున్నారు.

### ఇన్‌ఫార్మర్లకు దేహశుద్ధి

పోలీసులకు సమాచారం అందిస్తూ, కూంబింగ్ బ్యాచీలకు రూటర్లుగా పని చేస్తున్న కొత్తపల్లి, కట్టేపాడు, బోదనెల్లి, బుర్గుంపాడు, కొరుకోడ్‌పాడు, గ్రామాలలోని ఇన్‌ఫార్మర్లను ప్రజల సమక్షంలో విచారించి కొందరికి దేహశుద్ధి చేసి, కొందరిని హెచ్చరించి ప్రజల అభిప్రాయం మేరకు వదిలి వేయడం జరిగింది.

## జయశంకర్–మహబూబాబాద్–వరంగల్–పెద్దపల్లిడివిజన్



### భూసేకరణకు వ్యతిరేకంగా కదులుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగం

జయశంకర్ జిల్లా కాటారం మండలంలోని దామెరకుంట శివారులో అన్నారం బ్యారేజీకి సంబంధించిన కరకట్టల నిర్మాణం కోసం నిర్వహిస్తున్న సర్వే పనులను రైతులు భూ పరిరక్షణ కమిటీ నాయకత్వంలో అడ్డుకొన్నారు. కాంట్రాక్టు నిర్వాహకులు తమ సిబ్బందితో సర్వే చేయించి నాటిన రాళ్లను, పాతిన జెండా కర్రలను తొలగించారు.

(మిగతాది 30వ పేజీలో)

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## సెంట్రల్ రీజినల్ బ్యూరో

నక్సల్బరీ పోరాటం భారతదేశంలో నూతన చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించింది. కామ్రేడ్ చారుమజుందార్ ఆయన అనుచరులు నక్సల్బరీ రైతాంగాన్ని మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంత రాజకీయాలతో విప్లవకరీంచడంతో రైతాంగం సాయుధ పోరాటాన్ని ప్రారంభించింది. నక్సల్బరీ పోరాటాన్ని చరిత్రలో ఒక మూల మలుపుగా ఎందుకు చెబుతామంటే, ఈ పోరాటం భారతదేశంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను ముందుకు తెచ్చింది. దశాబ్దాలుగా వేళ్లూనికొని ఉన్న రివిజనిజాన్ని, సంస్కరణవాదాన్ని బద్దలు కొట్టి సాయుధ పోరాట పంథాను దేశ ప్రజల ముందుంచింది. గాంధీయిజం, రివిజనిజంతో విసిగి వేసారి ఉన్న భారత ప్రజలు నక్సల్బరీ శంఖారావంతో విప్లవోద్యమ పోరాటంలో కదం తొక్కారు. కార్మికులు, రైతాంగం, ఆదివాసులు, విద్యార్థులు, మేధావులు ఉద్యమబాట పట్టారు. ఉద్యమం దేశవ్యాప్తంగా వెల్లువగా మారింది. నక్సల్బరీ పోరాట ప్రభావం దేశంలోనే కాకుండా దక్షిణాసియా దేశాలైన బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలపై ప్రభావం వేయడమే గాక, జపాన్ మొదలు ఆస్ట్రేలియా దేశాలలో కార్మిక వర్గాన్ని ఉత్తేజపరిచింది. మలయా, బర్మా, ఇండోనేషియా, కంపూచియా దేశాల్లో సాగుతున్న సాయుధ పోరాటాలకు ఉత్తేజాన్ని అందించింది.

నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాల వెనువెంటనే దేశంలో నూతనంగా విప్లవ పార్టీ అయిన భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) ఏర్పడింది. ఈ పార్టీ దేశ వ్యాప్త ఉద్యమానికి నాయకత్వం వహించింది. ఒక పార్టీకి నిజమైన బలం ఎక్కడి నుండి వస్తుంది. ఆ పార్టీ అవలంబించే సిద్ధాంతం నుండే దానికి బలం లభిస్తుంది. నూతన పార్టీ భారత రాజకీయాల్లో రివిజనిజాన్ని బద్దలు కొట్టి మార్క్సిజం - లెనినిజం - మావోయిజం అనే సిద్ధాంత వెలుగులో తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగించింది. ఒక మొక్క వృక్షంగా మారి పుష్పించి ఫలాలను ఇస్తుంది. మొక్క వృక్షంగా అభివృద్ధి చెందడం అనే ప్రక్రియను ఆచరణగా చూస్తే, ఫలాన్ని సిద్ధాంతంగా చెప్పుకోవచ్చు. లెనిన్ మార్క్సిజం అందులో భాగమైన కార్మికవర్గ నియంతృత్వం గురించి ఇలా చెప్పాడు. "రెండు వేల సంవత్సరాలకు పైగా మానవ ఆలోచనల, సంస్కృతిలో లభించిన విలువల ఆధారంగా బూర్జువా చారిత్రక దశనుండి లభించిన విలువైన విజయాలను తృణీకరించడం కాకుండా వాటిని తనలో కలుపుకోవడమే గాక వాటికి మెరుగులు దిద్దింది. కేవలం ఈ ప్రాతిపదిక మీద అదే మార్గంలో పనిచేసింది. దోపిడీని ఈ భూభాగం మీద పూర్తిగా నిర్మూలించడానికి ఆచరణ యుక్తమైన శ్రామికవర్గ నియంతృత్వాన్ని చేపట్టింది. అందుకే మార్క్సిజం విప్లవకర కార్మికవర్గ సిద్ధాంతంగా చారిత్రక ప్రాముఖ్యతను సంతరించుకుంది." అందుకే మార్క్సిజం విశ్వ జనీనీయమైన సిద్ధాంతం. అదే సిద్ధాంతం లెనిన్, మావో కాలం నాటికి మార్క్సిజం- లెనినిజం - మావోయిజంగా అభివృద్ధి చెందింది. మార్క్సిజం పిడివాదం కాదు. ఆచరణకు మార్గదర్శి అని అంటారు.

ఈ సజీవ సిద్ధాంతంపైన నక్సల్బరీ సాగింది కనుకనే దానికి మరణం లేకుండా గత 50 ఏళ్ళుగా దేశంలో విప్లవ ప్రజానీకానికి విప్లవ నావకు చుక్కానిగా పని చేయడమే గాక, భారతదేశంలో విప్లవం పరిపూర్తి కావడానికి గ్యారంటీనిస్తున్నది. నక్సల్బరీకి మరో ప్రత్యామ్నాయం లేదు. నక్సల్బరీ మార్గమే భారత విప్లవానికి నిజమైన విముక్తి మార్గమని గత యాభై ఏళ్ళ అనుభవం మరింత స్పష్టంగా రుజువు చేస్తూనే ఉంది.

నక్సల్బరీ పోరాటం అనేక ఓటములు ఎదర్కొంటూనే విజయం వైపు పురోగమిస్తుందని, దానికి ఎన్నటికీ మరణం లేదని నక్సల్బరీ నిర్మాత కా. చారుమజుందార్ ఆ రోజే చెప్పాడు. ఒక ఉద్యమం ఎప్పుడు సూటిగా సరళ రేఖలో సాగదు. అనేక ఆటు పోట్ల గుండా ఉద్యమాలు ప్రయాణిస్తాయి. ప్రజలు చేసే ఏ ఉద్యమాలకైనా ఈ సామాజిక సూత్రం వర్తిస్తుంది. బూర్జువాల నాయకత్వంలో జరిగిన పోరాటాలకు కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. మన దేశంలో బ్రిటిష్ వలస వాదానికి వ్యతిరేకంగా జరిగిన భారత ఉద్యమంలో కూడా ఈ ఉదాహరణలు చూడవచ్చు. కాబట్టి కొన్ని ఓటముల ద్వారానే విప్లవోద్యమం ఓడిపోయిందని గాని, విప్లవ పంథా పనికి రాదని గాని భావించడం అంటే సామాజిక సిద్ధాంతంపై ఓనమాలు కూడ తెలియవని అనుకోవాలి.

మార్క్సిజం - లెనినిజం - మావోయిజం అనే అజేయమైన సిద్ధాంత గైడెన్స్‌లో మా పార్టీ రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తున్నది. దేశవ్యాప్త పార్టీగా రూపు దిద్దుకొంది. అయితే ఎత్తుగడల పరమైన కొన్ని లోపాల వల్ల ఉద్యమం 1972 నాటికి సెట్‌బ్యాక్‌ను ఎదుర్కొన్నది. ఈ సెట్‌బ్యాక్‌ను చూసిన పాలకవర్గాలు దాని వందిమాగదులు విప్లవ పార్టీ అదో పాతాళంలోకి పడి పోయిందని భావించారు. కాని 1978 నాటికి పార్టీ మళ్లీ ఫీనిక్స్ పక్షిలాగా రెట్టింపు బలంతో ముందుకు వచ్చింది. ఇలా గత 50 ఏళ్ళలో ఉద్యమం వంకర, టింకర మార్గంలో, గెలుపు ఓటముల మధ్య నిలకడగా ముందుకు సాగుతున్నది. పార్టీ అనుసరిస్తున్న పంథా సరియైనదేనని ఆచరణలో రుజువు చేస్తూ ముందుకు సాగుతున్నది.

అయితే నక్సల్బరీ నాటి పరిస్థితులు ఇప్పుడు లేవని, దేశంలో సామాజిక, ఉత్పత్తి సంబంధాల్లో మౌలికమైన మార్పులు జరిగాయని, దేశంలో అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సంబంధాల స్థానంలో దేశ వ్యాప్తంగా పెట్టుబడిదారీ సంబంధాలు వచ్చేశాయని, దానికి అనుగుణంగా పార్టీ పంథాలో కూడా మార్పు రావాలని; దీర్ఘకాలిక సాయుధ పోరాట పంథాను పార్టీ మార్చుకోవాలంటూ కొంత మంది వాదనలు ముందుకు తెస్తున్నారు. అలాగే చైనా విప్లవం నాటి పరిస్థితులు భారతదేశంలో లేవని, చైనా అనుసరించిన పంథా భారత విప్లవంలో పనికిరాదని మరికొంత మంది వాదిస్తున్నారు. మా పార్టీ భారతదేశంలో

అర్ధ భూస్వామ్య- అర్ధ వలస వ్యవస్థ ఉనికిలో ఉందని, భారత ప్రజలపై సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, బడా భూస్వామ్యం అనే మూడు పర్వతాలు పెను భారంగా ఉన్నాయని, వీటిని కూకటి వేళ్ళతో సహా పెకిలించి వేయకుండా భారత ప్రజలకు విముక్తి లేదని భావిస్తున్నది. అయితే భారతదేశంలో ముఖ్యంగా హరిత విప్లవం వలన కొన్ని ప్రాంతాల్లో ఉత్పత్తి సంబంధాల్లో "వక్రీకరించబడిన పెట్టుబడిదారీ సంబంధాలు" ఉనికిలోకి వచ్చాయని, తక్కిన విశాల భారతదేశంలో పాత వ్యవస్థలో పెద్దగా మార్పులు జరగలేదని మా పార్టీ నిర్వహించిన సామాజిక పరిశోధనలో వెల్లడించాం. అయితే బారతదేశంలో అర్ధ భూస్వామ్య - అర్ధ వలస సంబంధాలు, సామ్రాజ్యవాద జోక్యం వల్లనే అసమానమైన అభివృద్ధి ఉంటుందనేది వాస్తవమైన విషయం. కాబట్టి మా పార్టీ మౌలిక పంథాను మార్చుకోవల్సిన అవసరం లేదు.

చైనాలో విప్లవం అభివృద్ధి చెందిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను భారతదేశ నిర్దిష్ట పరిస్థితుల్లో అన్వయించి మా పార్టీ ఈ యాభై ఏళ్ళలో అనేక విజయాలు సాధించింది. విశాలమైన వెనకబడిన గ్రామీణ ప్రాంతాల్లో బేస్ ఏరియాలు నిర్మించే లక్ష్యంతో పనిచేస్తూ పార్టీ అనేక అనుభవాలను సంపాధించింది. దేశవ్యాప్తంగా ఎర్ర ప్రతిఘటన ప్రాంతాలు, గెరిల్లా జోన్‌లు, గెరిల్లా బేస్‌ల నిర్మాణం ద్వారా బేస్ ఏరియాలను ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నది. బలమైన పీ.ఎల్.జీ.ఏ. వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న 'ప్రజల అధికార సంస్థల'కు అండగా, ప్రభుత్వ బలగాలకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాన్ని కొనసాగిస్తున్నది. ప్రజా ఉద్యమాల్లో ప్రజలను సమీకరిస్తూ ప్రజా సంఘాలను పటిష్టం చేస్తున్నది.

పార్టీ సాధించిన ఈ విజయాలను లోతుగా అధ్యయనం చేయకుండానే, వారికి పై పైన కనబడే విషయాలనే పరమసత్యంగా భావించి అభిప్రాయాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పార్టీనీ, విప్లవ బలాన్ని దాని సంఖ్య బలంపైన గాని, అది తాత్కాలికంగా ఎదుర్కొనే ప్రతికూలతలపై ఆధారపడి అంచనావేయకూడదు. శత్రువుతో పోలిస్తే, విప్లవం విజయవంతం అయ్యే రోజు వరకు పార్టీ విప్లవ బలం చాల తక్కువగా ఉంటుంది. రష్యా, చైనా విప్లవాలలో కూడా ఈ వాస్తవాన్ని చూడవచ్చు. భారత పాలకవర్గాలకు ఉన్న శక్తిని అజేయంగా ఊహించుకునే వారు, ఆ శక్తిని ఎదుర్కొంటూ విప్లవోద్యమం గత యాభై ఏళ్ళుగా నిలదొక్కుకోవడాన్ని ఎందుకు స్వీకరించలేకపోతున్నారు. అలాంటి వారు పరమ సత్యాన్ని దర్శించలేక పోవడమే ప్రధాన కారణం కాదా! కాబట్టి మా ఉద్యమాన్ని లోతుగా అధ్యయనం చేయాలని మిత్రులను కోరుతున్నాము.

నేడ భారతదేశంలో పార్లమెంటరీ రాజకీయాలపై ప్రజలకు భ్రమలు త్వరత్వరగా తొలగిపోతున్నాయి. అవి పాలకవర్గాలకు దోపిడీ సాధనాలుగా మారిపోయాయని ప్రజలు భావిస్తున్నారు. గత యాభై ఏళ్ళలో దేశంలో సంపద ఎన్నడూ లేని విధంగా దోపిడీదారుల కైవసం అవుతున్నది. దీని వలన రైతాంగం ఆత్మహత్యలు, నిరుద్యోగం, దారిద్ర్యం, విస్థాపన సమస్యలు, కుల వివక్ష, అందని ద్రాక్షపండులా తయారైన విద్య, అందుబాటులో లేని వైద్యం వలన ప్రజలు ఎన్నడూ లేని స్థాయిలో ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ పరిస్థితుల వలన ఎన్నడూలేని స్థాయిలో విప్లవకర పరిస్థితులు దేశంలో నెలకొని ఉన్నాయి. దేశం మండుతున్న అగ్ని గోళంలో తయారైంది. ఈ పరిస్థితుల్లో మావోయిస్టులు అగ్నికి ఆజ్యం పోసేలా తమ పాత్ర నిర్వహిస్తారని, తద్వారా తమ అధికారానికి ముప్పు పొంచి ఉందని భావించే ఈ ప్రభుత్వాలు గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరిట మా పార్టీపై ముప్పేట దాడిని కొనసాగిస్తున్నాయి. ఈ దాడిని అన్ని పార్లమెంటరీ పార్టీలు సమర్ధిస్తున్నాయి. గత 8సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ పాశవికమైన గ్రీన్‌హంట్ దాడిని, అత్యంత ధైర్య సాహసాలతో మా పార్టీ, విప్లవ ప్రజానీకం ఎదుర్కొంటూనే వుంది.

ప్రపంచంలో సోషలిస్టు దేశాలు పెట్టుబడిదారీ దేశాలుగా మారిపోవడంతో మార్క్సిజం ఓడిపోయింది అంటూ పెట్టుబడిదారీ సిద్ధాంతకారులు ఆధునికాంతర సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. ఈ సిద్ధాంత ప్రభావం మన దేశంలో కూడా ఉంది. ఈ సిద్ధాంతం ఏ సెక్షన్‌కు, ఆ సెక్షనే పోరాడి అధికారాన్ని సంపాదించుకోవాలని చెబుతూ పీడిత ప్రజలను విడదీసి ఐక్య శత్రువుకు వ్యతిరేకంగా పోరాడకుండా చేస్తుంది. ఈ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడకుండా విప్లవోద్యమాన్ని ముందుకు నడిపించలేము. కులం పేరిట కొంత మంది సిద్ధాంతకారులు విప్లవోద్యమంపై దాడులు చేస్తూనే ఉన్నారు. వీరు వాస్తవంగా దళితులకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చలేకపోతున్నారు. పార్లమెంటరీ ఎన్నికల ద్వారా దళితులకు రాజ్యాధికారం సాధించగలమని చెప్పే నీతులన్ని ఆచరణలో విఫలమై పోయాయి. మా పార్టీ మొదటి నుంచి అట్టడుగు వర్గాలైన దళితుల హక్కుల గురించి పోరాడడమే గాక వారితో జీవిస్తున్నది. మా పార్టీ ఆచరణలో దళితుల కోసమే పోరాడినప్పటికీ సిద్ధాంత పరంగా ఒకప్పుడు కుల సమస్యను ఉపరితల సమస్యగా భావించిన మేం, దాన్ని పునాది సమస్యగా గుర్తించాం. దళితుల విముక్తి కోసం జరిగే పోరాటంలో మా అవగాహనను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవడం జరుగుతున్నది. దేశంలో పార్లమెంటరీ మార్గం ద్వారా దళితుల విముక్తి సాధ్యం కాదు. నక్సల్బరీ చూపిన మార్గంలోనే దేశంలో పీడిత ప్రజల్లో భాగంగా దళితుల విముక్తి జరుగుతుంది. అయితే కుల నిర్మూలనకు, హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా కలిసి వచ్చే అన్ని శక్తులతో కలిసి పోరాడడానికి మా పార్టీ సిద్ధంగా ఉంది.

గత యాభై ఏళ్ళలో వేలాది మంది విప్లవకారులు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా భారత విప్లవోద్యమంలో అర్పించారు. వారి త్యాగ ఫలితంగానే నక్సల్బరీ జ్వాజ్వాల మానంగా ప్రకాశిస్తుంది. జులై 28 మా పార్టీ ఈ అమరులను సంస్మరించుకొనే పవిత్రమైన దినం. సుదీర్ఘమైన ఈ కఠినమైన బాటలో వారిని స్మరించుకుంటు ముందుకు సాగుతామని శపథం చేద్దాం.

ప్రతాప్
అధికార ప్రతినిధి,
సి.పి.ఐ. (మావోయిస్టు)
సెంట్రల్ రీజినల్ బ్యూరో (సి.ఆర్.బి)

జూలై, 2017

(చివరి పేజీ తరువాయి)

ఇంటర్నేషనల్‌లో రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రష్యా విప్లవాచరణకు లెనిన్ మార్క్సిజాన్ని సృజనాత్మకంగా అన్వయించాడు. పరిరక్షించాడు. మరో దశకు మార్క్సిజం-లెనినిజం అనే ఉన్నత దశకు అభివృద్ధి జరిగింది.

సామ్రాజ్యవాద, సోషలిస్టు విప్లవ యుగం ఆవిర్భవిస్తున్న కాలంలో మార్క్సిస్టు మహోపాధ్యాయులైన లెనిన్, స్టాలిన్‌లు మార్క్స్, ఎంగెల్స్‌ల విప్లవ వారసత్వాన్ని కొనసాగించారు. రష్యా విప్లవోద్యమంలోని తప్పుడు ధోరణులకు (నరోడ్నికులు, అర్థికవాదులు, సోషల్ రివల్యూషనరీలు, మెన్షివిక్‌లు, ట్రాట్స్కీవాదులు, బుఖారిన్ వాదులు, జాతీయవాదులు మొదలైన పెటీ బూర్జువా పార్టీలకు) వ్యతిరేకంగా సాగిన పోరాటాల పరంపర ద్వారా లెనినిస్టు పార్టీకి గట్టి పునాదులు పడ్డాయి. స్వేచ్ఛా వ్యాపార దశలో ఉన్న పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదమనే ఒక నూతన దశకు అభివృద్ధి అయ్యింది. కా. లెనిన్ సామ్రాజ్యవాదాన్ని "మరణా వ్యవస్థలో ఉన్న పెట్టుబడిదారీ విధానం" అని పేర్కొన్నాడు.

కా. లెనిన్ సామ్రాజ్యవాదపు ప్రత్యేక లక్షణాల నిర్దిష్ట రూపాలను, నియమాలను అధ్యయనం చేసి ఈ ముఖ్యమైన నిర్ధారణకు వచ్చాడు. "అసమాన ఆర్థిక రాజకీయ అభివృద్ధి కాకుండా సామ్రాజ్యవాదాన్ని దాని బలహీనమైన లింకు దగ్గర ధ్వంసం చేయాలి". కార్మికవర్గ విప్లవం మొదట ఒక దేశంలో లేదా అనేక దేశాలలో విజయవంతమవుతుంది" మొదట ప్రపంచ యుద్ధ కాలంలో సామ్రాజ్యవాదంలోని సకల వైరుధ్యాలకు రష్యా ఒక కేంద్ర స్థానంగా ఉంది. అందుచేత లెనిన్ సామ్రాజ్యవాదుల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చి, విప్లవ హింసతో రష్యన్ బూర్జువా వర్గ నియంతృత్వాన్ని కూలదోయడానికి రష్యన్ కార్మికవర్గానికి నాయకత్వం వహించాడు. ఇలా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో పెంపొందిన విప్లవోద్యుతిని వినియోగించుకొని కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని సమీకరించి సంఘటిత పరిచి రష్యాలో మహత్తర సోషలిస్టు అక్టోబర్ విప్లవాన్ని విజయవంతం చేసి కార్మికవర్గ నియంతృత్వం క్రింద ప్రపంచంలోనే మొట్టమొదటి సోషలిస్టు దేశాన్ని నెలకొల్పారు.

### ఇస్క్రా పత్రికను ప్రారంభించాడు.

రష్యాలో విప్లవోద్యమ కాలంలో లెనిన్ మార్క్సిస్టు పార్టీ నిర్మాణానికి అంటే కార్మికవర్గ పార్టీ నిర్మాణానికి చేసిన పథకం రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఏర్పాటు కావడానికి దారి తీసింది. దానిని నీరు కార్చడానికి అర్థికవాదులు అనుసరించిన అర్థిక విధానాలను ఆయన ఇస్క్రా పత్రిక ద్వారా పోరాడి ఓడించారు. అందుకు మార్క్సిస్టు పార్టీ సిద్ధాంత పునాదులు వివరించే "ఏం చేయాలి"? అనే గ్రంథం రచించాడు.

### బోల్షివిక్ పార్టీ ఏర్పాటు

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ రెండవ కాంగ్రెసులో పార్టీ నిర్మాణం విషయంలో విభేధాలు వచ్చాయి. పార్టీ కార్యక్రమాన్ని, నిబంధనలను ఆమోదించే విషయంలో వచ్చిన విభేధాలు ఇవి. ఆమోదించే వాళ్ల సంఖ్య ఎక్కువ (మెజార్టీ) ఉన్న వాళ్ళను బోల్షివిక్కులని, తక్కువ (మైనార్టీ) ఉన్న వాళ్ళను మెన్షివిక్కులని పిలిచారు. మెజార్టీగా ఉన్న బోల్షివిక్‌ల విప్లవ పంథా రష్యా విప్లవ కాలమంతా రుజువైన తరువాత సరియైన పంథా, కార్మికవర్గ పంథా, విప్లవ పంథా అంటే బోల్షివిక్ పంథా అనే మాట స్థిరపడి పోయింది. బోల్షివిజం, బోల్షివిక్ పార్టీ విప్లవానికి, విప్లవ పార్టీకి పర్యాయ పదమైపోయాయి.

### సోవియట్ రష్యాలో -కార్మికవర్గ నియంతృత్వం

రష్యాలో ఏర్పడిన కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటిత పరుచుకుంటూ, ఆ దేశాన్ని ప్రపంచ విప్లవ స్థావర ప్రాంతంగా వినియోగించుకొని తక్కిన ప్రపంచమంతటా వ్యాపించి ఉన్న సామ్రాజ్యవాద నిర్మూలనని వేగిరపరచాలని కా. లెనిన్, కా. స్టాలిన్‌లు స్పష్టీకరించారు. అందువల్లనే వారు సామ్రాజ్య యుగంలో ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాలలో జరిగే జాతీయ ప్రజాస్వామిక, సోషలిస్టు విప్లవాలన్నీ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అనివార్యమైన భాగాలే అనే దృక్పథాన్ని వెల్లడించారు. ఒక దేశంలో విప్లవం విజయవంతం అయితే స్వయం సంపూర్ణం కాదు, దాని అంతిమ విజయం ప్రపంచ సోషలిస్టు విప్లవం పూర్తి కావడంపై ఆధారపడి ఉంటుందనేది కూడా వారు స్పష్టపర్చారు.

### "యుద్ధకాల కమ్యూనిజం" విధానాన్ని అమలు చేసింది.

లెనిన్, స్టాలిన్‌ల నాయకత్వంలోని సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) (సి.పి.ఎస్.యు.(బి)) 'యుద్ధకాల కమ్యూనిజం" విధానాన్ని సరిగా అమలు జరిపింది. సాపేక్షికంగా వెనుకబడిన ఒక దేశంలో సోషలిజాన్ని నిర్మించే క్రమాన్ని ప్రారంభించింది. సామ్రాజ్యవాద (రెండవ ప్రపంచ) యుద్ధంలో స్టాలిన్ నాయకత్వంలో అది సరైన ఎత్తుగడలను అనుసరించి యుద్ధాన్ని కార్మికవర్గానికి అనుకూలంగా ఉపయోగించుకుంది. వలసలు, అర్థ వలసలలోని జాతీయ విముక్తి పోరాటం వెల్లువకు మార్గదర్శకత్వాన్ని అందించింది. ఆ దేశాలకు అనువైన వ్యూహం-ఎత్తుగడలను రూపొందించింది. పలు దేశాలలో అది విజయాన్ని తద్వారా (చైనా విప్లవం విజయవంతం అయింది) మానవాళిలో మూడవ వంతుతో సోషలిస్టు శిబిరాన్ని ఏర్పాటు చేసింది. మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం ముందడుగు వేసి చారిత్రాత్మకమైన పురోగతిని సాధించింది.

### లెనినిజం ప్రధాన లక్షణాలు

కా. లెనిన్ మరణానంతరం వెంటనే స్టాలిన్ మార్క్సిజానికి లెనిన్ చేసిన ప్రధానమైన చేర్పులను క్రోడీకరించారు. లెనినిజపు చారిత్రక మూలాలను పరిశోధించి, పద్ధతి, సిద్ధాంతం, పార్టీ, కార్మికవర్గ నియంతృత్వం, రైతు సమస్య, జాతుల సమస్య, వ్యూహం-ఎత్తుగడలు, పార్టీ పని శైలులకు సంబంధించిన లెనినిజం ప్రధాన లక్షణాలను వివరించారు.

### సోషలిజమే ప్రత్యామ్నాయమని ఎలుగెత్తి చాటుదాం

మానవ జాతి మహాద్భుత ఘట్టం బోల్షివిక్ విప్లవం. చరిత్ర గతిని మార్చేసిన అనేక తిరుగుబాట్లలో రక్తతర్పణ చేసిన కష్టజీవులు మొట్ట మొదటిసారి తమ విముక్తి కోసం చేసిన విప్లవం అది. అందుకే తొట్టతొలి

కార్మికవర్గ విప్లవమది. అంతకు ముందు ప్యారిస్ కమ్యూన్ అనుభవమున్నప్పటికీ, రష్యా కార్మికవర్గం విప్లవాన్ని విజయవంతం చేయడమే గాక విప్లవకర నియంతృత్వాన్ని అమలు చేసింది. 100 సం॥రాల తర్వాత కూడా ప్రతి తరం కాల్పనికావేశానికి గురయ్యే చారిత్రక అనుభవం ఇది.

కమ్యూనిజంలోకి వెళ్లడానికి సోషలిజం ఒక మధ్యంతర దశ. ఆ దశ ముగిసే వరకు వర్గాలు ఉంటాయి. వర్గాలు ఉన్నంత కాలం వర్గ పోరాటం జరగాల్సిందే అని కా. మావో ఆలోచనకు ఆచరణ రూపమే చైనా సాంస్కృతిక విప్లవం. విప్లవ రాజ్యాధికారం పెట్టుబడిదారీ శక్తుల (గ్లోబలైజేషన్) బారిన పడుతుంటే (రష్యా, చైనా దేశాలలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరగడం) తిరిగి వర్గ పోరాటం ద్వారా చైనా కార్మికవర్గం తన అధికారాన్ని నిలబెట్టడానికి చేసిన రెండవ రాజకీయ విప్లవమే సాంస్కృతిక విప్లవం. అది కేవలం రాజకీయాధికారం కోసమే గాక విప్లవం తర్వాత కూడా అన్ని జీవన రంగాల్లో పాతుకపోయిన భూస్వామ్య విలువలను, విధానాలను, కొత్తగా పెచ్చరిల్లుతున్న పెట్టుబడిదారీ శక్తులను వాటికి రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలోని రివిజనిస్టులను ధ్వంసం చేయడానికి సాగిన సాంస్కృతిక భావజాల విప్లవం కూడా. అది నూతన మానవులను ఆవిష్కరించిన ప్రక్రియ.

కృశ్చేవ్ నాయకత్వంలో సోవియట్ కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన వర్గ సామరస్య విధానానికి వ్యతిరేకంగా కా. మావో నాయకత్వంలో పదేళ్ల పాటు గ్రేట్ డిబేట్ జరిగింది. ఈ ప్రేరణతో ప్రపంచ వ్యాప్తంగా 80 మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలు ఏర్పడ్డాయి. ఆ తర్వాత చైనాలో శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం (1966) ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే మన భారతదేశంలో రివిజనిజాన్ని ఓడిస్తూ 1967 మే 23న నక్సల్బరీ ప్రజ్వలనం భారత విప్లవోద్యమ పంథాను అందించింది. ఆ వర్గ పోరాట మార్గంలోనే భారత దేశ ప్రజలు నూతన ప్రజాస్వామిక విప్లవంలో కొనసాగుతున్నారు.

**నక్సల్బరీ పోరాటానికి - 50 వసంతాలు**

నక్సల్బరీ పోరాటం ప్రారంభమై 50 సంవత్సరాలు గడిచాయి. ఈ కాలమంతటా పార్టీ అనేక సంపద్వంతమైన అనుభవాలను గడించింది. విప్లవ గమనంలో నక్సల్బరీ పోరాటం సామ్రాజ్యవాదానికి, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా వ్యవసాయ విప్లవ పోరాటం ముందుకు సాగుతుంది. నక్సల్బరీలో చిన్న నిప్పురవ్వ ఎగిసిన ఉద్యమం.ఈ 50 సంవత్సరాల కాలంలో ఎంతో ఎత్తుకు ఎదిగింది. వ్యవసాయ విప్లవం కేంద్రంగా సాయుధ విప్లవ పోరాటాలను దేశవ్యాప్తంగా విస్తరింపజేసింది. దేశంలోని వెనుకబడిన ప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో పార్టీ వర్గ పోరాటాలను తీవ్రతరం చేస్తూ ఎర్ర ప్రతిఘటన ప్రాంతాలను, గెరిల్లా జోన్స్, గెరిల్లా బేస్‌ల నిర్మాణం చేస్తూ విముక్తి ప్రాంతాల ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. దేశంలో మన పార్టీ నాయకత్వం ఈ పోరాటాలకు కేంద్ర బిందువుగా మారుతున్నది.

ప్రస్తుత ప్రపంచంలో సోషలిస్టు, ప్రజాస్వామ్య దేశాల కూటమి లేకపోవడమే గాక చైనా కూడా సామ్రాజ్యవాద దేశంగా అవతరించిన సమయంలో, మన దేశంలో నక్సల్బరీ నుండి (50 వసంతాలు) కొనసాగుతున్న విప్లవ యుద్ధం ప్రపంచ విప్లవానికి ఆశాజనకంగా ముందుకు వచ్చింది. సమకాలిన ప్రపంచ పరిస్థితుల్లో భారత విప్లవం ప్రపంచ విప్లవ కేంద్రం ఏర్పాటుకు మంచి ప్రేరణగా మారింది. తీవ్రమైన (ప్రపంచీకరణ మూలంగా, ఆర్థిక సంక్షోభం) ఆర్థిక, ద్రవ్య సంక్షోభంలో కూరుకుపోయిన సామ్రాజ్యవాదాన్ని, దాని తొత్తులను ఈ భూ ప్రపంచం పై నుండి పెకిలించివేయడానికి నేడు అనన్య త్యాగాలతో ముందుకు సాగుతున్న భారత విప్లవం, గతంలో రష్యా, చైనా విప్లవం లాగానే ప్రపంచ సోషలిస్టు విప్లవానికి ఒక లివర్‌గా పని చేస్తుంది. 50 వసంతాల నక్సల్బరీ పోరాట జెండా దేశంలో ఎగురుతూ, పురోగమిస్తూ భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం గావడానికి కృషిని కొనసాగిస్తుంది.

★

---

**(17వ పేజీ తరువాయి)**

కూలీనే అందిస్తున్నారు. మరో పని చేయలేక తక్కువ కూలీతోనే పనులు చేస్తూ అర్థ ఆకలితోనే నేత కార్మికులు జీవిస్తున్నారు.

**చేనేత కార్మికుల డిమాండ్స్**

1. నేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. వెంటనే ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలి. 8 గంటల పని విధానం అమలు చేయాలి. కూలీ గిట్టుబాటు అయ్యేలా నిర్ణయించాలి. కనీసం 18 వేల రూ॥లు ఉండాలి.

(2) యజమాని, అసామి, కార్మికుడు మూడంచెల విధానంగా నేత పరిశ్రమ నడుస్తుంది. ఇది పూర్తిగా దళారీ వ్యవస్థ. దాని స్థానంలో కార్మికులకు నేరుగా మేలు జరగాలి. అందుకు పరిష్కారం "కార్మిక సహకార సంఘాల"ను స్థాపించి వారికే నేరుగా అన్ని రకాల సహాయం అందించాలి. తద్వారా కార్మికులకు బతుకుపై నమ్మకం ఏర్పడే పని కల్పించాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల దుస్థితిని దృష్టిలో పెట్టుకొని పరిష్కరించవలసిన అవసరం ఉంది. చేనేత బట్టకు గిట్టుబాటు ధర కల్పించడం, చేనేత కార్మికులకు భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. అందుకని చేనేత కార్మికులు ఐక్యంగా పోరాడవలసిన కర్తవ్యం ఉంది. 100 సం॥రాల రష్యా సోషలిస్టు విప్లవం సందర్భంగా, ఆ స్ఫూర్తితో పోరాడడం చేనేత కార్మికుల ముందు ఉన్న తక్షణ కర్తవ్యం.

★

# 100 సం॥రాల బోల్షివిక్ విప్లవానికి జేజేలు పలుకుదాం

## ప్రపంచ మానవాళి విముక్తికి సోషలిస్టు విప్లవమే మార్గం

ప్రపంచ చరిత్రలో వివిధ సమాజాల్లో, వివిధ దశలలో ఆయా కాలాల నాటికి దోపిడీ అణిచివేతలను, పీడనా, వివక్షతలను రూపుమాపి మానవీయమైన సమాజాన్ని రూపొందించడానికి అనేకమైన ఉద్యమాలు, పోరాటాలు, తిరుగుబాట్లు జరిగాయి. వాటన్నింటిలోకి మౌలికంగా విలక్షణమైనది, విస్తృతమైనది 1917 లో రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవం అందుకే ఇది విప్లవాలకు తలమానికమైంది. అంతక్రితం జరిగిన విప్లవాలన్నింటికన్నా రాసిలోనూ, వాసిలోనూ గుణాత్మకంగా ఉన్నతంగా ఉన్నతమైంది. ఈ విప్లవోద్యమానికి నాయకత్వం వహించి, రష్యన్ విప్లవానికే గాక, ప్రపంచ విప్లవాలన్నింటికీ నిర్దిష్టమైన సరైన మార్గదర్శకత్వాన్ని రూపొందించిన పార్టీ, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ. కా. లెనిన్ దీనికి ప్రత్యక్షంగా నేతృత్వం వహించాడు. అదే బోల్షివిక్ పార్టీ.



రష్యాలో బోల్షివిక్ విప్లవం జరిగి వంద సంవత్సరాలైంది. విప్లవాలకు మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతానికి కాలం చెల్లిపోయిందని ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున దుష్ప్రచారం జరుగుతుంది. విఫలమైన విప్లవాల గురించిన చర్చ ఎందుకని ప్రశ్నించే వాళ్లు ఉన్నారు. ఇలాంటి స్థితిలో మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం పట్ల విశ్వాసం ఉన్న వ్యక్తులు కూడా ఊగిసలాటకు గురౌతున్నారు. అందుకు కారణం వారి ఆలోచనలు స్వీయమానసిక ధోరణిలో సాగటమే. మానవ స్వరూప మార్పు క్రమంలో జరిగిన పోరాటాలన్నీ ఇలాంటి ఒడిదోడుకులను ఎదుర్కొంటూ సాగినవే. అందులోనూ ఆధిపత్య వ్యవస్థను కూలదోయడానికి సాగే పోరాటం అన్ని పోరాటాలకంటే దీర్ఘకాలికమైనది, ఎన్నో మలుపులు గుండా సాగేది. ఆధిపత్యవర్గాలు ఇలాంటి విప్లవాన్ని తుదముట్టించడానికి సాయుధంగానే కాక భావజాలపరంగా కూడా చివరి క్షణం వరకు కృషి చేస్తారు. ఉదాహరణకు రష్యా, చైనా విప్లవాలు జరిగి రివిజనిస్టు దేశాలు కావడం.

ఎర్రజెండా పేరుతో ఎర్రజెండాను ఓడించడానికి కుట్రలు చేస్తాయి. బోల్షివిక్ విప్లవం వీటన్నింటినీ అధిగమించి విజయాన్ని సాధించింది. ఆ విజయం వెనుక కాకలు తీరిన వేలాది మంది యోధుల పోరాట పటిమ, త్యాగనిరతి ఎంత ఉన్నదో ఎప్పటికప్పుడు అవకాశవాదుల నుండి, ద్రోహుల నుండి సైద్ధాంతికంగా పార్టీని సరైన మార్గంలో ప్రయాణింపచేయడానికి కృషి చేసిన చింతనాపరులు, మేధావులు, సైద్ధాంతిక వేత్తల కృషి కూడా మనకు విప్లవోద్యమం పట్ల, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం పట్ల అచంచలమైన విశ్వాసం కలుగుతుంది. అయితే ఈ విశ్వాసం గుడ్డిది కాదు. ఇది ప్రజల పోరాట పటిమపట్ల విశ్వాసం. ఇది వ్యక్తుల పైన కాక భావజాలపరమైన విశ్వాసం ఏర్పడుతుంది. ఇది ఒక ఆయుధంగా మారిన సిద్ధాంతం పట్ల విశ్వాసం ఏర్పడుతుంది.

### మార్క్సిజం సృష్టికర్తలు: మార్క్స్, ఎంగెల్స్

మార్క్సిజం సృష్టికర్తలైన మార్క్స్, ఎంగెల్స్‌లు స్వేచ్ఛా వ్యాపార దశలో ఉన్న పెట్టుబడిదారీ విధాన కాలంలో జరిగిన తీవ్ర వర్గ పోరాటంలో పాల్గొన్నారు. సమాజంలో జరిగిన, జరుగుతున్న వర్గ పోరాటం, ఉత్పత్తి కోసం పోరాటం, శాస్త్రీయ ప్రయోగాలు అనే మూడు మహత్తర విప్లవ ఆచరణల నుండి కార్మికవర్గ నాయకులైన మార్క్స్, ఎంగెల్స్ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని రూపొందించడానికి, అభివృద్ధి చేయడానికి తమ జీవితాలను పూర్తిగా వెచ్చించారు. తీవ్ర అధ్యయనాన్ని, సకల రంగాల లోనూ తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించే క్రమంలో, మార్క్స్, ఎంగెల్స్‌లు మార్క్సిజం లోని మూడు భాగాలను తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, శాస్త్రీయ సోషలిజం-వర్గ పోరాటం మౌలిక సూత్రాలను రూపొందించారు.

అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమ అనుభవాలను సంశ్లేషిస్తూ దాని అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు రూపొందిస్తూ వచ్చిన ఎత్తుగడలు పూర్తిగా సరైనవి అని మార్క్స్, ఎంగెల్స్‌ల కళ్ళముందే చరిత్ర రుజువు చేసింది. ప్రత్యేకించి పార్టీ, రాజ్యం, కార్మికవర్గ నియంతృత్వం వంటి అంశాలపైన మార్క్సిజం పూర్తిగా సరైనదని ప్యారిస్ కమ్యూన్ తిరుగులేని విధంగా రుజువు చేసింది.

1871 ప్యారిస్ కమ్యూన్ విజయవంతమైన అనతి కాలంలోనే పతనమైంది. కానీ వర్గ పోరాటానికి సంబంధించిన, కార్మికవర్గ నియంతృత్వానికి సంబంధించిన సిద్ధాంతం విలువ ఏ మాత్రం తగ్గలేదు సరికదా మరింత పెరిగింది. 46 యేళ్ల తర్వాత, మహత్తర అక్టోబర్ సోషలిస్టు రష్యా విప్లవం విజయవంతమైంది. ఒక విప్లవ ఓటమి అంటే అది శాశ్వతంగా ముగిసిపోయిందని అర్థం కాదు.

### రష్యా విప్లవాచరణకు కా. లెనిన్ మార్క్సిజాన్ని అన్వయించారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు మరణానంతరం మార్క్సిజం నిర్మాణ పరంగా విస్తరిస్తుండగా పెట్టుబడిదారీ గుత్త సంస్థలు ఆవిర్భవించడంతో, సామ్రాజ్యవాద ఆవిర్భావంతో దాని ప్రధాన శత్రువు బయటనుండి అమలు చేసే అణచివేత నుండేగాక, సోషలిస్టు పార్టీల లోపల నుండి కూడా దాడి చేసారు. దీనితో కార్మికవర్గ పార్టీ నాయకత్వంలో, దాని పార్టీలు, సంస్థలలో అవకాశవాదం, రివిజనిజం తలెత్తింది. అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమానికి ప్రధాన ముప్పుగా రెండవ ఇంటర్నేషనల్ మారింది. కా. లెనిన్ నాయకత్వంలో ఉన్న ఒక్క బోల్షివిక్ పార్టీ తప్పా రెండవ ఇంటర్నేషనల్‌లో వున్న దాదాపు అన్ని పార్టీలు మార్క్సిజానికి ద్రోహం చేసాయి లేదా అవకాశవాద ధోరణులకు గురైనాయి. రెండవ

(మిగతాది 34వ పేజీలో)